# మిసిమి

మాస పత్రిక

డిశెంబర్, 1993

వెల రూ.5/-





Ranjabati Sircar in Ganagavataran

# మిసిమి

**"All that we are is the product of what we have thought," is "We are what we think." – Dammapada.**

సంపుటి 5 | డిశెంబర్ 1993 | సంచిక 5

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక

భారతీయ విస్మృత విజ్ఞాన యుగము – ఆచార్య బి.యస్.ఎల్. హనుమంతరావు

వ్యక్తిత్వ వికాసం – సి. నరసింహారావు

నిర్ణయవాదం–మానవ వాదం – ఎన్.వి. బ్రహ్మం

కథక చక్రవర్తి రావిశాస్త్రి – డా. బూదరాజు రాధాకృష్ణ

స్వప్న సిద్ధాంతాలు – అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

లేఖ – ఆర్.ఎస్. సుదర్శనం

విడిప్రతి రూ. 5/-    వార్షిక చందా రూ. 60/-

### ముఖచిత్రం

*The story of Narcissus and Echo, which was a popular subject in painting, is told in the Metamorphoses of the Roman poet Ovid. Narcissus, a beautiful youth, spurned the love of the nymph Echo, and as divine punishment was made to fall in love with his own reflection in a pool and pine away gazing at himself. At his death he was turned into the flower named after him. Echo, too, faded away, until only her voice remained. The inscription to Claude's drawing in his Liber Veritatis indicates that the painting was done for on English client, but his identity is unkown.*

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Longanimity**, *n.* The disposition to endure injury with meek forbearance while maturing a plan of revenge.

**Longevity**, *n.* Uncommon extension of the fear of death.

**Looking-glass**, *n.* A vitreous plane upon which to display a fleeting show for man's disillusion given.

**Loquacity**, *n.* A disorder which renders the sufferer unable to curb his tongue when you wish to talk.

**Loss**, *n.* Privation of that which we had, or had not. Thus, in the latter sense, it is said of a defeated candidate that he "lost his election"; and of that eminent man, the poet Gilder, that he has "lost his mind." It is in the former and more legitimate sense, that the word is used in the famous epitaph:

> Here Huntington's ashes long have lain
> Whose loss is our own eternal gain,
> For while he exercised all his powers
> Whatever he gained, the loss was ours.

**Low-bred**, *adj.* "Raised" instead of brought up.

**Luminary**, *n.* One who throws light upon a subject; as an editor by not writing about it.

**Lunarian**, *n.* An inhabitant of the moon, as distinguished from Lunatic, one whom the moon inhabits. The Lunarians have been described by Lucian, Locke and other observers, but without much agreement. For example, Bragellos avers their anatomical identity with Man, but Professor Newcomb says they are more like the hill tribes of Vermont.

**Mace**, *n.* A staff of office signifying authority. Its form, that of a heavy club, indicates its original purpose and use in dissuading from dissent.

**Machination**, *n.* The method employed by one's opponents in baffling one's open and honorable efforts to do the right thing.

**Magic**, *n.* An art of converting supersition into coin. There are other arts serving the same high purpose, but the discreet lexicographer does not name them.

**Magnet**, *n.* Something acted upon by magnetism.

**Magnificent**, *adj.* Having a grandeur or splendor superior to that to which the spectator is accustomed, as the ears of an ass, to a rabbit, or the glory of a glow-worm, to a maggot.

**Magpie**, *n.* A bird whose thievish disposition suggested to some one that it might be taught to talk.

**Majesty**, *n.* The state and title of a king. Regarded with a just contempt by the Most Eminent Grand Masters, Grand Chancellors, Great Incohonees and Imperial Potentates of the ancient and honorable orders of republican America.

**Male**, *n.* A member of the unconsidered, or negligible sex. The male of the human race is commonly known (to the female) as Mere Man. The genus has two varieties: good providers and bad providers.

**Malefactor**, *n.* The chief factor in the progress of the human race.

**Malthusian**, *adj.* Pertaining to Malthus and his doctrines. Malthus believed in artificially limiting population, but found that it could not be done by talking. One of the most practical exponents of the Malthusian idea was Herod of Judea, though all the famous soliders have been of the same way o thinking.

# భారతీయ విస్మృత విజ్ఞాన యుగము

- ఆచార్య బి.యస్.యల్. హనుమంతరావు

భారతీయ సంస్కృతి కేవలము ఆధ్యాత్మికమైనదనే విశ్వాసం సర్వసాధారణమయింది, దైవచింతన, పారలౌకిక దృష్టి అనేవి ఆధ్యాత్మికతలోని ప్రధానాంశాలు. కొందరు భక్తులు ఆధ్యాత్మికతలోనేగాక, సమస్త సాంస్కృతికరంగంలోనూ భారతదేశమే ప్రపంచ రాజ్యాలన్నింటికీ గురుత్వం వహించిందంటూ ఉద్ఘాటిస్తారు. అది వేరే విషయం. ''ఒక్క గ్రీసుదేశాన్ని మినహాయిస్తే ప్రాచీనకాలంలో భారతదేశమే సక్రమ ఆలోచనా విధానాన్ని అలవరచుకొని, మానవ సహజమైన విజ్ఞాన పిపాసతో -సత్యాన్వేషణాసక్తితో తాత్త్వికరంగంలో ప్రాచీన నాగరికతా కేంద్రాలకు తలమానికమయింది. గ్రీసుదేశం కూడా తన శాస్త్ర విజ్ఞానమునకు, తాత్త్విక ఆలోచనా పద్ధతులకు భారతదేశం నుండే ప్రథమ పాఠాలు నేర్చుకొని - వానిని పెంపొందించి పాశ్చాత్య దేశాల్లో ప్రచారం చేసింది'' - అని రమేశచంద్ర దత్తు వ్రాసినాడు. ఇక్కడ మనకు-ప్రస్తుతమైన విషయము -ఇండియా నుండి గ్రీసు నేర్చిందా? గ్రీసునుండి ఇండియా నేర్చిందా? అనికాదు. పైన పేర్కొన్న పండితుని అభిప్రాయంలో - ప్రాచీన భారతదేశంలో పారలౌకికమైన దివ్యజ్ఞానమే గాక, లౌకిక ఆలోచనాక్రమంతో కూడిన యథార్థ విజ్ఞానముసైతం పెంపొందినట్లు స్పష్టము. వాస్తవానికి వైదికయుగం గడచినప్పటినుండి సహజ పరిణామక్రమంలో ఏర్పడిన సహజ పరిస్థితుల ఫలితంగా భారతీయులు యథార్థజీవిత సమస్యలపై దృష్టిమరల్చి ఆలోచించసాగినారు. అంధ విశ్వాసముకాక వివేకము, హేతువాదము, వారి ఆలోచనలకు మార్గదర్శకాలైనవి. ఈ ఆలోచనా క్రమంలోనే ప్రకృతిని పరిశీలించి తత్పరిజ్ఞానంతో విశ్వక్రమంలో మానవుని స్థానాన్ని నిర్ణయించే ప్రయత్నాలు జరిగినాయి. ఆధునిక యుగంలో విరివిగా ప్రచారానికి వచ్చిన భౌతికవాదాన్ని నాడే చర్చించి అందు అమూల్యమైన సంప్రదాయాలను మన ప్రాచీనులే స్థాపించినారు. కాని ఆ సంప్రదాయాలలో అధికభాగం కాలగర్భంలో లీనమైపోయినాయి; మరి కొన్నింటికి సంప్రదాయ పరిరక్షకులు తమకనుకూలమైన విపరీత వ్యాఖ్యానాలు కల్పించి తమ సహజరూపంలో వానిని పరిణామం పొందనీయలేదు. విల్ డురెంట్ అనే పాశ్చాత్య తత్త్వశాస్త్ర చరిత్రకారుడు చెప్పినట్లు భారతదేశ చరిత్రను పరిరక్షించుకుంటూ వచ్చిన బ్రాహ్మణులు, హైందవమత సంప్రదాయాలను గురించి, వాని పవిత్రతను గురించి ఒకే ఒక అభిప్రాయమే ఉన్నట్లు ఉద్ఘాటించి మనలను మోసగించినారని చెప్పవచ్చు. భారతీయ సంస్కృతి కేవలం పారలౌకికమనే భావం కలగడానికి ఈ బ్రాహ్మణ ప్రచార ప్రభావమే కారణం! దీని ఫలితంగానే భారతీయ భౌగోళిక విజ్ఞానము దధిక్షీర సముద్రాలతో, వెండి బంగారు కొండలతో నిండిపోయింది; చరిత్ర వేలాది సంవత్సరాలు పరిపాలించిన చక్రవర్తులతో తలతోక లేకుండా తయారయింది. ఇట్టి బ్రాహ్మణ (అ)విజ్ఞానాన్ని పాశ్చాత్య పండితులు పరిహసించినారని మనము కోపింపవలసిన అవసరము కనిపించదు; నాటి అంధవిశ్వాసాలను నిర్మూలించి హేతువాద దృష్టిని ప్రోత్సహించుటే దేశభక్తులయిన వారి ప్రథమ కర్తవ్యము.

హేతువాద దృష్టి భారతీయ సంస్కృతిలో లేకపోలేదని పేర్కొన్నాము. విస్మృతమైన ఆ విజ్ఞాన సంప్రదాయాలను పునరుద్ధరించుటే నేటి జరూరు సమస్య.

**వైదిక మతము :** ప్రాచీనకాలంలో ప్రతి తెగలోను పితృదేవతారాధన సర్వసాధారణము. ప్రకృతిలో కన్పించే ప్రతి వైచిత్ర్యము పితృదేవతల ఆగ్రహానుగ్రహాలకు ప్రతిబింబమని భావించి వారికి ప్రత్యక్ష ప్రతినిధులుగా ఏ చెట్టునో పుట్టనో పూజించడమే నాటి మతము. తమ సంతాన శ్రేయస్సులో పితృదేవతలు శ్రద్ధవహిస్తారనే భావంతో వారి తృప్తికై బలులు, సంతర్పణలు జరిపేవారు. జీవనోపాధికై దేశాలవెంట సంచరిస్తున్న దశలో ఈ తెగలు తమ పితృదేవతలకు ఒకప్పుడు ప్రాతినిధ్యం వహించిన రాయిరప్పలను దర్శించి పర్వతములను, వనములను, నదులను పూజించేవారు. భారతదేశానికి వచ్చినప్పుడు ఆర్యులీదశలోనే ఉన్నారు. సాంఘికంగా ఆర్యులందరిది ఒకే కుటుంబము; వారందరినీ నాడు కూడగట్టి ఉంచింది రక్తసంబంధ భావనయే; అనగా తామందరు ఒకే కుటుంబ సంతతి అనే బలీయమైన గుడ్డి నమ్మకము. కానీ ఇండియాలో ప్రవేశించిన ఆర్యులు అనార్యులతో మొదట ఘర్షణ పడినప్పటికీ క్రమంగా రాజీపడక తప్పలేదు. ఉభయుల మధ్య సన్నిహిత తత్త్వమేర్పడసాగింది. అనార్యులు సహితము నాటికే మంచి నాగరికత నిర్మించుకొని యుండిరి. వారి మత ఆచారాలు, దేవతలు, వైదికార్యులపై బలమైన ప్రభావాన్ని ప్రదర్శించినాయి. ఈ ఆర్య-అనార్య సమ్మేళనము ఫలితంగా ఆర్యులు తమ దేవతలకు కల్పించుకున్న పైతృక వ్యాఖ్యానాలు అర్థం లేకుండా పోయినాయి. ఆర్య సమాజానికి పునాది ఐన రక్తసంబంధం విచ్ఛిన్నమయింది. ఈ కొత్త సాంఘిక పరిస్థితులలో దేవతలు ఆర్య-అనార్య జాతులకు చెందవలసిన సర్వజనీన స్వభావం పైగాక నైతిక విలువలపై సమాజాన్ని పునర్నిర్మించే అవసరం ఏర్పడినది. వైదిక బౌద్ధయుగాల మధ్యకాలంలో భారతదేశంలో జరిగిన మానసిక కృషి అంతటికీ, ఈ సమస్యలకు పరిష్కారములను చూడడమే లక్ష్యమయింది.

**నూతన మార్గాన్వేషణ :** ఉత్తరాపథమున ఆర్యులు స్థిరపడిన అనతికాలమునకే వైదికమతంలో అసంతృప్తి ప్రబలింది. అందుకు ప్రధాన కారణములను పైన పేర్కొనినాము. 1) దేవతలకు మనుజులకు మధ్య భావింపబడిన పైతృక సంబంధాలు తొలగిపోవడం, 2) నాటి సమాజానికి అవసరమైన నైతిక విలువలను వేదమతం రూపొందింపలేకపోవడము, 3) అనార్యమత ప్రభావము 4) వీనికి తోడుగ వైదికమతం అర్థరహితమైన కర్మకాండలతో నిండిపోయి ఆలోచనాపరులలో విశ్వాసమును నీరసింపజేయడం. భారతీయ ఆధ్యాత్మికత పట్ల సానుభూతి ఉన్న సిల్వెన్‌లెవీ పండితుడు వైదిక మతాన్ని గురించి ఈ విధంగా విమర్శించినాడు: ''బ్రాహ్మణాలమతం కంటె హింసాత్మకమైనదీ, ప్రాపంచికమైనదీ మరొక మతాన్ని ఊహించలేము. నాగరికత అని చలామణి అవుతూ నీతిపూతలు పూయబడిన వారి భావాలు, ఆటవిక యథార్థతతో మనకు విస్మయాన్ని కలిగిస్తాయి.'' దాస్‌గుప్తా, రాధాకృష్ణ మొదలైన భారతీయ విద్వాంసులు సైతం వైదికమతాన్ని గురించి ఇటువంటి అభిప్రాయాలనే వెల్లడించినారు.

వైదిక కర్మల నిష్ప్రయోజకత్వాన్ని గుర్తించిన ప్రజలు నూతన మార్గాలను అన్వేషించసాగినారు. నాటి ఆలోచనలు బహుముఖంగా సాగినాయి. మోక్షమార్గం, సాంఘిక సూత్రాలేగాక జననమరణములు, కష్టసుఖాలు, వీటన్నిటికీ మూలకారణం - మొదలైన అంశాలను

గురించిన చర్చలు, పరిశోధనలు ప్రారంభమయినాయి. శ్వేతాశ్వతరోపనిషత్తులోని ఈక్రింది ప్రశ్నలు పరిశీలించండి! ''విజ్ఞుడవైన ఓ బ్రాహ్మణుడా! ఎందుకు జన్మించాము? ఏ విధముగా బ్రతుకుచున్నాము? మరణానంతరము పోవునది ఎక్కడికి? సుఖములోను, కష్టములోను ఇక్కడ ఎవరి ఆజ్ఞలకు బద్ధులమై బ్రతుకుచున్నాము? కాలము ప్రకృతి, అవసరము, అదృష్టము, పంచభూతములు - ఇవియా? లేక పురుషుడు అని పిలువబడే అనంతశక్తియా కారణము? మాకు చెప్పవలసినది'' నాటి ప్రజానీకంలో బయలుదేరిన ఆవేదన కీ వాక్యమే నిదర్శనము. అదేవిధముగా ఛాందోగ్య ఉపనిషత్తులోని 'అసతో మా సద్గమయ' అనే ఆరాటము!

**ఉపనిషత్తులు :-** వైదికకర్మ మార్గానికి వ్యతిరేకంగా భక్తి, యోగ (తపో), జ్ఞానమార్గాలు ప్రారంభమైనాయి. వీనిలో జ్ఞానమార్గము ప్రధానమైంది, ఉపనిషత్తులది ఈ మార్గమే! జీవిత సమస్యలకు పరిష్కారముగా ఆత్మ సిద్ధాంతమును ప్రతిపాదించినవి ఉపనిషత్తులు. ప్రాణమునకు, జీవి కార్యకలాపములకు ఆత్మయే కారణమనినారు ఉపనిషదృషులు. వారి దృష్టిలో ఆధివ్యాధులకు కూడ కారణం ఆత్మయే. చివరకు స్వప్నాలకు కారణం - ఆత్మ తాత్కాలికంగా శరీరాన్ని వీడి వెళ్ళడమేనని బృహదారణ్యకోపనిషత్తు భావించింది. కాని ఆత్మ స్వరూపాన్ని గురించి ఉపనిషత్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయినాయి. మానవునిలో ఆత్మ ఉన్నదని తీర్మానించినంతనే ప్రకృతిలోసైతం ఆత్మ ఉన్నదని అంగీకరింపవలసి వచ్చింది. ప్రకృతిలో వ్యాపించియున్న ఆత్మయే విశ్వాత్మ. అదే శాశ్వత యథార్థము; ప్రకృతికి మూలకారణము 'వ్యక్తిలోని ఆత్మ, విశ్వాత్మ యొక్క అంశమే' - అనే జ్ఞానాన్ని పొందడమే జన్మరాహిత్యానికి సాధనము; అదే మోక్షము. ఆత్మ స్వరూపమును గురించి అభిప్రాయభేదములున్నప్పటికీ మోక్షానికి యజ్ఞాలుకాని, తపస్సుగాని, సాధనములుకావనీ, ఆత్మజ్ఞానమే ఏకైక సాధనమని ఉపనిషత్తులు చాటి చెప్పినాయి.

**ప్రజా వుద్యమము :-** ఉపనిషత్తుల జ్ఞాన పిపాస, సత్యాన్వేషణాసక్తి దేశమంతటిని కదిలించినాయి. హాప్‌కిన్స్ చెప్పినట్లు, ''ఇంతకు పూర్వమే బ్రాహ్మణమతం మహాసముద్ర మధ్యంలో ఒంటరి దీవిగా నిలబడింది. ఆర్యజాతిని కూడ పూర్తిగా తన ఏలుబడిలో నుంచుకోలేక పోయింది.'' ఇక ఇపుడు ఉపనిషత్తులతో నొక మహోద్యమము ప్రారంభమయింది; సంప్రదాయికంగా విద్యావంతులు ఆలోచనా పరులతోనే ఈ ఉద్యమం ఆగిపోలేదు; సమస్త ప్రజానీకము శ్రద్ధాసక్తులతో ఆ ఉద్యమంలో పాల్గొన్నది. ఉపనిషత్తుల తరువాత ''బౌద్ధమత స్థాపనకు పూర్వం జరిగిన విజ్ఞానోద్యమాలలో చాలావరకు సామాన్య ప్రజానీకమునకు సంబంధించినవేకాని పూజారులకు వానితో ప్రమేయం లేదు.'' మోక్షమార్గమైన జ్ఞాన సముపార్జనకు ప్రజలకు స్వాతంత్ర్యంప్రసాదించినవిఉపనిషత్తులు; ఇక వారు పూజారులచేత కీలుబొమ్మలై యుండనక్కరలేదు. అందుచే యథేచ్ఛగా ప్రజలీ విజ్ఞాన మహోద్యమంలో పాల్గొన్నారు. ''భారతజాతి దార్శనికుల జాతి'' అన్న మాక్సు ముల్లరు వర్ణన ఈ కాలానికే వర్తిస్తుంది.

**రాజపోషణ :-** ఈ సందర్భంలో మరొక ముఖ్యవిషయం సైతం గమనింపదగి ఉంది. అనాదినుండి ఆర్యుల రాజకీయాలు మతప్రోక్తములు. రాజులు పూజారుల ఆజ్ఞలను శిరసావహించేవారు. ఇట్టి మతరాజకీయ విధానాలలో సాధారణంగా రాజులకు, పూజారులకు, మధ్య

సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణ మన చరిత్రలో వైదిక యుగంలోనే ప్రారంభమైనట్లు కన్పిస్తుంది. వశిష్ఠవిశ్వామిత్రుల మధ్య, పరశురామ కార్తవీర్యులమధ్య వైరం ఈ సంఘర్షణలోని చిన్న ఘట్టాలుగా భావించవచ్చును. ఉపనిషత్తుల కాలమునాటికి పూజారుల దౌర్జన్యం నుండి విముక్తి సాధించాలనే కాంక్ష రాజులలో బలపడింది. కర్మకాండలను తిరస్కరించడంద్వారా ఉపనిషద్విజ్ఞాన ఉద్యమం పూజారుల ప్రాబల్యమునకు గొడ్డలిపెట్టయినది. అందుచే నాటి రాజు లీ ఉద్యమాన్ని ఆదరించి పోషించినారు. తత్ఫలితంగా నాటి రాజాస్థానాలు తాత్త్విక వాగ్వివాదాలతో ప్రతిధ్వనించినాయి. జనక, కేకయ, ప్రసేనజిత్తు , బింబిసార, అజాతశత్రు మహారాజుల జిజ్ఞాస లోకవిదితమే; ఋష్యాశ్రమాలేకాక దేశం నలుమూలల విజ్ఞాన సమాజాలు వెలసినాయి. వేలకువేలు పరివ్రాజకులు దేశసంచారం చేస్తూ తమతమ సిద్ధాంతాలను ప్రచారం చేసేవారు. వీరి తాత్కాలిక నివాసార్థమై రాజులు, రాణులు సౌకర్యాలు కల్పించేవారు. శ్రావస్తిలో మల్లికా మహారాణి ఒక విడిది గృహం నిర్మించింది. లిచ్ఛవులు వైశాలిలో ఏర్పాటుచేసిన వాగ్వివాద మండపం, చంపక సరోవరతీరంలో గగ్గరామహారాణి నిర్మించిన భవనాలు, రాజగృహం దగ్గర మోరనివాసంలోని విడిది గృహాలు ఈ పరివ్రాజకులకు ఉద్దేశించినవే. ఈ విధంగా బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు విరుద్ధాశయాలతో దేశంలోని రెండు ప్రత్యేక వర్గాలకు ప్రాతినిధ్యం వహించాయి. ''బ్రాహ్మణులు అభివృద్ధి నిరోధకులు; అపౌరుషేయములని విశ్వసింపబడే వేదాలే వారి కాధారములు. వేదాలను వ్యాఖ్యానించే హక్కు వారికి మాత్రమే వుంది. ఇక రెండవవారు క్షత్రియులు; సాంఘిక జీవితానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో బాధ్యత ఉన్నవారు; కొంతవరకు అనార్య ఆచార వ్యవహారాలను సైతం అంగీకరించి ఆర్యలోకమున శాంతిభద్రతలను కాపాడడానికి తాపత్రయ పడేవారు. వీరిది విశాలదృక్పథం. స్వతంత్ర పరిశోధనలద్వారా వేదవిజ్ఞానాన్ని విస్తరింప జేయడమే వీరి ఆశయం.''

ఉపనిషత్తుల జ్ఞానవాదం అనేక సాంఘిక తాత్త్విక పరిణామాలకు కారణమయింది. ఆత్మ ప్రతివ్యక్తిలోనూ వుంది; ఆత్మ విశ్వాత్మ యొక్క అంశమే అనడం చేతను, ఆత్మజ్ఞానమే మోక్షసాధన మనటంచేతను, ఆర్యజాతి ఆధిక్యతకు, అగ్రవర్ణాల ఆధికత్యకు స్వస్తి చెప్పబడింది. ఆర్య అనార్యజాతి సన్నిహితత్వానికి సమ్మేళనానికి మార్గం కల్పింపబడింది. వైదిక కర్మకాండల సంస్కృతీ పరిరక్షకులైన పూజారుల అధికారం నుండి విముక్తిపొందిన రాజులు సమైక్య జాతీయ శ్రేయస్సులనుద్దేశించి పరిపాలన సాగించడానికి పూనుకొన్నారు. ఒకవిధంగా భారతదేశంలో, లౌకిక రాజకీయాల్లో ఇది ప్రథమ ప్రయత్నంగా భావించడంలో తప్పులేదు. మరొక విశేషం - ఆత్మ సిద్ధాంతంద్వారా ఉపనిషత్తులు మానవుడు ప్రకృతి అంశమని చాటినాయి. ప్రాచీన ఉపనిషత్తులలో నొకటియైన 'శ్వాసన్వేద్యోపనిషత్తు.' ప్రకృతియే సృష్టికర్త; కాలమే లయకారుడు; వీరే లోకపాలకులు; మానవునకు సుఖదుఃఖాలనీయడంలో మంచిచెడ్డల ప్రమేయం వీరికిలేదు-అంటూ, ఆత్మ సిద్ధాంతాన్ని సైతం తిరస్కరించి భౌతికవాదానికి నాందిపాడింది.

పైన పేర్కొన్న అంశాలవల్ల నాటి మానసిక వాతావరణంలోని అశాంతి, ఆందోళన, ఆవేదన స్పష్టమవుతాయి; అంతేగాక నాటి ప్రజలు అనుభవించిన మానసిక వాక్స్వాతంత్ర్యము లను గూడ గ్రహిస్తున్నాము. మతములో, ఆలోచనారంగంలో ప్రబలిన అవ్యవస్థనుండి పెక్కు సిద్ధాంతాలు బయలుదేరినాయి. బౌద్ధవాఙ్మయం నాటికి 62 సిద్ధాంత భేదములున్నట్లు

తెలుస్తున్నది; జైన వాఙ్మయం 200లకు పైగా పేర్కొంటున్నది. ఒక్కొక్క సిద్ధాంతమున కొక పరివ్రాజక సంఘమేర్పడింది. అట్టి సంఘాలలో నిగంధ, ఆజీవిక, ముండసావక, జటిలక, మాగంధిక, త్రిదండిక, అవిరుద్ధక, గోతమక, దేవదమ్మిక అనేవి ప్రధానమైనవి. క్రమంగా ఈ సిద్ధాంత విభేదములు సమసి, వానిసారమో అనునట్లు 'దర్శనములు' తయారైనవి. వీనిలో సాంప్రదాయక సిద్ధములైనవి సాంఖ్య, న్యాయ, వైశేషికాది షడ్దర్శనములు; సంప్రదాయేతరమైనది బార్హస్పత్య మనబడే లోకాయత దర్శనము. సాంఖ్య, బార్హస్పత్యములు బౌద్ధమునకు తాత్త్వికముగ పునాదులు నిర్మించినవి.

**సాంఖ్యము :–** దర్శనాలన్నింటిలో ప్రధానమైనది సాంఖ్యం. డేవిస్ పండితుని అభిప్రాయంలో, ''సృష్టి-మానవుడు, మానవుడు-అతని భవిష్యత్తుకు ఉన్న సంబంధం మొదలైన సమస్యలను గురించి ఆలోచనాపరుడైన మానవుని ఎదుర్కొనే విచిత్రప్రశ్న పరంపరకు వివేకము, హేతుత్వము ఆధారంగా సమాధానా లీయడానికి చేసిన లిఖితరూపకమైన తొలిప్రయత్నమే'' సాంఖ్య దర్శనము (Indian Philosophy). సాంఖ్యమే న్యాయవైశేషికాది ఇతర దర్శనాలకు మూలాధారమయింది. సాంఖ్య సిద్ధాంతకారుడు కపిలుడు; ఇతడు గౌతమ బుద్ధునకు రెండు దశాబ్దాలకు పూర్వం బుద్ధుని జన్మస్థలమైన కపిలవస్తు నగరంలోనే నివసించినట్లు తెలుస్తున్నది. సమకాలిక తాత్త్విక అరాజకతనుమాన్పి, మానవుని పీడించే శారీరక, మానసిక, ప్రాపంచిక, దైవికబాధలను తొలగించి, యథార్థ విజ్ఞానాన్ని మానవునకు ప్రసాదించటమే తన ఆశయంగా ప్రకటించినాడు కపిలుడు!

నాటివరకు కేవలము అంతర్వాణియో, ఆకాశవాణియో, దివ్యజ్ఞానమో, జ్ఞానార్జనకు సాధనాలుగా వుండేవి; వీని అసమర్థతకు, మోసానికి ప్రజల అజ్ఞానమే 'శ్రీరామరక్ష'. వీని ప్రయోజనాన్ని సామర్థ్యాన్ని నిరాకరించి శాస్త్రీయమైన మార్గాన్ని సూచించినాడు కపిలుడు. ఇంద్రియ గోచరం గానిది, ప్రయోగ సాదృశ్యాలకు నిలవనిది విజ్ఞానం కాదన్నాడు. 'దర్శనము' అనే మాటకు నిజమైన అర్థమే అది! ఈ ఆలోచనాక్రమంతోనే 'రక్తతర్పణలు కోరే దేవుడు' హేతువాదానికి నిలబడడనీ, అందుచే అతడు లేడనీ, తనది 'అనీశ్వరవాద'మని నిర్భయంగా చాటినాడు. సత్యాన్వేషణకు కపిలుడు సూచించిన సాధనలే ఐరోపాలో మధ్య యుగాంతంలో సర్ రోజర్ బేకన్ సూచించి క్రైస్తవమతాధికారుల ఆగ్రహానికి గురి అయినాడు.

కపిలుని సిద్ధాంతంలో ప్రకృతి, మానవుడు మాత్రమే పరిశీలనకు సాధ్యమైనవి; యోగ్యమైనవి. అందుచేత అతడు తన ఆలోచనలను, పరిశీలనలను వానిపైనే కేంద్రీకరించి తద్వారా ప్రకృతి - భౌతిక మతాలకు పునాదులను నిర్మించినాడు. కపిలుని దృష్టిలో ప్రకృతి శాశ్వతము; స్వయం సమృద్ధము. ''ప్రకృతి పదార్థమయము; పంచభూతములు, ఇంద్రియములు, శరీరావయవములు మాత్రమే కాక బుద్ధి, పరిజ్ఞానము, మనస్సు అన్నీ పదార్థాలే. రూపంలో భేదమేకాని వస్తువులన్నియు ప్రాథమికమైన ఏకైక కుటుంబానికి చెందినవి. ప్రపంచంలో ఐక్యత యున్నది. ఆ ఐక్యతయే ప్రపంచం ఒకే పదార్థం నుండి ఉత్పన్నమైనదను విషయమును రుజువు చేస్తున్నది.

సృష్టిని, వివిధ వస్తు సముదాయాన్ని కపిలుడు కార్యకారణ సంబంధంతో వివరించినాడు: ''ప్రకృతి పరిణామాత్మకము; నిరంతర అభివృద్ధి క్రమంలో విశ్వము క్రియాత్మకమైన

పరిణామ సామర్థ్యాన్ని వ్యక్తీకరిస్తున్నది. ఈ సామర్థ్యం పదార్థానికి సహజ లక్షణము'' అన్నాడు. ఈ సిద్ధాంతాలవల్ల 'ప్రపంచంగానీ, మానవుడుగానీ భగవంతుని సృష్టికాదు. ప్రపంచానికి గానీ, పరిణామానికి గానీ సహజమైన కారణాలు అందులోనే ఇమిడి యున్నవి' అని స్పష్టమవుతున్నది. ఈ సిద్ధాంతాలన్నీ తాత్త్వికముగా సృష్టికర్తకుగానీ, విశ్వ అధినేతకు గానీ తావీయజాలవు. అదేవిధంగా సాంఖ్యసిద్ధాంతం సైతం తాను అనీశ్వరవాదమునని నిర్భయముగ ప్రకటించుకొన్నది'' అనినాడు మాక్సుముల్లర్ పండితుడు.

ప్రాణి జీవ కార్యక్రమానికి పంచవాయువులే - ప్రాణాపాన వ్యానోదాన సమానములు - కారణమని కపిలుని సిద్ధాంతము. అన్నిటికంటె ప్రధానమైనది జీవోత్పత్తి సమస్య; అనగా పదార్థమయమైన ప్రకృతినుండి జీవము ఎట్లు ఉద్భవించినది? ఈ సమస్యను పరిష్కరించడానికి కపిలుడు ఆత్మ సిద్ధాంతాన్ని అంగీకరింపక తప్పలేదు. కాని ఆత్మ భగవంతుడు కాదని కపిలుడు స్పష్టంగా వివరించినాడు. 'ఆత్మ పదార్థమునుండి స్వతంత్రమైనది; విశ్వవ్యాపకమైనది; పదార్థంతో ఆత్మ చేరడంతోనే జీవి ఏర్పడుతుంది. ఆత్మ, పదార్థంనుండి (శరీరము నుండి) శాశ్వతంగా విముక్తి పొందడమే మోక్షము. మోక్షానికి సత్ప్రవర్తనయే మార్గం'' అని కపిలుని సిద్ధాంతము. ''శాశ్వతమైన పదార్థంనుండి సర్వస్వతంత్రమైన ఆత్మను గుర్తించడమే కపిలునకు, ఆధునిక భౌతికవాదులకుగల ముఖ్యమైన భేదము'' అని ఆర్.సి.దత్ అభిప్రాయము.

**బార్హస్పత్యము :-** భౌతిక వాదాన్ని ప్రతిపాదించినప్పటికీ జీవిని వ్యాఖ్యానించడానికి సాంఖ్య దర్శనము 'ఆత్మ'ను ఆశ్రయించింది. ఉపనిషత్తుల ఆత్మ సిద్ధాంత మీవిధంగా షడ్దర్శనాలలో పరాకాష్ఠనందుకొన్నది. కాని నాటి జిజ్ఞాస ఆత్మవాదానికే పరిమితమైనదని భావించకూడదు. ఆత్మ ప్రాతిపదికను నిరాకరించి కేవలము కాలము, ప్రకృతి ఆధారంగా ప్రపంచాన్ని వ్యాఖ్యానించే ఆలోచనాక్రమం శ్వాసన్వేద్యోపనిషత్తులోనే ప్రారంభమైనట్లు కనుగొన్నాము. క్రమంగా అనాత్మవాదము లనేకం ప్రచారంలోనికి వచ్చినాయి. ఈ అనాత్మ వాదాల సారంగా బార్హస్పత్యమనే చార్వాకదర్శనము వెలిసినది. దీనికే 'లోకాయత'మని మరొకపేరు. నాటి విజ్ఞాన విప్లవ మహోద్యమమున చార్వాకులను వామ పక్షీయులుగా వర్ణించడం సమంజసమనిపిస్తుంది. వీరిది అర్థరహితమైన ఉద్రేకంతో సాగించిన ప్రచారం కాదు. వీరి సిద్ధాంతాలు కేవలం విధ్వంసాత్మకములు కావు. హేతువాదం వీరిలో ఉన్నత స్థాయినందు కొన్నది. భౌతికవాదరీత్యా నైతిక వాదరీత్యా నైతిక సమాజ సంబంధాలలో మానవ వ్యక్తిగౌరవానికి ఔన్నత్యం సాధింపగల సూచనలే వీరి సిద్ధాంతాలు. వీరి దృష్టిలో ''ప్రపంచాన్ని వ్యాఖ్యానించడానికి గానీ, అర్థం చేసుకోవడానికి గానీ సృష్టికర్త అనే ప్రాతిపదిక నిరుపయోగము. ప్రకృతి స్వభావసిద్ధంగా నేర్పడునది. నీరు చల్లగాను నిప్పువేడిగాను ఉండడం వాని ధర్మములే! మానవుని అనుభవంలోగాని, చరిత్రలోగాని, మానవుని కార్యకలాపాలలోగాని భగవంతుడు జోక్యం కల్పించుకొన్నట్లు తెలియరాదు. పదార్థమే యథార్థమైన సత్యం; ఆలోచనాశక్తిగల పదార్థమే బుద్ధి. బుద్ధితో గూడిన శరీరమే ఆత్మ. అందుచే ఆత్మ శరీరంతోపాటు నశిస్తుంది.'' జీవోత్పత్తిని గురించి సైతము వీరి సిద్ధాంతాలు చాలా శాస్త్రీయమైనవి. ''కొన్ని పదార్థాలు తమంత తాముగా ఉద్రేకాన్ని కలిగించవు; కాని వానితోనే తయారయిన పదార్థము (మదిర) ఉద్రేకాన్ని కల్గించినటులే శరీర అవయవములు రూపొంది నప్పుడు జీవి ఏర్పడుతుంది'' - అని చార్వాకుల పరిశోధన. పరిణామక్రమంలో రసాయనిక

మార్పు ఫలితంగా పదార్థ స్వరూపము, గుణము మారుననీ, జీవం ఉత్పన్నము కావడానికి గూడ అవకాశము లేకపోలేదనునది ఆధునిక రసాయనిక పరిశోధనలు తేల్చిన సత్యమేగదా! భౌతిక వాదంలో చార్వాకుల ఆలోచనలు మనకు సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తాయి. ఇక మతము, భగవంతుడు అనేవి బలహీనుల సాధనాలని చార్వాకుల నిర్ణయము. ''చిరకాలంగా మానవులు మతమునకు అలవాటుపడి యున్నందున విశ్వాసం విజ్ఞానాన్ని నిర్మూలించడంతో తాము నిస్సహాయులైనట్లు తమ జీవితమున దుర్భరము-భయానకమునయిన శూన్యం ఏర్పడినట్లు బాధపడతారు'' నీతిని గురించి సైతం వీరి సిద్ధాంతాలు హేతుబద్ధమైనవి. దేవుని స్మృతి అవినీతినుండి మానవుణ్ణి నీతి పథానికి నడిపించు కొరడావలె నుండనవసరం లేదని, వ్యక్తిలో ఆత్మవిశ్వాసము, మనోదార్ఢ్యము, ఆత్మగౌరవము ఏర్పడినంతనే మతానికి; దేవునకు స్థానం ఉండదని చార్వాకులు చాటినారు, ''నీతి మానవ సహజము; సామాజిక జీవితానికి నీతి అత్యంత్యావశ్యకము; సదుపయోగము.'' కావున నీతి నీతి కొరకే; మానవ సుఖజీవితము కొఱకు. నీతికి భగవంతునకు సంబంధంలేదు. సహజంగా నీతిపరుడైన మానవుడు నీతిగానుండుటకు భగవంతుని ఆశ్రయించుట అతని దౌర్భాగ్యము. అట్టి అవినీతికర పరిస్థితినుండి రక్షించుకొని ఆత్మగౌరవాన్ని నిలుపుకోవలెనని చార్వాకుల ఉపదేశము!

**బౌద్ధ ధర్మము :–** ఈవిధముగ విస్తరించిన విజ్ఞాన మహోద్యమమునకు శిఖరప్రాయము బౌద్ధదర్మము, నాటి ఉద్యమాలన్నింటిలో చిట్టచివరిది బౌద్ధము. కాని ప్రసిద్ధమైనది - ప్రబలమైనది బౌద్ధమే. ఈ సిద్ధాంత స్థాపకుడైన గౌతమ బుద్ధునకు కపిల బృహస్పతులవలె సునిశితమైన బుద్ధితోపాటు విశాలమైన హృదయముంది. ప్రాణికోటిపట్ల సజీవమైన దాక్షిణ్యా వాత్సల్యాలు ఆతనిలో మూర్తీభవించినాయి. కొత్త సిద్ధాంతాన్ని స్థాపించడమేగాక ఆ సిద్ధాంతంపై పరిపూర్ణమైన సమాజమును నిర్మించడమే - పునర్నిర్మించడమే - ఆతని జీవితకాంక్ష.

సాంఖ్య బార్హస్పత్యాలపై నేర్పడిన బౌద్ధధర్మము సమకాలికమైన సాంఘిక తాత్త్విక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించింది. బౌద్ధధర్మము ప్రకారం ''ప్రపంచము నిస్సందేహముగా యథార్థము; జీవితమూ యథార్థమే. ఈరెంటిని నిర్లక్ష్య మొనర్చుటకాని, వీటినుండి తప్పించుకొనుటకు ప్రయత్నించడం కాని వెర్రితనము. మానవుని జీవిత గమనమాతని చేతిలోనిదే; ఆతని సుఖదుఃఖాల కతడే బాధ్యుడు.''

''ఆత్మ ఉన్నదా? లేదా?'' అనే ప్రశ్నకు బుద్ధుడు సూటియైన సమాధానం ఇవ్వడానికి నిరాకరించినాడు. కాని బౌద్ధం 'అనాత్మ సిద్ధాంతమే'నని పలువురు విమర్శకుల అభిప్రాయము.'' శరీరమున్నంత కాలము మానవుని దేవతలు-మానవులు చూడగలరు; ప్రాణము పోయి శరీరము నశించినంతనే అతణ్ణి దేవతలుగాని, మానవులుగాని చూడలేరని బ్రహ్మజాల సుత్తలో బుద్ధుని ఉపదేశము. అంతేగాక త్రివిధమోహములలో ఆత్మలో విశ్వాస మొకటియనీ, ఆ విశ్వాసమే మానవుని పాపకార్యాలకు పురికొల్పుతుందని బుద్ధుడు బోధించినాడు. వివిధభాగములు కలిపి రథమేర్పడునట్లుగానే, భౌతికములు, ఇంద్రియములు, మానసికములునగు పంచస్కంధములు, కలిసి శరీరమేర్పడునని బుద్ధుని భావన. జీవితంలో మానవుని 'కర్మ' ద్వారా ఏర్పడిన సంస్కారమే పునర్జన్మకు కారణంగా బుద్ధుడు బోధించినాడు. కాని కొందఱు విమర్శకుల దృష్టిలో బుద్ధునికి పునర్జన్మలో సైతం విశ్వాసం లేదు!

బౌద్ధధర్మంలో స్వర్గనరకములు లేవు. ఇహములోని సత్ప్రవర్తనకు పరలోకంలో బహుమతులుగాని, దుష్ప్రవర్తనకు శిక్షలుగాని లేవు. కాబట్టి బౌద్ధధర్మం ప్రకారం సత్ప్రవర్తన వ్యక్తి శ్రేయస్సుకు సమాజశాంతి, అభ్యున్నతులకే అని అనడంలో విప్రతిపత్తిలేదు. 'నిర్వాణం' అనేది ప్రపంచంలో సాధించి అనుభవించేది మాత్రమే. అది ఒక జీవితదశ. ''పవిత్ర మానసిక శాంతితోకూడి పాపరహితము, నిరామయం ఐన జీవితమే నిర్వాణము. పవిత్ర జీవితమే బుద్ధుని చరమ లక్ష్యం; అదే నిర్వాణం; అదే బౌద్ధుల స్వర్గం.''

''పతనోన్ముఖమైన సమకాలీన పూజారి గోప్యవిధానములకు బదులుగా, జిజ్ఞాసాత్మకమైన శాస్త్రీయవాదానా పద్ధతి నవలంబించినాడు బుద్ధుడు. ఆతని పద్ధతియే మతంలో ఉత్సాహకరమైన నూతన మార్గాలను చూపింది.'' వ్యర్థమైన వాగ్వివాదాలతో కాలహరణం చేయక, యథార్థ జీవిత సమస్యలకు సూటిగా పరిష్కారములు సూచింప బూనడమే బుద్ధునిలోని నవ్యత. ''ప్రపంచమెలా ఉద్భవించింది?' అనే ప్రశ్నకంటె, 'ప్రపంచము నేవిధంగా మరమ్మత్తుచేయవలె?' అనే సమస్య ప్రధానమైనది; పరిష్కారయోగ్యమైనది.

బౌద్ధధర్మము ''బీదలపాలిటి కొత్తసువార్త''; నైతిక, సాంఘిక సంబంధాలతో సామాన్య ప్రజలను ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార పరిశోధనయే నాటి విజ్ఞానోద్యమమునకు ఆశయంగా పైన పేర్కొన్నాము. ఈ ఆశయంతో జరిగిన ప్రయత్నమునకు స్పష్టమైన రూపమునిచ్చి, ఆ పరిష్కారమార్గాన్ని ఆచరణలోకి తీసుకురావడమే బుద్ధునిలోని విశిష్టత. జాతి, వర్ణసమత్వము, వైదిక కర్మల నిష్ప్రయోజకత్వము, సత్య అహింసలతో గూడిన వ్యక్తి నైతిక ప్రవర్తన-అనేవి మూలసూత్రాలుగా గ్రహించి, సాధ్యమైనంతవరకు తాత్త్విక క్లిష్టతలను తొలగించి, నూతన జీవిత విధానాన్ని ప్రజలకు అందించినాడు బుద్ధుడు. అందుచేతనే ఒక విమర్శకుని దృష్టిలో ''బౌద్ధమును మత విప్లవమనడంకంటె, సాంఘిక విప్లవమనడం ఎంతేని సమజంసము.'' వేదకాలంలోను, ఇతిహాస కాలంలోను ఆర్యులు అనార్య జాతులపై జరిపిన యుద్ధాలకంటెకూడ, అనార్యులను వశపరచుకొనుటలో ఎక్కువ సామర్థ్యాన్ని ప్రదర్శించినది బౌద్ధము. ఆర్య అనార్యజాతులను కూడగట్టడంలో బౌద్ధము దృఢమైన నైతిక సంబంధాన్ని ప్రసాదించింది.

నాటివరకు అగ్రవర్ణాల ఆధిపత్యంలోనున్న క్రిందివర్ణాలలో బౌద్ధమొక నూతన చైతన్యానికి కారణమయింది. బౌద్ధం ప్రబోధించిన సమతాభావం, ఆభావంపై సమాజాన్ని పునర్మించాలనే దీక్ష - ఈరెండూ క్రిందివర్ణాలను పైవర్ణాలపై తిరుగుబాటుకు పురికొల్పినాయి. ఇందుకు నిదర్శనమే మగధరాజ్యంలో జరిగిన రాజకీయ విప్లవము. క్షత్రియులైన శిశునాగులను నిర్మూలించి, శూద్రులైన నంద వంశస్థులు మగధసింహాసనాన్ని ఆక్రమించినారు. మతంలోనూ, సమాజంలోనూ మాత్రమేగాక, రాజకీయాలలో సైతం అగ్రవర్ణాల గుత్తాధికార విచ్ఛిత్తియే నందవిప్లవ ప్రాధాన్యము. తరతరాలుగా క్రింది వర్ణాలలో అగ్రవర్ణాలపై పెరిగిన ద్వేషానికి, ప్రతీకారకాంక్షకు నిదర్శనము. మహాపద్మనందుని ''సర్వక్షత్రాంతక'' బిరుదము. నందరాచరికము బౌద్ధం సాధించిన సమగ్ర విప్లవానికి తార్కాణము!

**విప్లవ తిరోగమనము :-** కాని, ఇతిహాస కాలమున ప్రారంభమైన విజ్ఞాన మహోద్యమానికి నందవిప్లవమే ''భరతవాక్య''మైంది. అందుకు రెండు ముఖ్యకారణాలను పేర్కొనవచ్చు. మొదటి కారణం బౌద్ధంలోని లోపాలు, సాంఘిక సంబంధాలలో మార్పులను సూచించినదే

గాని, బౌద్ధ ధర్మము ఆ సంబంధాలకు ప్రత్యక్ష ఆకృతులైన సంస్థలలో మార్పులు తేవడానికి ప్రయత్నించలేదు. ఆర్య రాజకీయ సిద్ధాంతాలను యథాతథంగా అంగీకరించింది. సమతా సిద్ధాంతంపై సమస్త ప్రజానీకము శ్రద్ధతో పనిచేయగల విశాల సంస్థను నిర్మింపజాలకపోవడమే బౌద్ధంలోని ముఖ్య లోపం. మరొక విశేషం; గౌతమ బుద్ధుడు, భారతీయుల దృష్టిని ప్రకృతి పరిశీలననుండి ఆత్మపరిశీలనపైకి మరలించినాడు. గ్రీకు సాంస్కృతిక చరిత్రలో సోక్రటీసుకు గల స్థానమే ఇండియాలో బుద్ధునకు ఉన్నదని చెప్పవచ్చు. సోక్రటీసు బోధనలన్నిటిలో ముఖ్యమైనవి "Know thyself" అనికదా! తత్ఫలితముగా కపిల కణాదులలో ఉన్నత శిఖరాల నందుకొనిన విజ్ఞాన ఉద్యమము తిరోముఖం పట్టింది! ఇక రెండవకారణము: నంద విప్లవంవల్ల అగ్రవర్ణాలలో కలిగిన అలజడి. నాటివరకును క్షత్రియులు విజ్ఞాన ఉద్యమాన్ని పోషించినారు. కాని పరిస్థితులు విషమించినాయి. నందవిప్లవంతో వారి అధికారానికే ప్రమాదం సంభవించింది. అందుచే, బ్రాహ్మణులతో వైరము తమ అధికారానికి ముప్పుతెచ్చునని క్షత్రియులు, క్షత్రియులతో వైరము వర్ణధర్మాలకు, వైదికకర్మలకు తద్ద్వారా తమ మనుగడకు భంగం కల్గించగలదని బ్రాహ్మణులు గుర్తించినారు. అంతటితో బ్రాహ్మణ క్షత్రియ వర్గాలు రాజీపడి శతాబ్దాలుగా పెరిగివస్తున్న సాంఘిక తాత్త్విక విప్లవాన్ని ప్రతిఘటించే ఉద్యమానికి నాయకత్వం వహించారు. మగధలో క్షత్రియ వంశమైన మౌర్యులు ప్రతిష్ఠింపబడినారు. చాణక్య చంద్రగుప్తులు నందులచే పరాభవింపబడిన బ్రాహ్మణక్షత్రియ యువకులేకదా! ఈ రాజీఫలితంగా క్షత్రియులు వర్ణాశ్రమ ధర్మ రక్షణకు పూనుకొన్నారు. బ్రాహ్మణులు రాజకీయంగా క్షత్రియుల ఆధిక్యము నంగీకరించినారు. చంద్రగుప్తుడు జైన మతాభిమాని ఐనను చక్రవర్తిగా క్షత్రియుల బాధ్యతలనే నిర్వహించినాడు. ఈ వాతావరణంలోనే చాణక్యుడు తన అర్థశాస్త్రంలో లౌకిక రాజకీయాలకు పునాదివేయ ప్రయత్నించినాడు. అయినను రాజకీయ అధికారానికి మతం బలమైన సాధనంగా ఉపయోగించింది.

**విజ్ఞాన పునరుజ్జీవన ఆవశ్యకత :–** విజ్ఞాన యుగం అంతరించింది; వైదికులు తమ మతాన్ని, సంప్రదాయాలను పునరుద్ధరించి రక్షించుకొనే ఆశయంతో నాటి విజ్ఞానాన్ని బలిచేసినారు. కపిల కణాదుల సిద్ధాంతాలను విపరీత వ్యాఖ్యానాలు చేసి మతంలో కలుపుకొన్నారు. హేతుత్వానికి, స్వాతంత్ర్యానికి బదులు, విశ్వాసము, అధికారదాస్యం ప్రబలినాయి; వైదిక సంప్రదాయ రక్షణకై పుక్కిటి పురాణాలు, ధర్మ సూత్రాలు తయారయినాయి. అదియే హిందూ ధర్మంగా, ఆధ్యాత్మిక సంస్కృతికి మూలంగా నేటికీ విశ్వసిస్తున్నారు; ప్రాచీన విజ్ఞాన సంప్రదాయాలు విస్మృతి పథంలో పడిపోయినాయి.

లౌకిక ప్రజాస్వామ్యం, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి, సమతాసమాజము తన లక్ష్యాలుగా స్వతంత్ర భారతజాతి ప్రకటించుకొన్నది. ఈ లక్ష్యసాధనకై జాతికి అవసరమైన ఉత్తేజము మన పుక్కిటిపురాణములనుండి లభించదనడం నిర్వివాదాంశం; కపిల, కణాద, గౌతమ బుద్ధాది దార్శనికులు స్థాపించిన విజ్ఞాన సంప్రదాయాలు మాత్రమే మనజాతికీనాడు శరణ్యములు. కాబట్టి రెండువేల ఏండ్లనాడు నిరోధింపబడిన విజ్ఞాన ఉద్యమాన్ని పునరుద్ధరించి, నాటి సంప్రదాయాలను, యథార్థరూపంలో అవలంబించడమే మన కర్తవ్యం. రాజకీయ, సాంఘిక సంస్కరణలు, ఆర్థిక విజయాలు, మన ప్రజలలో భావవిప్లవం జరిగిననాడే రుజువయిన శాశ్వతమైన ఫలితాల నియ్యగలవు. సమగ్రమైన జాతీయాభ్యుదయమే నిజమైన ఆధ్యాత్మిక ఔన్నత్యము! ★

# వ్యక్తిత్వ వికాసం

## ఇతరుల అభినందలు పొందడం ఒక మానసిక అవసరంగా తయారయ్యిందా?

'రేపు' సంపాదకుడు
- సి. నరసింహారావు

మీరు చేసే పనులన్నింటికీ, ఇతరుల అంగీకారం పొందాలనుకొంటూ, వేటినయినా, ఇతరులు ఆమోదించకపోతే, వాటిని గురించి మథనపడిపోతున్నారా? మనందరం, ఇతరులు మనల్ని అభినందించాలనీ, పొగడాలనీ, ఎదురు చూస్తుంటాము. ఇతరుల అభినందనలు పొందడం ఆనందకర విషయమే! అయినపుడు ఈ ఆనందాన్నెందుకు కోల్పోవాలి? కాని మనం చేసిన ప్రతి పనికీ ఇతరుల ఆంగీకారం, అభినందనలు పొందాలన్న కాంక్ష, నిత్యం మనల్ని వేధిస్తుంటే, అది మన వికాసానికి అడ్డుగోడలు కడుతుంది.

**ఇతరుల అభినందనల కోసమే ఏ పనీ చేయవద్దు :** మీరు చేసే పనులన్నింటికి ఇతరులు అంగీకారం తెలపాలని ఎదురు చూస్తునప్పుడు, వారలా అంగీకారం తెలుపకపోతే, మీరు తల్లడిల్లి పోవడం జరుగుతుంది. అంతేకాదు. తాము చేసే ప్రతిపనికి ఇతరులు అంగీకారం తెలపాలని, అభినందించాలని, ఎదురు చూడడంతో అసలు సమస్య ఉత్పన్నమవుతుంది. ఇలా ప్రతి సందర్భంలోనూ, ఇతరుల అంగీకారం పొందాలనుకొనేవారు, జీవితంలో తీవ్రమైన నిస్పృహకు లోను కావలసి వుంటుంది. ఇతరుల అభినందనకోసం, ఎదురు చూసే వ్యక్తులు ఇక జీవితంలో ముందుకు ఎదగలేరు.

జీవితంలో, మనం అనేక సందర్భాలలో, ఇతరుల అనంగీకారాన్ని ఎదుర్కోవలసి వుంటుంది. మీరో క్రొత్త పనిని, మీ అంతట మీరు, సొంతంగా చేస్తున్నప్పుడు, సహజంగానే ఇతరులు దానిని ఆమోదించలేరు. అనుమానాలను వెలిబుచ్చుతారు. అనంగీకారాన్ని తెలియ జేస్తారు. నిరంతరం ఇతరుల అంగీకారానికై ఎదురు చూసే వ్యక్తి, సొంతంగా ఏ పనీ చేయలేడు. సొంత ఆలోచనలను ఆదరించలేడు. ఒకతను అధికారంలో వున్న రాజకీయ పక్షం గురించి తన అభిప్రాయాలు తెలియజేస్తాడు. అది అవినీతికర ప్రభుత్వం అంటాడు. ఎదుటి వ్యక్తి ఆ అభిప్రాయాన్ని ఖండించితే, తన అభిప్రాయం అది కాదని, మొత్తం రాజకీయ పక్షాలన్నీ అవినీతికరమైనవేనని అంటాడు. ఎదుటి వ్యక్తి ఈ అభిప్రాయాన్నికూడా త్రోసిపుచ్చితే, సమాజమే అవినీతిమయమని, అసలు ఏ రాజకీయపక్షాన్ని, ఏమీ అననవసరం లేదని అంటాడు. ఇలా, క్షణక్షణానికి తన అభిప్రాయాల్ని మార్చుకొంటూ, తనకు సొంత వ్యక్తిత్వం లేదని, నిరూపించుకొంటుంటాడు. అలాగే, ఎదుటివారు చెప్పే వాటన్నింటికీ తల ఊపుతూ, ఎదుటివారికి కూడా లేనిపోని ఇబ్బందిని కలిగిస్తాడు. ఇతరుల విమర్శను ఎదుర్కోవడం కంటే, వారి అంగీకారాన్ని పొందడమే, ఇటువంటి వారికి ఎంతో తేలికైన పనిగా తోస్తుంది.

''మీ ఇష్టం వచ్చినట్లు చేయడం తప్పు, అనుభవజ్ఞులైనవారు చెప్పినట్లు నడుచుకోవాలని'' మనకు చిన్నతనం నుండీ పెద్దలు నూరిపోస్తుంటారు. మనల్ని గురించి ఇతరులు ఏమనుకొంటున్నారో తెలుసుకోవడం, అత్యంత ప్రధానవిషయంగా చెబుతుంటారు. మీ అభిప్రాయాల కంటే, ఇతరుల అభిప్రాయాలే, అత్యంత ప్రధానమైనవని బోధిస్తుంటారు. ఇతరులంతా మిమ్మల్ని గొప్పవారని భావిస్తేనే మీరు గొప్పవారు. ఇతరులెవరూ పట్టించుకోకపోతే, మీకేమీ విలువవుండదు. ఈ అభిప్రాయాలను త్రోసిపుచ్చి, మీరు, స్వతంత్రంగా నిర్ణయాలు తైకొంటుంటే, మిమ్మల్ని స్వార్థపరునిగా, ఇతరులను లక్ష్యపెట్టనివానిగా, పెద్దలను లెక్కచేయని వానిగా, పరిగణించడం జరుగుతుంది. చుట్టూవున్న సమాజంలో ఇటువంటి ధోరణి బలీయంగా వుండడం వలన ఇలా ఇతరుల అంగీకారానికై ఎదురు చూడడాన్ని చాలామంది తమకు తెలియకనే అలవరచుకోవడం జరుగుతుంది.

**ప్రతి ఒక్కరి అంగీకారాన్ని పొందడం ఏ ఒక్కరికీ సాధ్యంకాదు:** ఈ ప్రపంచంలో, ప్రతి ఒక్కరినీ సంతోషపరచడం, ఎవ్వరికీ సాధ్యమయ్యే విషయం కాదు. మీకు పరిచయంవున్న వారిలో, కనీసం సగం మందిని మీరు సంతోషపరచ గలిగినా, అదెంతో గొప్ప విషయమే! అంటే, మీరు ఇతరుల అంగీకారం పొందడానికి ఎంతటి అవకాశంవుందో, అలాగే ఇతరుల తిరస్కారం ఎదుర్కోవడానికి కూడా, అంతే అవకాశం వుంది. మీరు వెలిబుచ్చిన అభిప్రాయంతో ఎదుటి వ్యక్తి ఏకీభవించనంతటి మాత్రాన, మీరు బాధపడనవసరం లేదు. అలాగే మీ అభిప్రాయాన్ని, ఎదుటి వ్యక్తి కోసమని, తక్షణమే మార్చుకోనవసరం లేదు. మీతో విభేదించే వ్యక్తులు, మొత్తంమీద సగంమంది వుంటారనుకొంటే, మీ ఎదుటి వ్యక్తి అలా ఆ కోవకు చెందినవాడని గుర్తించండి.

## ఇతరుల అభినందనలు పొందడం ఒక మానసిక అవసరంగా తయారయ్యిందా?

ఇలా ఎదుటివారి అంగీకారంకోసం ఎదురుచూసే వ్యక్తి తనతో ఎవరైనా విభేదిస్తే, తీవ్రమైన నైరాశ్యానికి, ఆందోళనకు లోనవుతాడు. ఎదుటివారు ఒప్పుకోరనే అనుమానం వస్తే, తాను చెప్పదలచుకొన్నది సూటిగా చెప్పకుండా, డొంక తిరుగుడుగా చెబుతాడు. తాను చెప్పిన దానికి, వ్యతిరేక విషయాన్ని ఎవరైనా చెబితే, తాను అవమానానికి గురయ్యానని అనుకొంటాడు. ఎదుటివారికి ఎటువంటి అభిరుచులూ లేవని నిందిస్తాడు. ఎదుటివారు చెప్పే ప్రతిదానికి తల వూపుతూ, తన అంగీకారాన్ని తెలియజేస్తుంటాడు. ఎదుటివారిని కాదనలేక పోతున్నందుకు, తనను తాను, లోలోపల నిందించుకొంటుంటాడు. అలాగే ఏదైనా షాపులోకి వెళ్ళినప్పుడు అక్కడి సేల్స్‌మన్ బలవంతంపై అక్కరలేనివి కూడా కొనడం జరుగుతుంటుంది. అలాగే ఒక హోటలుకు వెళ్ళినప్పుడు అక్కడ సరిగ్గా ఉడకని వంటకాన్ని కూడా, ఆ విషయం పైకి చెప్పకుండా తింటాడు. అలాగే ఎదుటివారు ఎక్కడ అయిష్టత కనబరచుతారోనని, ఇష్టంలేని విషయాల గురించికూడా మాట్లాడుతాడు. అలాగే ఎవరో భార్యాభర్తలు విడిపోవడం, ఎవరో చనిపోవడం, మరెవరో దివాళా తీయడం వంటి చెత్తవార్తలు పదిమందికీ చెబుతూ, వారి దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తాడు. తను చేయని పనికి కూడా, క్షమాపణలు చెప్పడానికి సిద్ధపడతాడు. అలాగే, అందరూ తనను గుర్తించాలన్న ఉద్దేశంతో పెళ్ళిళ్ళకు, సభలకు, ఆలస్యంగా వెళుతుంటాడు. అలాగే తనకు తెలియని విషయాల గురించి సైతం తెలిసినట్టు నటిస్తూ ఇతరులకు వివరించి చెప్పబోవడానికి, ఇతరుల మన్నన పొందడానికి ప్రయత్నిస్తుంటాడు. అలాగే తాను చేసిన, చేయని విషయాలను,

వివరిస్తూ ఇతరుల అభినందనలు పొందడానికి ప్రయత్నిస్తుంటాడు. మీరు ఇటువంటి ప్రవర్తనను అన్నిచోట్లా గమనించవచ్చు. ఇలా, ఇతరుల అంగీకారాన్ని పొందడం, మీకు, ఒక మానసిక అవసరంగా మారినప్పుడు, ఆ ధోరణిని సరిదిద్దుకోవడానికి మీరు ప్రయత్నించి తీరాలి.

మీకు తెలిసిన వ్యక్తులందరిలోను, ఇతరుల అంగీకారాన్ని ఎక్కువగా పొందగోరేదెవరు? అతనెలా వుంటాడు? అతనేం చేస్తున్నాడు? అతనిలో ఇతరులందరినీ ఆకర్షించే అంశాలేమిటి? మీరు సరిగా జ్ఞాపకం చేసుకోగలిగితే, ఇలా అందరి అంగీకారాన్ని పొందగోరేవ్యక్తి, ఒక వెర్రిబాగుల వాడయి వుంటాడు. అందరూ అతన్ని చూసి నవ్వుకొంటుంటారు. అతను నిజాయితీలేని వాడని, వ్యక్తిత్వం లేనివాడని, అతన్ని నమ్మగూడదని ఇతరులు అనుకొంటుంటారు. అసలు తమ ప్రయత్నమే లేకుండా ఇతరుల మన్నన పొందేవారు చాలమంది వుంటారు. ఇతరులేమనుకొంటున్నారో ఆలోచించే తీరికే వీరికి వుండదు. తమ పనేదో తాము చేసుకొంటుంటే, వీరికి అందరి దగ్గర నుండీ అభినందనలు వచ్చిపడుతుంటాయి.

**ఎదుటివారి దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి:** మీరు, ఇతరుల అంగీకారాన్ని పొందాలని తాపత్రయపడే వ్యక్తులయితే, కొద్దిపాటి ప్రయత్నంతో, ఆ ధోరణిని మార్చుకోవచ్చు. మీతో ఎదుటి వ్యక్తి విభేదించినప్పుడు, మీ ఆలోచనలను, మీపైకి కాకుండా ఎదుటి వ్యక్తి పైకి మళ్ళించండి. మీరు చేసిన పనికి మీ తండ్రి ఆమోదం లభించలేదనుకోండి. అప్పుడు ఆయన అనవసరంగా తల్లడిల్లిపోతున్నారని, మీరిలా చేయడం పొరపాటని ఆయన అనుకొంటున్నారని గుర్తించండి. అలాగే, మీరు ప్రతి సందర్భంలోనూ, ఇతరుల మనస్థితి గురించి ఆలోచించగలిగితే, వారి అభిప్రాయాలను, అలవాట్లను గుర్తించగలిగితే, వారి అభినందనల కోసం ఎదురు చూసే అవసరం తప్పుతుంది.

ఎదుటివారికి మీరొక విషయం చెబుతారు. వారి అంగీకారం పొందాలని ఎదురుచూస్తారు. కాని, మీకు, వారు అంగీకారం తెలుపరు. మామూలుగా అయితే, మీ అభిప్రాయాన్ని మార్చుకొని వారి అంగీకారం పొందడానికి ప్రయత్నించేవారే! కాని ఈ సారి మాత్రం మీ అభిప్రాయాన్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించవద్దు. మీ అభిప్రాయమే సరైనదని నమ్ముతూ, ఎదుటివారి అంగీకారం కోసం, దాన్ని మార్చుకోబోవడం లేదని, మీకు మీరు చెప్పుకోండి. అలాగే, మీలోని లోపాలనెవరైనా ఎత్తి చూపితే, వారలా చూపడం అవమానంగా భావించక, మిమ్మల్ని మీరు సవరించుకొనే అవకాశం కల్పించినందుకు, వారిని అభినందించండి. అలాగే మీరు చెప్పేవాటిని ఎవరైనా వ్యతిరేకించవచ్చు. అలా వ్యతిరేకించడానికై వారికి వున్న అధారాలను వెల్లడించమనండి. మీరిలా ఒకటికి రెండుసార్లు ప్రవర్తించినప్పుడు, ఇతరుల అంగీకారానికి ఎదురుచూసే బలహీనత తగ్గుతుంది.

**విభేదించడాన్ని ఆహ్వానించండి:** అలాగే, మీరు ఏమి చెప్పినా, మీతో విభేదించే స్నేహితులెవరైనా వున్నారేమో గుర్తించండి. వారితో మీరు, వారు విభేదించే అంశాన్ని ప్రస్తావించండి. వారు స్పష్టంగా తమ అనంగీకారాన్ని తెలియజేస్తారు. మీరు తల్లడిల్లిపోవద్దు. వారు మీతో విభేదించినా, మీరు తాపీగా కూర్చోండి. వారలా విభేదించడాన్నే మీరు కోరుకుంటున్నారని, మీకు మీరు చెప్పుకోండి. వారితో విభేదం కలుగకుండా చూసుకోవడం కంటే, ఇలా విభేదాన్ని సూటిగా ఎదుర్కో కలగడం వలన, ఇకముందు, మీరు అటువంటి తిరస్కారాలు ఎదురైనప్పుడు, తాపీగా వుండడాన్ని అలవరుచకో కలుగుతారు. ఇలాగే, మీరు

ఎదుటివారి అనంగీకారాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం, మీపై తమ అభిప్రాయాలు రుద్దాలనుకొనే వారిపట్ల, ముభావంగా వుండడం అలవరచుకోవచ్చు. ఇతరులెవరో వెలిబుచ్చిన అభిప్రాయాలు, వ్యాఖ్యానాల ఆధారంగా మిమ్మల్ని మీరు అంచనా వేసుకోనవసరం లేదు.

ఇతరుల అభినందనల ఆధారంగా, మీ విలువను అంచనా వేసుకోవడాన్ని మీరు మానుకోవాలి. మీపట్ల ఎవరైనా తిరస్కారం కనపరిచితే, ఎదుటివారి తీరే అంత, అని మీరు గుర్తించాలి. వారి తిరస్కారంవలన, మీ విలువ ఏమీ క్షీణించదని గమనించాలి. వారు తిరస్కరించినంతటి మాత్రాన తల్లడిల్లిపోవలసిన అవసరమేదీ లేదని మీరు గుర్తించాలి. ఒకవేళ మీరు చెప్పింది, వారు ఆమోదించినంత మాత్రాన మీకు ఒరగబోయేదేమయినా వుంటుందా? వారు, మీపట్ల ఎటువంటి అభిప్రాయాన్ని కనపరచినా దాని ప్రభావం మీపై వుండదు. మీరు అమితమైన విలువ ఇవ్వడంవల్లనే, వారి అభిప్రాయానికి అసలు ఓ విలువ, పరిగణన లభిస్తున్నాయి.

మీతో ఎంతో సన్నిహితంగా వున్న వ్యక్తులు సైతం, మిమ్మల్ని సవ్యంగా అర్థం చేసుకోలేకపోవచ్చు. అలాగే మీరు కూడా ఇతరులను సరిగా అవగాహన చేసుకోలేక పోవచ్చు. ఈ ఆధునిక సమాజంలో అది అసాధ్యం కూడా! అందుకే సరిగా అర్థం చేసుకోలేక పోవడాన్ని, ఒక వాస్తవంగా గుర్తించాలి. అంతేతప్ప ఎవరో తమను అపార్థం చేసుకొన్నారని చింతించడం తగదు.

మీతో ఎవరైనా విభేదించితే, వారిని ఒప్పించాలని ప్రయత్నించవద్దు. మీ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పి వూరుకోండి. అలాగే, మీరు ఏయే సందర్భాలలో ఇతరుల అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తుంటారో, మీ నోట్ బుక్‌లో గుర్తించండి. అలాగే, మీరు అనవసరంగా కూడా క్షమాపణలు చెబుతుంటారేమో, మీ నోట్ బుక్‌లో పొందుపరచండి. మీ స్నేహితులలోగాని, ఇతర పరిచయస్తులలోగాని, ఎవరి అంగీకారం పొందడానికి మీరు, అధికంగా ప్రయత్నిస్తుంటారో గుర్తించండి. వారితో మీరు ఏయే అంశాలలో విభేదిస్తారో నోట్ బుక్‌లో వ్రాయండి.

అలాగే నలుగురి మధ్య సంభాషణ జరుగుతున్నప్పుడు, మీకు అవకాశం లభించినప్పుడు మాత్రమే, మీ అభిప్రాయాలను తెలియజేయండి. అంతే తప్ప, ఎవరో మాట్లాడుతున్నప్పుడు మధ్యలో జోక్యం చేసుకోవడానికి, మీకు తెలిసిన విషయాలన్నీ చెప్పబోవడానికి ప్రయత్నించవద్దు. అలాగే, మీరు, ఎదుటివారిని ప్రశ్నలతో ముంచెత్తడానికి ప్రయత్నించవద్దు. ఎదుటివారిని పది ప్రశ్నలు అడగడానికి సమాయత్తమైనా మీరు, ఒకటి రెండు మించి అడగకూడదని నిర్ణయించుకోండి.

మీరు ఇతరుల ఆమోదం పొందడం తప్పుకాదు. కాని కేవలం ఆ ఆమోదంకోసమే తపించిపోతూ మిమ్మల్ని మీరు కించపరుచుకోవడం పొరపాటు. ఇతరుల అంగీకారం, అభినందనలు, మీకు ఎంతో ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి. కాని అవి లభించనప్పుడు, క్రుంగిపోకుండా వుండడమెలాగో, మీరు ఇప్పుడు నేర్చుకోబోతున్నారు. అసలెక్కడా అనంగీకారం, తిరస్కారం ఎదురుకాకపోతే, మిమ్మల్ని మీరు సరిగ్గా అంచనా వేసుకోవడం కూడా సాధ్యం కాదు.

'రేపు' సంపాదకుడు సి. నరసింహారావు రచించిన 'వ్యక్తిత్వ వికాసం' అనే పుస్తకం నుండి ముద్రితము.

# నిర్ణయవాదం - మానవ వాదం

- ఎన్.వి. బ్రహ్మం

''మానవుడొక నిగూఢ మర్మం; ఈ చిక్కుముడిని విప్పవలసి వుంది. నీవు నీ జీవితమంతా ఈ విప్పటానికే ప్రయత్నించి వుంటే నీ సమయమంతా వ్యర్థ పరచుకొంటూ వచ్చానని అనుకోవద్దు; నేనూ ఆ పనిలోనే నిమగ్నుడై వున్నాను; ఎందుకంటే - నేను మానవుణ్ణి కావాలనుకొంటున్నాను కాబట్టి.''

- దోస్టోవిస్కీ

'దేవుడు మానవుణ్ణి తన రూపంలో సృజించాడు' అంటుంది మత విశ్వాసం. 'మానవుడు దేవుణ్ణి తన రూపంలో సృజించాడు' అంటుంది తాత్త్విక వివేకం. మొదటి ప్రకటన ప్రామాణ్య వాదానికి దోహదమవుతుంది. రెండో ప్రకటన మానవ వాదాని కాధారమవుతుంది. ప్రామాణ్యవాదం (Fundamentalism) మానవుణ్ణి ఏదో ఒక బాహ్యలక్ష్యానికి సాధనంగా పరిగణిస్తుంది. మానవ వాదం (Humanism) మానవుణ్ణే ఆద్యంతాలుగా పరిగణించి అతణ్ణి అందలమెక్కిస్తుంది. ప్రామాణ్యవాదంలో మానవుని భవితవ్యాన్ని రూపొందించేది ఏదో ఊహామాత్రమైన మానవాతీత, లేదా మానవేతర, శక్తి; మానవవాదంలో మానవుడే తన భవితవ్యాన్ని రూపొందించుకుంటాడు. ప్రామాణ్య వాదంలో ప్రామాణ్యాన్ని గూర్చిన అన్వేషణ మానవునికి బయట సాగుతుంది. మానవ వాదంలో మానవుడు తన ప్రపంచానికి తానేకేంద్రం; జ్ఞాత (Knower), కర్త (doer), ప్రమాత (measurer) వగైరా తానే కావటంవల్ల, అతడే స్వయంగా ప్రామాణ్యాని కాధార మవుతున్నాడు.

రాడికల్ హ్యూమనిస్టు తత్త్వం మానవుని కీ హోదాను కేటాయిస్తున్నదా? సామాజిక తత్త్వంగా అది ఆపని చేస్తున్నదనటంలో సందేహం లేదు. రాడికల్ హ్యూమనిజానికి చెందిన 22 సూత్రాలలో మొట్టమొదటిది 'సమాజానికి నమూనా మానవుడే' అన్న ప్రకటనతో ప్రారంభమవుతుంది. చిట్టచివరిది ఇలా అంటుంది: '' 'ప్రతిదానికి మానవుడే ప్రమాణం' (ప్రొటాగొరస్), లేదా 'మానవ జాతికి మూలం మానవుడే' (మార్క్స్) అన్న సూక్తితో రాడికలిజం బయలుదేరుతుంది. ఆత్మగతంగా విముక్తులైన నీతిపరుల సామూహిక ప్రయత్నంద్వారా ప్రపంచాన్ని స్వతంత్రమానవుల ప్రజా ప్రభుత్వంగా సౌభ్రాత్ర సంఘంగా పునర్నిర్మించాలని బాహాటంగా ప్రచారం చేస్తుంది.'' మూడో సూత్రం ఇలా ముగుస్తుంది: 'ఏ సమష్టి ప్రయత్నపు విజయాన్నైనా అందలి సభ్యులు నిజంగా పొందే ప్రయోజనంతోనే కొలవవలసి వుంటుంది.' ఆరో సూత్రంలో 'భావాలగమనం సామాజిక పరిణామ క్రమానికి సమానాంతరంగా పయనిస్తూ, ఆ రెండూ పరస్పరం ప్రభావితం చేసుకొంటూ వుంటై' అన్న వాక్యం 'మానవుడు తన ప్రపంచానికి తానే కర్త' అన్న ఏకత్వవాద విభావనపై వెలుగులు వెదజిమ్ముతుంది. రాడికల్ హ్యూమనిజానికి చెందిన ఈ భావాలన్నీ కచ్చితంగా మానవునికి హుందా తనాన్ని కల్పించే మానవవాద సారాన్ని ప్రతిబింబిస్తున్నవే.

**అసలు చిక్కు :** అయిత రాడికల్ హ్యూమనిజం నిర్ణయవాదం (Determinism)గా ఆమోదముద్ర వేసుకోవటంతో అసలు చిక్కు తలెత్తుతున్నది. మానవుడు విధిచేతిలో కీలుబొమ్మకాక తప్పని

మతపరమైన భవదాజ్ఞ సూత్రంపై ఆధారపడిన కర్మ నిర్ణయ సిద్ధాంతాని కిది భిన్నం కావచ్చు. మానవ విలువలన్నిటిని కేవలం ఆర్థిక సంబంధాల పునాదిపై నిర్మింపబడిన గోడలుగా హీన పరుస్తూ ఉత్పత్తి శక్తులు ప్రముఖపాత్ర నిర్వహించే మార్క్సిస్టు ఆర్థిక నిర్ణయ సూత్రానికి కూడా ఇది భిన్నంకావచ్చు. రాడికల్ హ్యూమనిజం వరించిన నిర్ణయవాదం - భౌతిక ప్రకృతి యొక్క నియమబద్ధత నుంచి నిష్పన్నం చేయటం మూలంగా మానవుని హేతుత్వాన్ని కించపరిచే భౌతిక నిర్ణయవాదమే. 'నియమ బద్ధమైన భౌతిక ప్రకృతి నేపథ్యంలో ఉత్పన్నం కావటంవల్ల మానవుడు అవశ్యంగా హేతుబద్ధుడు....' అంటూ ఆరంభమైన నాల్గో సూత్రంలో ఈ విషయాన్ని పొందుపరచటం జరిగింది.

ప్రతి నిర్ణయవాదం - కర్మ నిర్ణయవాదమైనా, ఆర్థిక నిర్ణయవాదమైనా, భౌతిక నిర్ణయవాదమైనా, స్వయం నిర్ణయవాదం తప్ప మరే నిర్ణయవాదమైనా - మానవుణ్ణి పంజరంలో బంధించేదే. ఆ పంజరం ఇనపది కావచ్చు, వెండిది కావచ్చు, బంగారపుది కావచ్చు. తేడా లోహంలో మాత్రమే. ఏ తరహా నిర్ణయవాదమైనా, అదెంత నాస్తికమైనదైనా, దానికన్నా ఆస్తిక కర్మనిర్ణయవాదం మరింత అపాయకరం అనుకోనవసరం లేదు. నిర్ణయవాదమన్న తర్వాత దానిలో మానవుడు నిర్ణయాధికారం కోల్పోయి బాహ్య నిర్ణయానికి బద్ధుడు కావలసి వస్తున్నది; అలాంటప్పుడు రకరకాల మార్గాంతరాలలో గుణాత్మక భేదం ఏమి ఉంటుంది? మానవునికి బాహ్యమైన ఏ ఆధారంనుంచి ఆవిర్భవించిన ఏ నిర్ణయవాదమైనా మానవుని ప్రాముఖ్యాన్నీ ఆధిక్యాన్నీ కబళిస్తుంది కాబట్టి అది, అమానుషం కాకపోతే, అమానవ మవుతుంది. ఉదాహరణకు, దైవ విభావన అపాయకర మెందు కవుతున్నది? ఎందుకంటే - ఈ జగన్నాటకంలో దేవుడు అత్యున్నతమైన సూత్రధారి స్థానానికి ఉద్గమించటం, మానవుడు రంగస్థలంపై అప్రధానమైన నటునిపాత్ర నిర్వహించవలసిన దుస్థితికి లోనుకావటం **జరుగుతున్నది** కాబట్టి.

**ప్రకృతి స్వయం ప్రకటన:** నాలుగో సూత్రం ప్రకారం భౌతిక ప్రకృతి నియమబద్ధం. దాని నియమబద్ధత మూలంగా ప్రకృతియొక్క అత్యున్నత ఫలితంగా పరిగణింపబడుతున్న మానవుడు నియమబద్ధుడుగాపేర్కొ-బడుతున్నాడు.మానవుని స్థాయిలోని నియమబద్ధతను హేతుత్వం అంటారు.

అసలు, ప్రకృతిలోని నియమబద్ధతను కనుగొనటం మానవుని కెలా సాధ్యమవుతున్నది? అతడు నియమబద్ధుడు కాబట్టి, ఆ నియమ బద్ధతను గురించిన చైతన్యం అతనికున్నది కాబట్టి - అంటే అతడు హేతుబద్ధుడు కాబట్టి - అది సాధ్యమవుతున్నది. మానవుడు హేతుబద్ధుడు కాకపోతే, భౌతిక ప్రపంచం నియమబద్ధంగా కనుగొనబడి వుండేది కాదు. జంతువుకు ప్రకృతి నియమబద్ధంగా వుండదని మనమంతా వాదిస్తుంటాం. ఎందువల్ల? చేతన ఫలమైన హేతుబుద్ధి జంతువుకు ప్రసాదింపబడలేదు కాబట్టి. అధశ్చేతనకు చెందిన సహజాత వాసన దానిని నడుపుతుంది. దీనిని బట్టి, మానవుని హేతుత్వం లేకుండా ప్రకృతి నియమబద్ధతకు ఆమోదముద్ర వుండదని స్పష్టంగా అర్థమవుతుంది. అలాంటప్పుడు - మానవుడు హేతుబద్ధుడుగా ఆత్మజ్ఞానం కలవాడుగా పరిణమించాడనీ, దానివల్ల ప్రకృతిలో తన హేతుబద్ధతకు ప్రతిరూపమైన నియమబద్ధతను అతడు పసికట్ట గలుగుతున్నాడనీ అనటం సమంజసం కాదా?

మానవుని జ్ఞానం విషయగతమూ (objective) పరిణామ శీలమూ (changeable) మాత్రమే అని మనకు తెలుసు. కాబట్టి మానవుని అనుభవపూర్వక జ్ఞానంలో భాగంగా రూపొందే కారణతా సూత్రం కాలక్రమంలో మరొక కొత్త సూత్రానికో సూత్రాలకో అస్కారమిస్తూ అదృశ్యమయ్యే అవకాశముంది. ఏమైనప్పటికీ గ్రహించేవాడూ భావించేవాడూ ప్రకృతిని గురించి ఏ అభిప్రాయమైనా రూపొందించుకొనే

వాడూ మానవుడే అని మనం గుర్తుంచుకోవాలి. మానవుడు లేకుండా ఏ జ్ఞానమూ రూపుదాల్చదు; ఏ చర్యా సంభవించదు; ఏ విలువా అవతరించదు. మానవుని ఈ కేంద్రస్థానమే అతనిని తన ప్రపంచానికి నిర్మాత (maker)గా, ప్రమాతగా చేస్తున్నది. కాబట్టి మానవుడు తన హేతుత్వం మూలంగా ప్రకృతిని అర్థం చేసుకోటానికి ప్రయత్నించినప్పుడు అతని మనస్సులో కారణతా సూత్రం అవతరించి వుంటుందనాలి.

మానవుడు ప్రకృతిలో భాగంకాకపోతే, అతడు ప్రకృతిని అర్థం చేసుకోగలిగి వుండేవాడు కాదన్నది నేను కాదనను. కాలగమనంలో ప్రకృతిని గురించి అధికాధికంగా తెలుసుకోగలుగుతున్నాడు కాబట్టి అతడు ప్రకృతి అంతర్భాగమే అని భావించవలసిందే. అదేవిధంగా, ప్రతి దానికి - జీవికి కానీ నిర్జీవికి కానీ - ఇది వర్తిస్తుంది. ప్రకృతిలోని ప్రతిదీ ఒక ప్రత్యేక స్థాయికి పరిణమించిన ప్రకృతి శకలమే. మానవుడు, తనవంతుగా, ఆత్మజ్ఞానంకల శకలంగా పరిణమించాడని చెబుతాం. నమ్మకాలు, అపరీక్షితాభిప్రాయాలు, విశ్వాసాలు, వైఖరులు, గ్రహణాలు, మానసిక స్థితులు, ఉద్వేగాలు, విలువలు - వీటికి సంబంధించి, ఈ ఆత్మజ్ఞాన స్థాయి సహజంగానే వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తుంటుంది.

ప్రకృతిలోని ప్రతిజీవికి, ప్రకృతికి సంబంధించి, దానిసొంత విషయగత ప్రపంచం దాని కుంటుంది. ఆ జీవి తన ఇంద్రియాలకు గోచరమయ్యే పరిసర ప్రపంచంతో జరిపే ప్రతిచర్య ఫలితంగా దాని ప్రపంచం నిరంతరం మారుతూ విస్తరిస్తూ వుంటుంది. ఒక జీవియొక్క విషయగత ప్రపంచమంటే ప్రకృతి ఆ జీవిద్వారా జరుపుకొనే ప్రకటన తప్ప మరేమీకాదని పరిగణించవచ్చు.

**మానవ వాదం - ప్రకృతి వాదం:** మానవుడు ప్రకృతి పరిణామంలో అత్యున్నత ఫలితమంటున్నాం. ప్రకృతిలో మరెక్కడా కనరాని ఎన్నో ప్రత్యేకతలను అతడు తన పరిణామ స్థాయిలో ప్రదర్శిస్తున్నాడు. ఆ ప్రత్యేకతలలో ఒకటి హేతుత్వం. ఈ ప్రత్యేకతలన్నీ ప్రకృతితో సమ స్వభావం కలిగి వుండాలి; ప్రకృతి తన మానవస్థాయిలో ప్రకటించుకొనే లక్షణాలుగా మాత్రమే వాటిని భావించాలి. కాబట్టి మానవునిలోనైనా, లేక ఏ ఇతర ప్రాణిలోనైనా బహిర్గతమయ్యే ప్రతి ప్రత్యేకతను ప్రకృతిలో గుప్తంగా వున్న పూర్వదశ ఆ ప్రాణిలో వ్యక్తమవుతున్న ఉత్తరదశగా పొందే పరిణామమే అని అర్థం చేసుకోవాలి మనం. పరిణామ మంటే అర్థం ఖండితంగా ఇదే కావాలి. ఆ విధంగా మనం పేర్కొంటున్న ప్రకృతిలోని నియమబద్ధతా మానవునిలోని హేతుబద్ధతా విడదీయరాని ప్రతిరూపాలు కావాలి. ఆ రెండింటిని ఒక్కటిగానే పరిగణించవచ్చు. మిగతా జీవులు మానవుడందుకొన్న హేతుబద్ధ స్థాయికి పరిణామం చెందినట్లు కనిపించవు; అందువల్ల అవి ప్రకృతియొక్క నియమ బద్ధతను గ్రహించ లేకపోతున్నాయి. ఆరకంగా అవి అలాంటి గ్రహింపువల్ల మాత్రమే సాధ్యమవుతూ నిరంతరం వృద్ధి చెందుతూ వుండే జ్ఞానానికి దూరమవుతున్నాయి.

కాబట్టి ప్రకృతిలో ప్రతిసత్యం వ్యక్తిగతమైన అస్తిత్వం కలిగి వుంటుంది; ప్రకృతి యొక్క ఒక ప్రత్యేక స్థాయికి ప్రాతినిధ్యం వహిస్తుంటుంది; ఆ ప్రత్యేక స్థాయిలో ప్రకృతిని అర్థం చేసుకొంటూ వుంటుంది; ఆ ప్రత్యేక స్థాయికి అనుగుణంగా తనను తాను మలచుకొంటూ వుంటుంది. అలా మారలేని సత్యాలు అంతరించక తప్పదు. అదే విధంగా ప్రతి మానవుడు వ్యక్తిగతమైన అస్తిత్వం కలవాడే; ఎన్నో విశిష్టతలతో కూడిన ఒక ప్రత్యేక ప్రకృతి స్థాయికి ప్రాతినిధ్యం వహిస్తున్నవాడే; ప్రకృతి యొక్క హేతుబద్ధతా లక్షణాన్ని అవగాహన చేసుకోగల హేతుత్వం ఆ విశిష్టతలలో ఒకటి. ఈ హేతుబద్ధతా లక్షణాన్ని మనం నియమబద్ధతగా, లేక కారణతగా వ్యవహరిస్తున్నాం. నిజానికి హేతుబద్ధత, నియమబద్ధత ఒకటే అయినప్పటికీ - మానవుని నుంచి ప్రారంభంకావటం మానవుడు హేతుబద్ధుడుగా పరిణమించి

నందువల్ల ప్రకృతియొక్క విషయగత స్థితిలో నియమబద్ధతను దర్శించగలుగుతున్నాడనటం మానవ వాదయుక్త మవుతుంది.

మానవుని హేతుబద్ధతను ప్రకృతి నియమబద్ధత నుంచి రాబట్టవలసి వస్తే జ్ఞాత, ప్రమాత అయిన మానవుడు వెనుకకు రెండో స్థానానికి త్రోసి వేయబడతాడు. ప్రకృతినుంచి మానవునివైపు సాగే గమనాన్ని ఎన్నుకొనే తరహా ఆలోచనా పద్ధతిని ఎవరైనా ఆదరించదలచుకుంటే వారు తమ తత్వానికి 'ప్రకృతివాద' మన్న పదాన్ని సురక్షితంగా ఎన్నుకోవచ్చు. 'మానవవాదం' అన్న పదాన్ని ఎన్నుకొనేవారు మానవుణ్ణి తమ తత్వానికి కేంద్రంలో ప్రతిష్ఠించాలి; అక్కడనుంచి ఏ పరిసర ప్రకృతి వైపయినా పయనించాలి. ప్రకృతినుంచి మానవుని వైపు పయనించటం ప్రకృతివాదం; మానవుని నుంచి ప్రకృతివైపు పయనించటం మానవవాదం.

**ఏకతా వాదానికి స్వాగతం:** ప్రకృతికి నియమ బద్ధత నంటకట్టటమంటే దానికొక పనికి మాలిన పరిచయ పత్రం ప్రసాదించటమే. ప్రకృతిలో ఎక్కడైనా ఏ జీవిలోనైనా గతంలో ప్రత్యక్షమైన, భవిష్యత్తులో ప్రత్యక్షం కాదగిన, బహిర్గత గుణాలన్నీ ప్రకృతికి సంబంధించినవే; ఇందులో సందేహం లేదు. ఏమైనా - మనిషిలోని హేతుత్వం అలాంటి గుణాలలో ఒకటి మాత్రమే. ఆవేశగుణం, అంతర్ దృష్టి, క్రమాలోచన, అంతశ్చింతన, సృజన, సహకారభావం వంటి ఇతరగుణాలు కూడ మనిషిలో వున్నాయి. మనిషిలోనే కాకుండా ఇతర జీవుల్లో బహిర్గతమైన ప్రత్యేక లక్షణాలు అసంఖ్యాకంగా వున్నాయి. అలాగే కాలక్రమంలో బహిర్గతం కావటానికి వీలుండి అంతకన్నా ఎక్కువ లక్షణాలే ప్రకృతిలో అంతర్గతంగా ఇమిడి వుండే అవకాశముంది. ప్రకృతిలో అంతర్గతంగా లేనిదేదీ ఎన్నడూ బహిర్గతం కాజాలదు.

హేతుత్వం ప్రకృతియొక్క బహిర్గత గుణమన్నది నేను కాదనటం లేదు. 'కాదా? అవునా?' అన్న ప్రశ్నతో నాకు సంబంధం లేదు. నాకు సంబంధం వున్నదల్లా ఒక ప్రశ్నతో మాత్రమే - స్థితి గతులను వ్యాఖ్యానించటంలో మనం ప్రకృతినుంచి మనిషివైపు పయనిస్తున్నామా? మనిషి నుంచి ప్రకృతివైపు పయనిస్తున్నామా? అన్నదే ప్రశ్న. మని షినుంచి ప్రకృతివైపు పయనించట మన్నదే మానవవాద విభావన అయితీరాలి; ఇది నిర్వివాదాంశం. O.W. హోమ్స్ అన్నట్లు - 'ఈ ప్రపంచంలో మనమెక్కడ నిలబడ్డా మన్నది మన మేదిశగా పయనిస్తున్నామన్నంత గొప్పవిషయం కాదని నేను గ్రహించాను.'

ప్రకృతియొక్క యథాస్థితిని తెలుసుకోవటం మన కేనాటికీ సాధ్యం కాదు కాబట్టి దానికి మనం ఏ విధమైన ప్రత్యేక లక్షణాన్నీ అంట కట్టలేము. వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తూ పరిమిత గ్రహణశక్తిగల మన పంచేంద్రియ ద్వారాలపైనా, దేశ కాలపరిస్థితుల స్థాన ప్రభావంపైనా, నిశ్చిత శక్తి కలిగి సొంత ప్రభావం ప్రదర్శించే పరికరాలపైనా, వారసత్వ స్వభావం చేతనూ పరిసరాల ప్రభావం చేతనూ రూపొందే మన సహజ వ్యక్తిత్వం పైనా, అలాంటి అనేక అంశాలపైన ఆధారపడి వుంటుంది మన జ్ఞానం. కాబట్టి ఒకే వస్తువుకు సంబంధించిన జ్ఞానం వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తుంది. ప్రతి వ్యక్తి తన ఆత్మగత (subjective) స్వభావాని కనుగుణంగా తనసొంత విషయగత (objective) ప్రపంచాన్ని రూపొందించుకొంటాడు. ఈ విధంగా ఏవ్యక్తి విషయంలోనైనా అతని ఆత్మగత స్వభావానికీ విషయగత ప్రపంచానికీ మధ్య ద్వయీభావం అంతటితో అంతరిస్తుంది. ఎందుకంటే - ఆత్మగత స్వభావం, విషయగత ప్రపంచం అవిభాజ్యాలు కాబట్టి; ఒక దాని నొకటి వదలి చాటుమాటుగా సొంత అస్తిత్వమంటూ వాటికి లేదుకాబట్టి. ఏతావతః తేలిందేమంటే - ఆత్మగత విస్తృతి, విషయగత వ్యాప్తి అన్నవి రెండూ ఒకే ఒక క్రమం. అలా ఏకతా వాదం (Monism) తిరుగులేనిదిగా అభినందనీయ మవుతున్నది.

**జ్ఞాత - జ్ఞేయం:** అస్తిత్వంలో వున్న ప్రపంచాన్ని - అంటే ప్రకృతిని - సంపూర్ణ సత్తుగా భావిస్తాం. కాంట్ పరిభాషలో ఇది యథాతథ వస్తువు (Thing-in-itself). (దీనినే ఒక వేదాంతి యొక్క సత్తు లేక బ్రహ్మం కో, లేదా హెగెలు యొక్క పరమసత్తు (Absolute Being) కో సమానం చేయాలనుకొనే వారిని నేను అపహాస్యం చేయలేను). యథాతథ వస్తువు యొక్క సంపూర్ణ వాస్తవికతను సత్యమంటారు. అయితే వ్యక్తి అయిన జ్ఞాత గ్రహించే జ్ఞేయ ప్రపంచం ఎప్పుడూ మారుతుంటుంది. వ్యక్తి అయిన జ్ఞాత తన జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహించే పద్ధతిలో ఆ ప్రపంచం యథాతథ వస్తువులో భాగమవుతుంది. ఈ జ్ఞేయభాగం యొక్క పాక్షిక వాస్తవికతను జ్ఞానం అంటాం. జ్ఞేయం వస్తువులో భాగమైనట్లే జ్ఞానం కూడ సత్యంలో భాగమవుతుంది. నిరంతరం విశాలమవుతూ వుండే ఆ వ్యక్తియొక్క జ్ఞేయ ప్రపంచమైనా అస్తిత్వంలో వున్న ప్రకృతికి (యథాతథ వస్తువుకు) మదింపు అవుతుంది. అదేవిధంగా అజ్ఞేయ ప్రపంచపు జ్ఞానంకూడ సర్వసహిత సత్యానికి మదింపే అవుతుంది. మానవుని ధ్యేయం సత్యాన్ని సాకల్యంగా సంగ్రహించటమే కనుక, అతడు తన జ్ఞానాన్ని అధికాధికంగా విస్తృత పరచుకోవటం ద్వారా తన లక్ష్యసాధనకు యత్నిస్తుంటాడు: అలా సత్య సంప్రాప్తే జ్ఞానానికి, ధ్యేయ మవుతున్నది.

'అజ్ఞాత'మన్నది వుండవచ్చు కాని 'అజ్ఞేయ' మన్నది వుండజాలదని తరచుగా అంటుంటారు. ఈ ప్రకటనలో నాకే విధమైన సహేతుకత కనిపించటం లేదు. అజ్ఞాతమన్నది కొంత ఎప్పుడూ మిగిలే వుంటుందని మన మొకసారి ఆమోదిస్తే, దాని అర్థమేమిటి? శాశ్వతంగా కొంత అజ్ఞేయంగా వుంటుందని కాదా? తెలుసుకో తగినంత మేరకు మాత్రమే నేను ప్రకృతిని తెలుసుకొని, దాని సాయంతో నా విషయగత ప్రపంచాన్ని రూపొందించుకొంటాను అంటే సరిపోతుంది. నా విషయగత ప్రపంచానికి దోహదమయ్యే సాధనా లనేకం. వాటిలో నా చేతనకు చెందినదై సత్యాంశాన్ని గ్రహించగల హేతుత త్వమూ, అధశ్చేతనకు చెందినదై సౌందర్యాంశాన్ని గ్రహించగల ఉద్వేగ తత్వమూ ఇమిడి వుంటాయి. నీతి, సౌందర్యం అనే రెండంశాలకన్నా సత్యం అన్న అంశమే ఆలోచనాపరుల దృష్టిని అధికంగా ఆకర్షించింది. అందుకే ఆధునిక మేధావి వర్గంలో 'హేతుత్వ' మన్న పదం బహుళ ప్రశంసల నందుకుంది.

ఇది ఒక ప్రధాన వివాదానికి దారి తీసింది. మానవుడు హేతుబద్ధుడు కనుక ప్రకృతిమాత అతనికి నియమబద్ధంగా కనిపిస్తున్నదా? లేక ప్రకృతిమాత నియమబద్ధం కనుక మానవుడు హేతు బద్ధుడవుతు న్నాడా? - ఇదే వివాదం. ఈ సమస్య యొక్క మొదటి ధోరణి పర్యాలోకన వాదాని (observationalism)కి, రెండోది నిర్ణయ వాదాని (Determinism)కి పునాదులుగా రూపొందాయి. ఇక్కడ రెండు పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. (1) బ్రిటిష్ తత్త్వవేత్త డేవిడ్ హ్యూమ్ (1711-1776), (2) జర్మన్ తత్త్వవేత్త ఇమ్మానుయేల్ కాంట్ (1724-1804).

**హ్యూమ్ - కాంట్:** 18వ శతాబ్ది మధ్యభాగం దాకా యాంత్రిక శాస్త్రరంగా (Field of Mechanics)న్ని జీవిసామ్య సిద్ధాంతం (Organismic Theory) పాలించింది. శాస్త్రంలో కేవలం ఊహా జనితాలైన వ్యాఖ్యానా లన్నింటికి ఇది దారితీసింది. ఈ జీవిసామ్య నియమాల అవశేషాలనుంచి యాంత్రిక శాస్త్రాన్ని ప్రక్షాళనం చేసిన ఘనత డేవిడ్ హ్యూంకు దక్కుతుంది. హ్యూం ఇలా రాస్తాడు:

> ''యావత్తు శాస్త్రానికి ఒకే ఒక తక్షణ ప్రయోజనం వుంది; భవిష్యత్ సంఘటనలను వాటి కారణాల ద్వారా అదుపుచేసి క్రమబద్ధం చేయటమెలా గన్నది బోధించటమే ఆ ప్రయోజనం.... ఒకే రకమైన సంఘటనలు ఎప్పుడూ అదే రకమైన సంఘటనలతో కలిసి వుంటై; దీన్ని గురించి మనకు అనుభవముంది; అందువల్ల మరొక విషయంచేత అనుసరింపబడే విషయంగానూ, ఆ

మరోవిషయంలాంటి విషయాలచేత అనుసరింపబడే మొదటి విషయంలాంటి విషయాలుగానూ కారణాన్ని నిర్వచింపవచ్చు. లేదా మరోరకంగా చెప్పాలంటే మొదటి విషయం వుండి వుండకపోతే రెండోది ఎప్పుడూ వుండేదే కాదు. కారణం యొక్క దర్శనం సర్వదా కార్యభావం వైపు పరివర్తనాన్ని మనస్సుకు స్ఫురింపచేయటం మామూలే. దీన్ని గురించికూడ మనకు అనుభవముంది. అందువల్ల, ఈ అనుభవానికి తగినట్లుగా, కారణం యొక్క మరో నిర్వచనాన్ని మనం రూపొందించుకోవచ్చు. మరో విషయంచేత అనుసరింపబడే విషయంగానూ, మొదటి విషయంయొక్క దర్శనం ఎల్లప్పుడూ రెండోదాని ఆలోచనను స్ఫురింప చేసేదిగానూ దాన్ని పేర్కోవచ్చు."

కాబట్టి హ్యూమ్ ప్రకారం, కారణతా సూత్రం ఆచరణ యుక్తమైన ప్రయోజనాలకోసం రూపొందిన పథకమే; అందువల్ల నేరుగా పర్యాలోకింపదగిన వాస్తవాంశాలతోనే దానికి సంబంధం వుంటుంది. దాని ప్రకారం కోరిన కార్యాన్ని ఉత్పన్నం చేయటానికి తగిన కారణం ఎప్పుడూ వుంటుంది.

కాంట్ ఒక విలక్షణమైన పద్ధతిలో హ్యూమ్‌తో భేదిస్తాడు. తన 'ఏ భవిష్యద్దర్శనానికైనా ప్రస్తావన (Prolegomena to Any Future Metaphysrics)లో ఆయన ఇలా అంటాడు:

"పరిస్థితులను, విశ్వజనీన నియమాలను (ఆ నియమాలు ఆత్మగతాలే అయినప్పటికి) పరిశోధించటం ద్వారా కన్నా మరోవిధంగా కారణాలనుబట్టి కార్యాలను ఊహించే స్వయంసిద్ధ పద్ధతి (APRIORI)లో వస్తువుల స్వభావాన్ని మనం అధ్యయనం చేయజాలం. ఈ అధ్యయనంతో మాత్రమే అనుభవంలాంటి సంజ్ఞానం (cognition) సంభవమవుతుంది.... 'ఒక సంఘటనను మనం పర్యాలోకించి నప్పుడు అది ఒక విశ్వజనీన నిబంధన ప్రకారం అనుసరించే ఏదో ఒక పూర్వ సంఘటనతో ఎప్పుడూ ముడిపడి వుంటుంది' అన్న నియమం లేకుండా పర్యాలోకనకు చెందిన నిర్ణయం అనుభవం హోదాను ఏనాటికీ అందుకోజాలదు."

సంఘటనల క్రమాలను వివరించటంలో - హ్యూమ్‌కు సంబంధించిన కారణత పర్యాలోకనలపై నొక్కుచూపుతూ వాటినుండి అగమనాత్మకమైన అనుమాన ప్రమాణం (Inductive inference) తో కారణతా నియమాన్ని సాధిస్తుంది. కాగా - కాంట్‌కు సంబంధించిన కారణత ఆ సంఘటనల క్రమాలకు విశ్వజనీన నియమాలను కూర్చటానికి యత్నిస్తుంది. ఆ విధంగా హ్యూమ్, కాంట్ లిద్దరూ వరుసగా పర్యాలోకనవాదం, నిర్ణయవాదం అనే ఆధునిక విభావనలకు పితామహు లయ్యారనవచ్చు.

ఇక్కడ హెన్రీ మార్జినో రాసిన 'భౌతిక వాస్తవికతా స్వభావం: ఆధునిక భౌతిక విజ్ఞాన తత్త్వం' (The Nature of Physical Reality: A Philosophy of Modern Physics) నుంచి ఉదాహరించుకుందాం:

"క్రమత్వ మన్నది ప్రాథమికంగా సమూహాలలో కనిపిస్తుంది; లేదా వ్యక్తిగత సంఘటనలను నిర్దేశించినప్పుడు, ఈ సంఘటనలలో అంతర్గతంగా వుండే సంభావ్యతల (Probabilities)లో క్రమత్వం కనిపిస్తుంది. నియమాలు ఈ సంభావ్యతలను పాలిస్తాయి, అంతేకాని సామాన్య సంఘటనల (Simple occurances)ను పాలించవు."

"కాబట్టి భౌతికశాస్త్ర అంతర్యంతో సామరస్యంగా వుండటానికి గాను గతకాలపు భావుకులకు చాలమందికి కొరుకుడు పడని ఒక అంతిమ నిర్ణయాన్ని మనం ఆమోదించాలి; సంభావ్యతలలో కొంత ప్రమాణం వాస్తవికత వున్నది అన్నదే ఆ నిర్ణయం.... అవిధంగా, భౌతిక

వాస్తవికతగా, సంభావ్యత పదార్థ విరహితంగా నిరవధికమైన మధ్యమంలాగా ప్రదేశమంతటా విస్తరించి వున్నది. నిజానికదొక క్షేత్రంగా రూపొందింది.''

**'దినుసూ లేదు' - 'మనసూ లేదు' :** మనిషికున్న సాధనాలు పరిమితాలే అయినప్పటికీ వాటితోనే అతడు ప్రకృతిని గురించీ, తనను గురించీ, ప్రకృతితో తనకుగల సంబంధాన్ని గురించీ అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ వున్నాడు. ప్రకృతి అంటే ఏమిటో అది ఎలా పనిచేస్తున్నదో తెలుసుకోటానికి భౌతికశాస్త్రాలే తనకు సాధనాలుగా పరిగణింప బడుతున్నాయి. కాని, నీల్స్ బోర్ అన్నట్లు 'భౌతిక విజ్ఞాన శాస్త్రం (Physics) యొక్క కర్తవ్యం ప్రకృతి ఎలావున్నదో అన్నది కనుగొనటం అనుకోవటం పొరపాటు. ప్రకృతిని గురించి మనమేమి చెప్పగల మన్నంత వరకే భౌతిక విజ్ఞాన శాస్త్రానికి సంబంధం'. కాబట్టి ఫిజిక్స్ ప్రకారం - ప్రస్తుతం మనం చెప్పగలిగింది గతంలో విభిన్న సమయాలలో చెప్పగలిగిన దానికి భిన్నం; భవిష్యత్తులో విభిన్న సమయాలలో చెప్పగలిగేది ప్రస్తుతం మనం చెప్పే దానికి భిన్నంగా వుంటుందనేది కూడ చాలవరకు సంభవం. ఇటీవలి వరకు పదార్థానికి ఆపాదింపబడుతూ వచ్చిన భౌతిక వాస్తవికత ఇప్పుడు - పదార్థ విరహితంగా నిరవధిక మాధ్యమంలాగా ప్రదేశమంతటా విస్తరించి ఒక క్షేత్రంగా వున్న సంభావ్యతకు అంటగట్టబడుతున్నది! పదార్థ విరహితంగా ప్రదేశం లేదన్నది ఈ పాటికి శుష్కనినాదంగా మారిపోయిందా? పురాతనమైన పదార్థవాదానికి మరణఘంట మోగిస్తూ పదార్థం అపదార్థమై పోయింది!

పదార్థవాదానికి మరణఘంట అంటే అర్థం ఏ విధంగానూ భావవాద పునరుత్థానం కాదు. పదార్థవాద - భావవాదాలు రెండూ - అటు శుష్క నినాదాలుగానో, లేదా ఇటు ఒకే నాణెం యొక్క బొమ్మ - బొరుసులు గానో పరిగణించవలసి వుంటుంది. 'దినుసూ లేదు' - 'మనసూ లేదు' ('No Matter' - 'Never Mind') లాంటి దేదో కావచ్చు ఆధునిక నినాదం. సత్యానికి సమీపంగా వుండటానికిగాను ఈ ప్రతికూల ప్రకటన స్థానంలో పదార్థమనస్సు, లేదా మనఃపదార్థం లాంటి ఏదో ఒక అనుకూల నినాదం రావచ్చు; తద్వారా పదార్థానికీ మనస్సుకూ మధ్య ఏనాటినుంచో ఏర్పడివున్న ద్వైతభావానికి స్వస్తి చెప్పవచ్చు.

హ్యూమ్ పర్యాలోకనకు ప్రాముఖ్యమివ్వగా పదార్థవాదులు నిర్ణయవాద విభావనను పరతత్త్వవాది అయిన కాంట్‌నుంచి అరువు పుచ్చుకున్నట్లు కనిపిస్తుంది. సుమారు మూడు దశాబ్దాలపాటు మార్క్సిస్టు మార్గాన పయనించిన ఎం.ఎన్.రాయ్ ఆ హేయప్రభావం నుంచి పూర్తిగా స్వతంత్రుడు కాలేకపోయాడు; మార్క్సిస్టు చారిత్రక నిర్ణయవాదాన్ని సంపూర్ణంగా ఆమోదిస్తూ అల్పాధారంగల ఆర్థిక నిర్ణయవాద సూత్రాన్ని ఇమిడ్చేవిధంగా భౌతిక నిర్ణయ వాదపరమైన సువిశాల పదార్థవాద ప్రాతిపదికను రూపొందించటానికి ప్రయత్నించాడు. ఆ విధంగా రాయ్ హేతువాదం, పదార్థవాదం, నిర్ణయవాదం అనే త్రికం ఆధారంగా రాడికల్ హ్యూమనిజం అన్న దర్శనాన్ని నిర్మించాడు.

**నిర్ణయవాద నిరసన :** నిర్ణయవాద సంబంధమైన కారణతాభావాన్ని నిరసించిన ఆధునిక మేధావులు గొప్ప వారున్నారు. వారిలో ఇద్దరిని నేనిక్కడ పేర్కొంటాను. వారు బెట్రాండ్ రస్సెల్, డాక్టర్ కె.ఆర్. పాపర్. రస్సెల్ గ్రంథం 'మార్మికవాదం - తర్కం' (Mysticism and Logic)లోని 'కారణ భావంపై' (On the Notion of Cause) అన్న ఉపన్యాస పత్రంలో ఆయన ఇలా అంటాడు:

''అన్ని శాఖలకు చెందిన తత్త్వవేత్తలందరూ శాస్త్రసంబంధమైన మౌలికాధార సత్యాలలో కారణత ఒకటి అని ఊహిస్తారు. అయితే, విడ్డూరమేమంటే, గురుత్వ పరమైన ఖగోళ విజ్ఞానం (Gravitational Astronomy) వంటి ఉన్నతస్థాయి శాస్త్రంలో 'కారణం' అన్న పదం ఎన్నడూ

తలెత్తదు.... తత్త్వవేత్తలలో చలామణిలోవున్న అనేక అంశాల లాగే కారణతా నియమం - అపాయకరం కాదన్న అపోహ కారణంగా మాత్రమే మనగలుగుతున్న రాచరికం లాగా - పురాతన యుగానికి చెందిన స్మృతి చిహ్నమే.''

ఆక్స్‌ఫర్డ్ మగ్దలేన్ కాలేజీలో 1948 జులై 26న జరిగిన రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్ మూడవ వార్షిక సమావేశంలో ఇచ్చిన 'సంప్రదాయ సంబంధమైన సహేతుక సిద్ధాంతం దిశగా' (Toward a Rational Theory of Tradition) అన్న ఉపన్యాసంలో పాపర్ ఇలా అంటాడు :

''వ్యక్తిగతంగా నేనెప్పుడూ స్వేచ్ఛా సంకల్పా (Free will)న్ని గురించి మాట్లాడను; ఎందుకంటే - దాని అర్థమేమిటో తగినంత స్పష్టంగా నాకు తెలియదు కాబట్టి. పైగా స్వేచ్ఛా సంకల్పానికి చెందిన మన అంతర్వివేకం (Intuition) వంచన అయివుండవచ్చు నన్న సందేహం కూడ నాకుంది. అయినా, అనేకాధారాలను బట్టి, నిర్ణయవాదం సమర్థనీయం కాని సిద్ధాంతమనీ, దానిని ఆమోదించటానికి హేతువు బొత్తిగా లేదనీ నేను భావిస్తున్నాను. నిజానికి హేతువాద సంప్రదాయంలో నిర్ణయవాదాంశాన్ని నిర్మూలించటం మనకు ముఖ్యమని నా అభిప్రాయం. అది సమర్థనీయం కాకపోవటమే కాదు; మన కది ఎడతెగని ఇబ్బందిని సృష్టించి పెడుతుంది.''

నాలుగో సూత్రం రాడికల్ హ్యూమనిస్టు కార్యకారణ సిద్ధాంతాన్ని కూడ భంగపరుస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం - బహు సంఖ్యాక కారణాలే ఏక కార్యంగా ఫలిస్తాయి. అయితే ఆ అనేక కారణాలలో ఒకటి ఎప్పుడూ ప్రధానకారణంగా వుంటుంది; ఎందుకంటే, కార్యంగా మారేది అదే కాబట్టి. అందువల్ల ప్రధాన కారణమూ కార్యమూ ఒక్కటే - ఒక్క రూపంలో తప్ప. మిగతా కారణాలన్నీ బాహ్యంగా వుండి ఆ మార్పుకు దోహదమవుతూ వుండగా ప్రధాన కారణం కార్యంలో అంతర్గతంగా వుంటుంది. ఉదాహరణకు - మట్టికుండకు మట్టి, కొయ్యకుర్చీకి కొయ్య, గ్లాసు పగలటానికి దాని పెళుకుదనం, మనిషి మరణానికి అతని మరణ స్వభావం, రోగి రుగ్మతకు అతని రోగ గ్రాహకతత్వం (Susceptibility) అంటే రోగ నిరోధకశక్తి లోపం - ప్రధాన కారణాలవుతాయి. అలాగే అన్నీ. కాబట్టి, రాడికల్ హ్యూమనిస్టు తత్త్వం ప్రకారం - మనిషి హేతుత్వానికి ప్రధాన కారణం మనిషిలోనే వుండితీరాలి. మానవుని హేతుత్వానికి కారణాన్ని ప్రకృతి నియమబద్ధతలో - అంటే మానవుని పరిధికి బయట - వెదకటం రాయ్ కారణతా సిద్ధాంతానికే విరుద్ధం. ఆరకంగా నాలుగో సూత్రం రాడికల్ హ్యూమనిజంలో కారణతా ఘర్షణకు కారణమై ఆ తత్వం లోపల హేయమైన వైరుధ్యాన్ని సృజిస్తుంది. నియమబద్ధత, అంతర్గత కారణం ఒకే చట్రంలో సహజీవనం సాగించటం సంభవం కాదు.

**అసంబద్ధ నిష్పాదనం :** ఒక దార్శనిక సిద్ధాంతం నుంచి ఒక సామాజిక తత్వాన్ని నిష్పాదించటం అహేతుకం కాదా? ఒక దానితో ఒకటి సన్నిహిత సంబంధంగల మానవ భావాల గమనమూ సామాజిక సంఘటనల గతితర్కమూ పరస్పర ప్రభావం కలిగివున్నప్పటికీ వాటిమధ్య కారణతా సంబంధం లేదని ఒక పక్క వాదిస్తున్నాం. మరోపక్క సత్తా తత్వరీత్యా (ontologically) సంబంధం లేని ప్రకృతి నియమబద్ధతకూ మానవుని హేతుబద్ధతకూ మధ్య కారణతను బలవంతంగా నెలకొల్పటానికి ప్రయత్నిస్తున్నాం.

దార్శనిక దృష్ట్యా ఒకడు హ్యూమ్ అనుయాయి కావచ్చు, కాంట్ అనుయాయి కావచ్చు - పర్యాలోకనవాది కావచ్చు, నిర్ణయవాది కావచ్చు - అయినా సమాజంలో మానవవాద ప్రజాస్వామ్య దృక్పథాలు కలిగి వుండవచ్చు. నిర్ణయవాది అయిన రాయ్‌లాగే, అనిర్ణయవాది అయిన రస్సెల్ రాజీలేని, మానవవాది, ప్రజాస్వామ్యవాది. స్పినోజా మతానుయాయి అయిన ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ మానవవాద

ప్రజాస్వామ్యాల సమర్థనకై పోరాడటానికి వెనకాడే వాడుకాదు. ఆ ఆదర్శాల ప్రయోజనాన్ని బలపరుస్తూ ఆ ప్రయోజనం కోసం అనువు అర్పించటానికి సంసిద్ధులయ్యే మతవాదులూ హేతువాదులూ వున్నారు; నిర్ణయవాదులూ అనిర్ణయవాదులూ వున్నారు; భావ వాదులూ పదార్థవాదులూ వున్నారు. తమతమ దార్శనిక నిష్పాదనల లోని సైద్ధాంతిక విభేదాలు ఒకే ఒక సామాజిక ప్రయోజనాన్ని సమర్థించకుండా అడ్డు నిలవలేదు. 'కమ్యూనిజాన్ని అధిగమించి' (Beyond Communism) అన్న తన ఉపన్యాసంలో రాయ్ - 'సిలువమీద వున్న క్రీస్తు ఊహాచిత్రాన్ని పూజిస్తూ క్రైస్తవులు 'కొండమీద ప్రసంగం (Sermon on the Mount) ప్రకారం ప్రవర్తిస్తూ ఆ ఆధారంతోనే మనతో సహకరించటానికి సంసిద్ధు'లైతే - వారికి స్వాగతం చెప్పటానికి వెనకాడలేదు. కాబట్టే రాయ్ దృష్టితో ఆలోచించినా - నిర్ణయవాదంతో నిమిత్తం లేని మతస్థులు సైతం రాడికల్ హ్యూమనిస్టు సామాజిక తత్త్వాన్ని ఆమోదించే అవకాశం పూర్తిగా వుంది. అలాంటప్పుడు రాడికల్ హ్యూమనిజాన్ని భౌతిక నిర్ణయవాద ఆరాధనకు సాధనంగా చేయటం వల్ల సాధించగల ప్రయోజన మేమిటి?

కాబట్టే మానవునిలోని అవిర్భూత ప్రతిభల్ని ప్రకృతిలోని నిద్రాణ శక్తులనుంచి విచ్ఛిన్నం చెయ్యటం అసంగతమన్నది స్పష్టం. సామాజిక తత్త్వానికి ఆధారమైన సుస్థిర మానవ స్వభావాన్ని దార్శనిక సిద్ధాంతానికి ఆధారమైన అస్థిర శాస్త్ర సంస్కృతికి తాకట్టు పెట్టకూడదు. రాడికల్ హ్యూమనిస్టు తత్వం తన అంతర్గత శక్తితో స్వేచ్ఛానంద తత్వంగా వెలుగొందాలంటే - మానవుని హేతుత్వాన్ని ప్రకృతి నియమబద్ధతనుంచి రాబట్టటం లాంటి అనవసర దార్శనిక భారాలనుండి దానికి విముక్తి కలిగించాలి.

**భవిష్య జ్ఞోస్యం పైన పటారమే:** 'ప్రపంచాన్ని స్వతంత్ర మానవుల ప్రజా ప్రభుత్వంగా సౌభ్రాత్ర సంఘంగా పునర్నిర్మించా'లనే రాడికల్ హ్యూమనిస్టు ఆదర్శానికి వాస్తవరూపం కల్పించాలంటే కావలసింది సుసంపన్నమైన చారిత్రకానుభవంపై ఆధారపడిన సహేతుక సామాజిక తత్వమే (అలాంటి అనుభవాన్ని కలిగి వుండటమే కాక వినియోగించుకొన్నాడు కూడా రాయ్). ఈ ప్రయోజన సాధనకు దార్శనిక నిష్పాదన లెంతమాత్రమూ సాయపడవు. వివాదాస్పదమైన భౌతిక నిర్ణయవాద సమస్యలో కూరుకుపోయి, ఒక సహేతుక సామాజిక తత్వాన్ని రాబట్టటంకోసం, నిరంతరం మారుతుండే శాస్త్ర నిర్ణయాలపై ఆధారపడి ఒక ఊహా దర్శనాన్ని నిర్మించాల్సిన అవసరమేమి వచ్చింది? నిజానికి రాడికల్ హ్యూమనిస్టు సామాజిక తత్వం అత్యుత్తమమైన, అనుభవ పూర్వకమైన రాయ్ ప్రజ్ఞకు ఫలితం; అలాంటి దానికి ఆధారంగా వుండటానికి ఏ దర్శనమూ అవసరంలేదు.

సూక్ష్మ పరమాణు ప్రపంచములో ముందుగా పసికట్టరాని ఎలెక్ట్రాన్ మార్గమూ, స్థూల విశ్వప్రపంచంలో పదింట ఒకపాలుగా వుండి 'జ్ఞేయ'మైన ప్రకాశ సహిత పదార్థానికి ప్రతిగా తొమ్మిదిపాళ్ళుగా వుండి అజ్ఞాతమైన ప్రకాశరహిత పదార్థమూ, జీవ పరిణామ క్రమంలో భవిష్యజ్ఞోస్యాని కందని ఉత్పరివర్తనాల గంతులూ, మనిషి మనస్సులో అత్యధికభాగం అజ్ఞాతంగా వున్న అచేతనా, మానవ పరిణామ క్రమంలో భవిష్యజ్ఞోస్యాని కందని స్వేచ్ఛా సంకల్ప ప్రభావమూ - మొదలైన వాటివల్ల ఏమి విశదమవుతున్నది? సజీవ - నిర్జీవ ప్రకృతుల దశలన్నిటిలోనూ అజ్ఞాతమైనదే జ్ఞాతమైన దానిని అధికశక్తివంతంగా ప్రభావితం చేస్తున్నదన్న వాస్తవం విశదమవుతున్నది. అలాంటప్పుడు భవిష్యత్తరాలను నిబంధించటానికి గాను సుస్థిర సూత్రాలను నిర్మించటం ఎలా సాధ్యమవుతుంది?

స్థూల ప్రపంచానికి వర్తించేది మామూలుగా సూక్ష్మ ప్రపంచానికి వర్తించదని మనకు తెలుసు. ఉదాహరణకు - స్థూల ప్రపంచానికి వర్తించే గురుత్వ నియమం (Gravitational Law) ఎలక్ట్రాన్లు,

ప్రోటాన్లు వగైరాలతో కూడిన సూక్ష్మ ప్రపంచాని కెక్కడా వర్తించదు. వైద్య రంగంలోకూడా - జీవికణం పెద్ద మోతాదులవల్ల నశిస్తుందనీ, మధ్యరకం మోతాదులవల్ల తటస్థంగా వుంటుందనీ, చిన్న మోతాదుల వల్ల శక్తిమంత మవుతుందనీ ప్రయోగాత్మకంగా నిర్ధారణ అయింది. కాకపాల (Ipecauanha) అనే దక్షిణ అమెరికా చెట్టు వేరు రెండు గ్రెయిన్లు పుచ్చుకుంటే వాంతులవుతాయి; గ్రెయినులో 200వ వంతు పుచ్చుకుంటే వాంతులు తగ్గుతాయి. కాబట్టి స్థూలమైన భౌతిక ప్రకృతిలో కనిపించే నియమబద్ధ తను సూక్ష్మమైన సాంఘిక ప్రపంచంలోనికి ఏ రూపంగానూ తీసుకు రాకూడదు; ఎందువల్లనంటే - సంఘ నిర్మాణానికి దోహదమయ్యే వ్యక్తులు మనకు తెలిసినంతలో సూక్ష్మాతి సూక్ష్మమైన మూల ద్రవ్యంతో తయారైన మనస్సులు గల మానవు లయినందువల్ల. దీనివల్ల బాహ్యాస్థంగా అసంబద్ధంగా కనిపించే నియమ బద్ధతతో ఒక దర్శనాన్ని రూపొందించి, కొన్ని హాస్యాస్పదమైన ఊహలతో రాడికల్ హ్యూమనిజానికి చెందిన సామాజిక తత్త్వాన్ని నిర్మాణం చెయ్యటం సహేతుకం కాదనికూడ దీనివల్ల తేలుతున్నది.

**విలువలేని నియమబద్ధత :** రాడికల్ హ్యూమనిజం కావాలనే సౌందర్యతత్వానికి తన 22 సూత్రాల మౌలిక ప్రకటనలో ప్రవేశాన్ని పరిహరించిందని నా విశ్వాసం. సౌందర్యతత్వం దాని నిర్ణయవాద చట్రంలో ఇమడకపోవటమే అందుకు కారణం. మితిమీరిన శాస్త్రోద్దీపనంతో తనను భౌతిక నిర్ణయవాదా నికి ముడి పెట్టుకోవటంలోనూ సౌందర్య తత్వంలాంటి విలువైన మానవాంశను త్యాగం చెయ్యటం లోనూ రాడికల్ హ్యూమనిజం బాహాటంగా తప్పుదారి తొక్కింది.

మానవాధ్యయనాలు (Humanities) మానవ సంస్కృతికి సంబంధించిన అధ్యయనాంశాలే. అవి విలువలను గురించి వ్యవహరిస్తాయనటంలో సందేహం లేదు. అయితే వాటిని సాంఘిక శాస్త్రాలనటం తప్పు పేరున పిలవటమే. శాస్త్రమంటే క్రమబద్ధమైన జ్ఞానం అన్న సామాన్యార్థంలో తప్ప, కచ్చితమైన అర్థంలో, సాంఘిక శాస్త్రాలుగా పిలువబడుతున్నవి శాస్త్రాలు కానే కావు. కాబట్టి, కేవలం తప్పుడు పేర్లు బనాయించటంద్వారా శాస్త్ర విభావనకూ విలువ విభావనకూ మధ్యవున్న అఖాతానికి వారధి కట్టటం అసాధ్యం.

రాడికల్ హ్యూమనిజం పరిపూర్ణ పరివర్తనం చెందాలి; తాత్త్విక ప్రక్షాళనం పొందాలి. అది మానవ విలువల విలువను ప్రధానంగానూ, శాస్త్రాల విలువను సాధనంగానూ పరిగణించాలి. మానవుడెంత ప్రాచీనుడో మానవ వాదమంత ప్రాచీనమనీ, మానవ విలువలు సుమారు లక్ష ఏళ్ళ క్రితం మానవునితోనే అవతరించాయనీ అంటున్నారు. అయితే శాస్త్రావతరణం మరీ ఇటీవలిదే - కొద్ది వందల ఏళ్ళకన్నా దూరం కాదు. కాబట్టి శాస్త్రం లేకుండా కూడ మానవవాదం వుండివున్నట్లు స్పష్టమవుతున్నది. మానవ విలువలు లేకుండామటుకు మానవ వాదమూ లేదు; మానవుడూ లేడు. అందువల్ల మన లక్ష్యం ముఖ్యంగా శాస్త్రాన్ని మానవవాదీకరణం చేయటమేగాని, మానవవాదాన్ని శాస్త్రీకరణం చేయటం కాదు.

రాడికల్ హ్యూమనిజాన్ని సంస్కరించటంలో తీసుకోవలసిన మొట్టమొదటి చర్య భౌతిక నిర్ణయవా దానికి వెన్నెముకగా రూపొంది, సౌందర్యమనే రసవాద విలువను ఈ తత్వంలోనికి ప్రవేశింపకుండా అడ్డుకొంటున్న నాల్గవ సూత్రాన్ని తీసివేయటంగా వుండాలి; లేదా ఆ విలువ రాడికల్ హ్యూమనిజం పరిధిలో సముచిత స్థానాన్ని, సంతరించుకొనే విధంగా సూత్రాన్ని సవరించవచ్చు. సవరణ వివరణం ఈ క్రింది విధంగా వుండవచ్చు:

"ప్రకృతి సర్వ సృజనాత్మకమూ (Omnificent) సర్వజ్ఞమూ (Omniscient) . అది స్వయం నిర్ణయాత్మకంగా నిత్యం అభివ్యక్తమవుతూ వుంటుంది. ఈ పరిణామ క్రమంలో మానవుడు ఆత్మజ్ఞానం కల సృజనాత్మక (Self-conscious creative thinker) భావుకుడుగా అవతరించాడు. అతని ప్రధాన లక్షణాలలో ఒకటిగా హేతుత్వం ఆవిర్భవించింది. ఈ హేతుత్వం మూలంగా దాని భౌతిక ప్రతిరూపమైన నియమ బద్ధతను ప్రకృతిలో మానవుడు దర్శింపగలుగుతున్నాడు....."

మానవుడు హేతుబద్ధ దవుతున్నది ప్రకృతి నియమబద్ధం కావటం వల్ల కాదు; మానవుడు హేతుబద్ధుడు కావటం వల్లనే ప్రకృతి అతనికి నియమబద్ధంగా కనిపిస్తుంది. ఈ వాక్యం 'మానవుని నుంచి ప్రకృతివైపుకు' అన్న ప్రాధమికావశ్యకతను నెరవేర్చటమేకాక, అంతర్గత కారణ విభావననుకూడ తృప్తిపరచి, తద్వారా సిద్ధాంతపరంగా తారట్లాడుతున్న అంతర్గతవైరుధ్యం నుంచి రాడికల్ హ్యూమనిస్టు తత్వానికి విముక్తి కలిగిస్తున్నది. (ఇక్కడ 1992 సెప్టెంబరు The Radical Humanist లోని 'Aesthetics and Radical Humanism' అన్న నా వ్యాసాన్ని చదవమని పాఠకులకు విజ్ఞప్తి.)

నాలుగో సూత్రాన్ని తీసివేసినా సవరించినా, 22 సూత్రాల ప్రధాన ప్రకటన మొత్తాన్ని సహజంగానే పూర్తిగా పునఃపరిశీలించవలసి వుంటుంది; దానివల్ల సూత్రాలలో అక్కడక్కడ మరికొన్ని సవరణలు రావలసిన అవసరం కలగవచ్చు.

**శాస్త్రీయ ఆంతర్యం:** మనకు మానవుడే అన్నిటికంటె అధిక ముఖ్యుడు. మానవ వ్యక్తి ప్రాముఖ్యాన్నీ ఆధిక్యాన్నీ హుందాతనాన్నీ విలువనీ కాపాడే తీరులో రాడికల్ హ్యూమనిస్టు తత్వాన్ని సహేతుకంగా నిర్మాణం చేయాలి. మనం ముందుగానే రూపొందించుకొన్న ఊహలూ అపరీక్షితాభిప్రాయాలూ - అర్ధశతాబ్దంగా మన మనసుల్లో పెంచిపోషించుకొంటూ వస్తున్న కన్నబిడ్డలులాగా - మనల్ని ముగ్ధుల్ని చేస్తూ వుంటాయి. ఆ మోహ జాలంలో మనం బందీలం కాకూడదు.

ఈ తరహా అనిర్ణయవాద పద్ధతిలోకి అతీత ప్రకృతివాదం అనే పెనుభూతం అడుగు పెడుతుందేమో అని ఎవరూ భయపడ నవసరం లేదు; ఎందుకంటే ఇది ఎక్కడా హేతువాదం నుంచి, ఏకతావాదం నుంచి, మానవవాదం నుంచి పక్కదారి తొక్కటంలేదు. నా మటుకు నేను మూడు దశాబ్దులకు పైగా ఈ ఆలోచనా విధానాన్ని అంటిపెట్టుకొని వుంటున్నాను. ఇంతకాలంగానూ (స్వయం నిర్ణయవాదాన్ని మినహాయించి) అన్నిరకాల నిర్ణయవాదాలను నిరసిస్తూనే వస్తున్నాను. భావవాదం, పదార్థవాదం అనే రెండు విభావనలను కాలరాస్తూనే వస్తున్నాను. ఏ మానవ కేంద్ర మానవ వాదం (Anthropocentric Humanism) మాత్రమే నిర్హేతుకవాదాన్ని ప్రామాణ్యవాదాన్ని ప్రతిఘటించగలవని నేను విశ్వసిస్తున్నానో ఆ మానవవాదానికి నా విషయంలో ఏ విధమైన ముప్పమూ వాటిల్లటం లేదు. నా విషయంలో సత్యమైనది ఇతరుల విషయంలో కూడ సత్యం కావటం సంభవమే కదా! అయితే ఆ ఇతరులు తమ మనస్సులను మూతలు లేకుండా విప్పార్చి స్వతంత్రంగా వుంచుకో గలిగితినే ఇది సంభవం.

ఏమైనా కాని హేతువాదానికి మానవవాదానికి అంకితమైన మనం మన నిర్ణయాలను అడుగడుగుకూ సందేహించటం ముందు నేర్చుకోవాలి. ఇక్కడ మనం శాస్త్రజ్ఞుని స్వభావాన్ని అలవరచుకోవాలి. నిజాయితీగల శాస్త్రజ్ఞునికి తన శోధనాంశాలూ నిర్ణయాలూ అన్నీ అర్ధసత్యాలు మాత్రమే. ఎందుకంటే అతని జ్ఞానాన్వేషణలో పరిశీలన పరిశోధన, ప్రయోగం, హేతుబుద్ధి అన్న మార్గదర్శక పద్ధతులపై

మాత్రమే అతడెప్పుడూ ఆధారపడి వుంటాడు కాబట్టి. ఈ అర్థంలో రాయ్ శాస్త్రీయ తత్త్వకారుడు. ఆయన చాలవరకు అపరీక్షితాభి ప్రాయాలకు లోనుగాక ఈ మార్పును ఆహ్వానించే మృదు మనస్కుడు. అలా కాకుంటే మూడు దశాబ్దుల వ్యవధిలో క్రమక్రమంగా ఆటవిక హింసావాదం నుంచి నాగరిక మానవవాదం దాకా మారగలిగి వుండేవాడు కాదు. అయితే రాడికల్ హ్యూమనిస్టు తత్వాన్ని ప్రతిపాదించిన తర్వాత దీర్ఘకాల రుగ్మతతో అకాల మరణానికి గురికావటం మన దురదృష్టం. ఆయన ఈనాడు జీవించి వున్నట్లయితే నా హృదయపూర్వకమైన సందేహాలనూ విభేదాలనూ గణనలోనికి తీసుకొని, రాడికల్ హ్యూమనిస్టు తత్వాన్ని స్వయం సమగ్రంగా తయారు చేయుటానికిగాను దాన్ని సమీక్షించి సంస్కరించటానికి అనువైన చర్యలు తీసుకోటానికి వెనకాడేవాడు కాడని నా నమ్మకం. అయితే రాయ్ సహచరులుగా వున్న అదృష్టవంతులు; గురువుగారి అంతర్యాన్ని ఆకలింపు చేసుకొన్న వారని నేను భావిస్తున్నవారు, చాలా కొద్దిమంది ఇంకా జీవించి వున్నారన్నదే నా ఆశ.

## రాయ్ అక్షరం కన్నా ఆంతర్యం మిన్నగా భాసించాలి!

"మానవునిలో అన్నిటికన్న దిగువస్థానంలో వున్న నరకానికి దిగిపోయే లోతులున్నాయి; అన్నిటికన్న ఎగువ స్థానంలో వున్న స్వర్గానికి ఎగబ్రాకే ఎత్తులున్నాయి; ఎందువల్ల? స్వర్గనరకాలు రెండూ మనిషి స్వయంగా నిర్మించుకొన్నవే కావటంవల్ల. మానవుడేనాటికైనా అద్భుత సంఘటనయే! నిగూఢ మర్మమే!"

– కార్లైల్

# IMPORTANCE OF BEING NAKED

Sir, – In your editorial "Au Natural" (October 24-25), you have ignored the philosophical significance of nakedness. William Blake discems some kind of divine innocence in the nakedness of a woman and an Urdu couplet tells us eloquently that no dress is better than nudity since it is the only garment which cannot be turned inside out: "Tan ki uryani se behtor nahin libas koi; ye voh jama hai, jiska nahin seedha-ulta". Apparel often conceals the man and in one of Amrita Pritam's poems the beloved asks her lover to take off not only his shirt and shoes, but also his body!

In his book Sartor Resartus, Thomas Carlyle expounds his "clothes-philosophy", according to which clothes stand for sham and pretences, hollow customs and hollow rank. These clothes, says, Carlyle, must be burnt because they have become an obstacle to one who is aiming at spiritual progress.

In India, nudity has a deep religious meaning. Lord Mahavira set aside his garment only 13 months after he renounced the world and spent the rest of his life in complete nudity. By doing so, he emphasized the importance of non-possessiveness - a virtue without which one cannot attain "Kaivalya". The Gita goes a step further and says that the human body itself is a piece of cloth to be discharded at the time of death. "Mokhsa", it is said, is attained when the soul is completely nude and has discarded everything to which it became attached due to "Avidya". Since Mokhsa or Nirvana is described as the ultimate goal of man, and since man is said to be essentially a spirit, it appears that nakedness is the ultimate goal that each of us is striving to achieve - consciously or unconsicously.

The fact is that every normal person likes to be in his birthday suit. Modern civilization has forced man to lead an artificial life and the desire to be in a state of nature is very strong in modern society. This explains why bedrooms and bathrooms are two very important places for most of us! - Yours, etc.,

CHAITANYA NAGAR, Howrah, October, 24. **Courtesy:** Statesmen

# కథక చక్రవర్తి రావిశాస్త్రి

- డా॥ బూదరాజు రాధాకృష్ణ

అజంతా మాటల్లో ''అశ్రుగంగాజలాల్లో అగ్నిసుందరిని సృష్టించిన కథకుడు'' రాచకొండ విశ్వనాథశాస్త్రి 1993 నవంబరు 10వ తేదీన కన్ను మూశాడు. ఆయన కవిత్వాన్ని వచనరూపంలో చెప్పాడో, వచనాన్ని కవిత్వంగా మలిచాడో చెప్పటం కష్టం. అతడేం చేసినా సామాన్య కవీకాదు, సాధారణ రచయితా కాదు. కవులకూ, రచయితలకూ సాధారణ ధర్మమో లక్షణమో అయిన ఆత్మస్తుతి అతడికి చేతకాదు. తన రచనలను ప్రచురణ పూర్వమే నలుగురినీ విసిగిస్తూ చదివి చదివించి జన్మ తరించిందనుకునే స్వభావం లేకపోగా, ప్రచురణా నంతరం కూడా వాటి ప్రస్తావన తెచ్చేగుణం కూడా లేనివాడు. ఆయన నటుడు, గాయకుడు, న్యాయవాది వగైరా. సరసుడు, చమత్కారి, సంభాషణ కుశలుడు. ఎంత తీవ్ర భాషలో రాశాడో అంత సుకుమారంగా ప్రవర్తించేవాడు. తన రచనలు తప్ప ఇతరులవి చదవని, తన మాటలను తప్ప తక్కిన వాటిని వినని వినలేని ఆత్మానురాగం లేని మనిషి. ప్రచారానికీ పురస్కారాలకూ వీలయినంత దూరంగా జీవించిన సాహితీపరుడు. ప్రపంచ సాహిత్యంలోని మహారచయితల నెంత ఆరాధనాభావంతో చదివి జీర్ణించుకునేవాడో అంతకన్నా ఎక్కువ అభినివేశంతో అధోజగత్సహోదరుల దీనగాథలను భాషాభావాలను పుడిసిలి పట్టాడు. ఇరవయ్యో శతాబ్దంలో మరే తెలుగు రచయితకూ కవికీ జరగని విచిత్ర సన్మానం పొందినవాడు. అత్తలూరు నరసింహారావనే వీరాభిమాని 1977లో 'రావి శాఖీయం' అనే నిఘంటువు ప్రచురించాడు. విశాఖ మాండలిక ప్రయోగాలవల్ల రావిశాస్త్రి రచనలు అన్యప్రాంతాలవారికి స్పష్టంగా అర్థం కావటం లేదన్న అభియోగాన్ని పురస్కరించుకొని 1781 పదాలనూ పదబంధాలనూ వివరిస్తూ ఈ నిఘంటువును వెలువరించారు. 'మహా భారత నిఘంటు' వొకటి ఇప్పటికీ అసంపూర్ణంగా రెండు సంపుటాలుగా వెలువడింది. మరే తెలుగు రచయితకూ ఇటువంటి భాగ్యం కలగలేదు.

రావిశాస్త్రిగా రచయితలకూ, సాహితీపరులకూ ఆయన పరిచయం. ఇంట్లో 'విశ్వం'. కోర్టుల్లో ఆర్.వి.యస్. పేద క్లయింట్లకాయన 'చాత్రిబాబు'. వృత్తిరీత్యా న్యాయవాది అయిన రావిశాస్త్రి ప్రవృత్తిరీత్యా మాండలిక భాషాభిమాని అయిన రచయిత. తెలుగులో మాండలిక సాహిత్యం చాలా తక్కువ. కన్యాశుల్కం ప్రభావంవల్ల విశాఖ కళింగ మాండలికంలో వెలువడ్డ మహారచనల్లో రావిశాస్త్రి కథలూ, నవలలూ నాటికలూ అద్వితీయాలు. ఆ బాణీలో రాయాలని ప్రయత్నించిన బీనాదేవి (భాగవతుల నరసింహారావు) వంటి మంచి రచయితలు కూడా రావిశాస్త్రి స్థాయినందుకోలేదు. దీనగాథలు వింటూ వారి భాషనూ పలుకుబడినీ రావిశాస్త్రి పట్టుకొన్నాడు. కాదు. జీర్ణం చేసుకున్నాడు. తొలిదశలో ''జాస్మిన్, కాండాకాంత, శంకరగిరి గిరిజాశంకరం, గోల్కొండ రాంప్రసాద్, అప్ జానా వంటి కలంపేర్లతో రాశాడు. అల్పజీవి (1953) రచనా కాలానికి రా.వి.శాస్త్రి అయినాడు - మహాప్రస్థానం నాటికి శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా స్థిరపడ్డట్లు. శ్రోతగా రావిశాస్త్రి జనరంజకుడైనాడు. యువకులతో మిత్రులతో ఇతరుల గ్రంథాలను చర్చించి ఆమోదయోగ్యుడైనాడు. సరస చమత్కార

సంభాషణలవల్ల ఎందరికో ఇష్టుడైనాడు. ప్రసన్నతా సులభత్వాలవల్ల సామాన్య జనానికి ఆరాధ్యుడయినాడు. చిన్నవయసులోనే కవిగారు (మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు) అస్తమించిన తరవాత విశాఖ సాహితీ లోకానికి తానే పెద్ద దిక్కయినాడు, పురిపండా వంటి వయోవృద్ధులున్నా. బిరుదులూ, పురస్కారాలూ, పదవులూ లేని తెలుగు కవిరచయితల్లో శ్రీశ్రీ తరవాత అంతగా ప్రేమ పాత్రుడై ఆరాధనీయుడైనవాడు రావిశాస్త్రి ఒక్కడే. చదివిన మధ్య తరగతి విద్యావంతులకూ, చదివించుకున్న సామాన్య జనానికీ రావిశాస్త్రి రచనలు రసానందం కల్పించాయి. ఛార్లీ చాప్లిన్ నటనలాగానే రావిశాస్త్రి రచనలు కరుణరస ప్రవాహం నుంచి హాస్య రసోత్పత్తి చేశాయి. రచనల్లోని తీవ్రవాదం వ్యక్తిగత ప్రవర్తనలో లేని రావిశాస్త్రికి సంకు పాపారావు నుంచి బీనాదేవి వరకు ఎందరో ''ప్రయివేటు ఆంజనేయు''లు సమకూడారు.

రావిశాస్త్రి సంగీతం ఎందరినో ముగ్ధులను చేసింది. అతని నటనాశక్తి, దర్శకత్వం ఎందరినో ఆశ్చర్య చకితులను చేశాయి. వినీ చూసీ ఈ విద్యలు నేర్చినవాడు రావిశాస్త్రి. ఎలా సాధించావంటే కన్యాశుల్కంలోని బైరాగితో దుకాణదారు చెప్పిన మాటలే చెప్పేవాడు. ''తమవంటివారి దయవల్ల గురూ'' అని. అ మహానాటకంలోని కల్లంగడి దృశ్యాన్నే రావిశాస్త్రి బహుముఖాలుగా ప్రస్తరించి సారా కథలూ సారో కథలూ రచించాడనిపిస్తుంది. సంభాషణల ద్వారా పాత్ర స్వభావాన్ని చిత్రించే నేర్పు గురజాడ తరవాత రావిశాస్త్రికే పట్టుపడిందనాలి. తనకు ముందున్న కొడవటిగంటి కుటుంబరావు, వుప్పల లక్ష్మణరావు, కాళీపట్నం రామారావు వంటి సుప్రసిద్ధ రచయితలు మధ్యతరగతి దౌర్భాగ్యాలకే పరిమిత మయితే తాను అధోజగత్తులోని దురదృష్టవంతుల ధూర్త ప్రవర్తనలనూ అందుకు కారణాలనూ విస్తరించి విశ్లేషించి సమాజ దౌర్బల్యాలను కళ్ళకు కట్టించాడు. న్యాయ వ్యవస్థలోని కల్మషాన్నీ, పాలన వ్యవస్థలోని కశ్మలాన్నీ, వ్యాపార రంగంలోని కాలుష్యాన్నీ కాచి వడపోశాడు. తన నాటికలయిన 'తిరస్కృతి'లో కొత్తపేట రాజిగాడుగా, 'నిజం'లో ప్రాసిక్యూటరుగా నటించి పాత్ర స్వభావాలను అభినయపూర్వకంగా ప్రదర్శించాడు. నిజం' కనీసం వందసార్లు ప్రదర్శిత మయింది. దృశ్య కావ్య ప్రయోజనాలను నిరూపిస్తూ, తెలుగు రచయితల్లో తనను గురజాడ, పానుగంటి, శ్రీశ్రీలు ప్రభావితం చేశారని, పాశ్చాత్యుల్లో డికెన్సు, బెహూల్, గోర్కీ వశీకరించుకున్నారని చెప్పే రావిశాస్త్రి డాస్టావిస్కీ లాగా రచించాడు. మానవ మనస్తత్వ పరిశీలనకూ చైతన్యస్రవంతి (stream of consciousness) లో రచించటానికీ సాహిత్యంలో స్థానమిచ్చాడు. రెండువేల పాత్రలను సృష్టించిన బాల్జాక్‌ను ఆదర్శంగా స్వీకరించాడు. ''నామీద నాకుండే అసహ్యం కొద్దీ కూడా నేను కొంతగా రచన చేశా''నని నిర్మోహమాటంగా రాసుకున్నాడు. ''చదివినా సంస్కృతం రాలా. చదవకపోవడం వల్ల తెలుగు వచ్చిం''దని విశ్వసించాడు!

రావిశాస్త్రి రచనల్లోని ప్రత్యేకత అయా పరిస్థితులకు, పాత్రలకు తగ్గపోలికలను పుంఖాను పుంఖంగా గుప్పించటం మూర్తామూర్త వస్తువులను ఉపమించటంలో బహు నైపుణ్యం చూపినవాడాయన. సమీప ప్రకృతినుంచి ఉపమానోపమేయాలను స్వీకరించటం, చలాచల వస్తువులను పోల్చటం ఆయన నైపుణ్యానికీ ప్రకృతి పరిశీలనకూ నిదర్శనాలు. ఉదాహరణకు - ఆపిల్ల మల్లె మందారాల మిక్చర్... నలుగురు ఆడపిల్లలు వచ్చిన బల్లుల్లా పడుకున్నారు...

(ఆవులు) మురికి చెరువు జొరబడ్డ కొమ్ములొచ్చిన మొసళ్ళమందలా ఉన్నాయి... అతని చూపు ప్రశాంతంగా, కడుపునిండా ఎలకల్ని తిని తనివితీరా పాలు తాగిన పిల్లి చూపులా ఉంది... సముద్రపు గాలికి సరువుడుతోట ఏడ్చినట్టు ఏడ్చేదట... ఆ కల్లురొట్టె తనెప్పుడో తాగితాగి మర్చిపోయిన తల్లిరొమ్ములా, తనెప్పుడో ఎవరో ఒకసారి మాత్రం పితకనిచ్చిన ఆవుపాదుగులా... శేషగిరి పెద్దసైజు కోడిపెట్టను చూసి ఏం చెయ్యాలో తెలియని పిల్లిలా అయిపోయాడు... ఆమె కొంచెం నిమ్మరసం తగిలిన పంచదార పానకంలా ఉంది... తాటిచెట్లు ఆకుపచ్చ టోపీలు పెట్టుకున్న నల్ల సిపాయిల్లా నిశ్చలంగానూ, నిటారుగానూ నిల్చున్నాయి... అంబారీ వేసిన ఏనుగు రూపంలో నగిషీలు చెక్కిన ఓ చక్కని పందిరిమంచం ఉంది... ఆ మంచం ప్రక్క ఓ పెద్ద నల్లటిపెట్టె ఉంది. నిద్రపోతున్న వెర్రిగేదెలా ఉంది అది... చెడిపోయిన ముసలమ్మలవంటి నోట్లే చూసేదుగాని కొత్త కన్నెపిల్లలా ఉండే అంతమంచి నోట్లని అంతకు ముందెన్నడూ చూడలేదు'' ఇలా అనేకం.

రావిశాస్త్రి ప్రవృత్తిలో బహుశా 1960 నుంచే మార్పు వచ్చిందని చెప్పవచ్చు. బాల్యంలో ప్రపంచమంతా కాంగ్రెసు మయంగా ఉండేది. విశాఖ రచయితల సంఘంలో (విరసంలో) సభ్యుడుగా ఉండే రావిశాస్త్రి 1961 నాటికే ఆరు సారాకథలు రాసినా అప్పటికాయన విప్లవదృష్టి లేనివాడే. సాంఘిక సంక్షోభాలనూ దరిద్ర నారాయణుల బతుకు బరువులనూ గమనించి సామాజిక స్పృహతో రచించినవాడే. 1966లో రాచకొండ కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నాడు కూడా. అయితే దరిమిలా ఆ పురస్కారాన్ని తిరిగి ఇచ్చేశాడు. 1970లో మరో విరసం (విప్లవ రచయితల సంఘం)లో ప్రతిష్ఠాపక ఉపాధ్యక్షుడైనాడు. ఆయన సామాజిక రాజకీయ దృష్టిలో అప్పటికి పూర్తి మార్పు వచ్చింది. అందుకు కారణం మరో ప్రయివేట్ ఆంజనేయుడు వాసిరెడ్డి వెంకటప్పయ్య కారకుడంటారు. అత్యవసర పరిస్థితిని ప్రకటించిన తరవాత 1975 జూన్ 25వ తేదీన అరెస్టయి ఏణ్నర్ధంపాటు జైల్లో ఉన్నాడు. అప్పుడే మూడుభాగాల 'రత్తాలు-రాంబాబు' రచించాడు. 'రాజు-మహిషి' అనే అసంపూర్ణ నవల 1968లో రాశాడు. 1967 నాటికే 'ఆరు సారో కథలు' వెలువడ్డాయి. 1969లో 'కల కంఠి' అనే కథల సంపుటి వచ్చింది. అందులోని 'పిపీలకం' కథ అఖండాభిమానం సంపాదించింది. 1975లో ''గోవులొస్తున్నాయి జాగ్రత్త'' వెలువడింది. ''సొమ్ములు పోనాయండి, మూడు కథల బంగారం, ఇల్లు'' అనే నవలలు 1981-82లలో వెలుగు చూశాయి. ఇల్లు 1993 జూన్ నుంచి 'స్వాతి' పత్రికలో ధారావాహికంగా వచ్చింది. 1983లో ఆంధ్రవిశ్వ కళా పరిషత్తు వారు 'కళాప్రపూర్ణ' బిరుద మిస్తామంటే నిరాకరించాడు. ''అవార్డులు వచ్చినంతమాత్రాన పాండిత్యం కళకా''దన్న రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి) మాటలు గుర్తుకు వచ్చివుంటాయి. 1976లో ప్రత్యేక తెలంగాణా వాదం రుచించక, తదితర కారణాల తోనూ విప్లవరచయితల సంఘానికి రాజీనామా చేశాడు. రావిశాస్త్రి 300 కథలు రాశాడు. తిరస్కృతి, విషాదం, నిజం - అనే మూడు నాటికలు రచించాడు. ఎన్ని రాసినా ఏమి రాసినా పీడితప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎన్నడూ ఏమి రాయలేదు.

హరిహర్లో రెండేళ్లు మిలిటరీ అకౌంట్సు డిపార్టుమెంటులో ఆనర్సయిన తరవాత పనిచేసి ఆ వాతావరణం సరిపడక రాజీనామాచేసి మద్రాసులో న్యాయశాస్త్రం చదివి 1948నుంచి విశాఖలో న్యాయవాద వృత్తిలో స్థిరపడ్డాడు. క్రిమినల్ లాయర్‌గా అశేష ప్రజాభిమానం

సంపాదించాడు. కేసులు పొడిగించటంగాని, ఫీజుకోసం పీక్కు తినటం గాని ఎన్నడూ చేయలేదు. పోలార్ ఫుట్‌బాల్ క్లబ్బు ప్రెసిడెంటుగా, హిందూ రీడింగ్ రూములో చదరంగం ఆటగాడిగా, విశాఖ సాహితిలో సభ్యుడుగా, గురజాడ కళాకేంద్రం, విశాఖ నాటక కళామండలి వగైరాల్లో నట, దర్శక, రచయితగా, పిల్లల కోడిలాగా మిత్రానుచర బృందంతో విశాఖ వీథుల్లో విహరించిన స్నేహశీలిగా, దీనబాంధవుడుగా పేరు తెచ్చుకున్నాడు. రాజయోగి, సార్వభౌమ రావు వంటి ఉద్దండ పాత్రలనూ, రత్తాలు, అడ్డబుర్ర వంటి సంక్లిష్ట పాత్రలనూ గుమాస్తా సుబ్బయ్యవంటి విచిత్ర పాత్రలనూ సృష్టించాడు. గిడుగు రామమూర్తి గురజాడ అప్పారావుల అడుగుజాడల్లో మాండలిక సాహిత్య సృష్టి చేశాడు. సారాకథలను మూడుసార్లు తిరగరాసి శిల్పానికి పదునుపెట్టాడు. తెలుగు కథకు వాడి, వేడి, వడి ప్రసాదించాడు. వచన రచనలో సొంతబాణీ ప్రవేశపెట్టి 'కథన కవి' అనిపించుకున్నాడు. కరుణలో హాస్యం పుట్టించాడు. కమ్మగా పాడేవాడు. చక్కగా నటించేవాడు. నవ్వుల్లో ఏడుపుల్లో ఎన్నో రకాలు గమనించి వివరించాడు. మచ్చుకు నవ్వుల భేదాలు కొన్ని: రాజయోగి పెదనాయనగారు "నవ్వినప్పుడు పులి నవ్వినట్టుగా అనిపించటమే గాక - ఆ మీసాలు గడ్డాలు కదలడంవల్ల ఆపులి తన పాదలో సహా నవ్వినట్టనిపించింది. ఆవుల కిష్టయ్య గేదె నవ్వినట్టు నవ్వాట్ట. నక్క వికవికా నవ్విందంటాడు. సరువుడుతోట, సముద్రం, ఏనుగు వగైరాలు ఘోషలు ఏడుపుల్లాంటి వంటాడు. ఆయన భాషలో నవ్వులు వెలుగుతాయి. కేకలు మెరుస్తాయి. గాద్గద్యం వెదురుబొంగు గాలి విడిచినట్లుంటుంది. పని మనుషులు చిలకలు కొట్టిన పరువుకాయల్లా నేలకిరాలి చితికిపోయి, చివికిపోయి, చివరికి కుళ్ళిపోతారు. భయపడ్డవాళ్ళ గుండెలు మెయిల్ యింజనుగా మారిపోతాయి. సూర్యుడు నిప్పులు కరిగించి నిండా పోసిన పళ్ళెంలా ఉంటాడు. వెలుగు నిప్పుల కొరడాలా ఉంటుంది. పరస్త్రీని పరాభవించి అనుభవించినవాడు, అవతలివాడి ఖర్చుమీద సుష్టుగా భోంచేసిన వాడిలా సుఖంగా నిద్రపోతాడు. బల్లి కడుపులో దిగబడిపోయిన అంత సీతాకోక చిలుకను చూస్తే ఇంపీరియల్ బాంకులోకి ఎంత డబ్బయినా వెళ్ళిపోయినట్లనిపిస్తుంది. ఎండలో నిలబడ్డ సుందరాంగిని చూస్తే బంగారం భగ్గున మండుతున్నట్లుంటుంది.

రావిశాస్త్రి మాటల గారడీ చేయటంతో బాటు 'మాటల నీడలు' కూడా సృష్టించాడు. "ఆవిడ దేముడు పుట్టించిన మనిషిలా లేదు; దేముళ్లను పుట్టించే మనిషిలా ఉంది" అనే వాక్యంలోని వ్యక్తి స్వభావం మాటలకందదు. ఊహించాల్సిందే. ఇటువంటి అవకాశమున్న పాఠకుడు రచనలో తానుకూడా భాగస్వామినని సంతృప్తి పడతాడు. "ఈ నాటికీ ఇంకా యిలా మిగులుందంటే అందుకు పన్నెండేళ్ల కారణం ఆవిడ పెద్దకొడుకు; ఏడేళ్ళ కారణం చిన్నకొడుకు"లాంటి వాక్యాలు రచనా చమత్కృతికి నిదర్శనాలు; వచన రచనకు కవితా లక్షణం పట్టించిన కారణాలు. ఈ రచనా పద్ధతివల్ల ఆయన రచనలు సామాన్య పాఠకులకు అందుబాటులో లేవనే విమర్శవచ్చింది. సరిగ్గా ఇదే ఆయనకు వాక్యశిల్పి, వచనకవి, కథకులకు కథకుడు, శబ్దలోలుడు, వర్ణన వ్యామోహపరుడు మొదలైన బిరుదులు తెచ్చాయి. 1990లో గుండెపోటు వచ్చి తగ్గిన తరవాత కూడా ఆయన రచిస్తూనే ఉన్నాడు. ఆఖరి నిముషందాకా బాధలోవుండి చమత్కరిస్తూనే ఉన్నాడు. తెలుగు సాహిత్య చరిత్రలో తనకోస్థానం సంపాదించి మరీ కన్నుమూశాడు. ధన్యజీవి. ★

# స్వప్న సిద్ధాంతాలు

- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

కలలు ఎందుకు వస్తాయి? అవి అలా ఎందుకుంటాయి? వాటి ప్రయోజనం ఏమిటి? అవి వేటితో తయారవుతాయి? - అనే ప్రశ్నలను మనస్సులో ఉంచుకొని అనేకమంది మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు, తాత్త్వికులు తమ తమ సంప్రదాయాలనుంచి, దృక్పథాలనుంచి అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. వీటిలో కొన్ని మాత్రమే శాస్త్రీయమైనవి. అయితే ఈ సిద్ధాంతాలలో ఏ ఒకటి స్వప్నాన్ని పూర్తిగ వివరించలేక పోయినప్పటికి, ప్రతిదానిలోను ఎంతో కొంత నిజం లేకపోలేదు.

## (ఎ) శారీరక సిద్ధాంతం

శారీరక ప్రవృత్తికి, అంటే వాత పిత్తశ్లేష్మ ధర్మాలకు, స్వప్నాలకు సంబంధం ఉన్నదని అథర్వణవేదం చెప్పింది. అంటే ఈ మూడు ప్రవృత్తులలో ఏదైన ప్రకోపించినప్పుడు; దాని ఫలితం స్వప్నంలో ప్రతిబింబిత మవుతుంది. అలాగే శరీరంలో ఏవైన అంతర్గతమైన మార్పులు జరిగినప్పుడు ఆ మార్పులు గూడ కలలో కనిపిస్తాయి.

అతిభుక్తి సిద్ధాంతం గూడ ఈ కోవకే చెందుతుంది. ఒకరోజు రాత్రి ఎప్పుడైన అతిగా తినడం వలన ఉదరంలో సంభవించే మార్పులు కలపై ప్రభావాన్ని చూపుతాయి. ఎక్కువగా తిన్న పదార్థాన్ని అరిగించుకోవడానికి, జీర్ణమండలం ఎక్కువ రక్తాన్ని రప్పించుకోవడంవల్ల, మెదడుకు పోవలసిన భాగం తగ్గిపోతుంది. ఇది స్వప్న కారణమవుతుంది. ఇంతవరకు బాగానే వుంది. అయితే ఒకే రాత్రి అమితంగా కోడిగ్రుడ్లు తిన్న నలుగురు వ్యక్తులకు నాలుగు రకాల కలలు ఎందుకు వస్తాయో ఈ సిద్ధాంతం జవాబు చెప్పదు. అందులో ఒకడు తన ప్రేయసిని గురించి కలగంటే, మరొకడు వ్యాపారంలో వచ్చిన నష్టాన్ని గురించి కలగంటాడు. ఇంకొకడు విషసర్పం కాటుకు గురైనట్లు కలగంటాడు. మరొకడు ఉత్తుంగ శిఖరంపై తిరుగాడుతు న్నట్లు కలగంటాడు. నలుగురు తిన్నది ఒకే పదార్థం; కలలు మాత్రం వేరు వేరు. దీనికి మనం ఒక రకంగా సమాధానం చెప్పి సరిపెట్టుకోవచ్చు. ఆనాటి పగలు వారు ఆయా విషయాలను గురించి చర్చించడమో, ఆలోచించడమో, ఆసక్తి చూపడమో జరిగి ఉంటుంది. అందువల్ల అవి వారి వారి స్వప్న విషయాలయ్యాయి. ఇప్పుడు శారీరక స్థితి కలకు మూలం ఎలా అవుతున్నదో చూద్దాము: ఒక రోజు బాగా తీపి పదార్థాలు తిని నిద్రపోండి. పడుకోబోయేముందు దప్పిక అయినా, మంచినీళ్ళు త్రాగవద్దు. అంటే ఎలాగైనా సరే దప్పికతో నిద్రపోవాలి. తప్పక కలవస్తుంది. ఆ కలలో మీరు నీటినో, చమురునో, రక్తాన్నో లేక మరొక ద్రవపదార్థాన్నో త్రాగుతారు. దీనిని బట్టి శారీరక స్థితి - దప్పికగొన్న స్థితి - కలకు మూలమవుతుందన్న విషయం నిర్ధారితమవుతుంది.

అలాగే లైంగికంగా దాహంతో ఉన్న వ్యక్తి విషయంలోను. శారీరకంగా ఆరోగ్యవంతుడైన యువకుడు లైంగిక కార్యకలాపాలకు దూరుడై ఉంటే, తత్సంబంధమైన కలలు గంటాడు.

యువకులు తరుచు స్ఖలనస్వప్నాలకు గురికావడం తెలియనిది గాదు. శారీరక పరిస్థితి స్వప్న స్వభావాన్ని నిర్ణయించినా, స్వప్నవిషయాన్ని నిర్ణయించదు. అతని కలలు మొత్తంమీద లైంగికాలే అయినా, అవి పరపీడన కామ (Sadistic) సంబంధమైనవి కావచ్చు; లేదా సజాతి లైంగిక (Homo-sexual) లేదా స్వపీడన కామ (Masochistic) సంబంధమైనవి కావచ్చు.

కలలకు శారీరకస్థితి ఆధారం అనడానికి మరొక కారణం గూడ చెప్పవచ్చు. మెదడులో కొన్ని ప్రదేశాలను ఎలెక్ట్రోడ్ (Electrode) తో గిలిగింతలు పెడితే కొన్నిసార్లు అతడు కలగంటాడు. ఇది అతడు జాగ్రదావస్థలో ఉండగానే జరుగుతుంది. ఈ పద్ధతిద్వారా పాతజ్ఞాపకాలు కలలో ఎందుకు పునరావృతమవుతాయో వివరించవచ్చు. కలలు యాదృచ్ఛికా లని వీటికి మనోవైజ్ఞానిక ప్రాముఖ్యత ఏమీలేదని, మెదడులో ఉద్దీపింపబడిన భాగాన్ని బట్టి ఆయా జ్ఞాపకాలు పునరావృత్తమవుతాయని చెప్పవచ్చు. అయితే మనం దీనికి మరొక అభ్యంతరం లేవదీయవచ్చు. కలలో జ్ఞాపకాలు యథాతథంగా కాక కొన్ని మార్పులకు చేర్పులకు లోనై పునారావృత్తమవుతున్నాయి. అదీకాక, జ్వరతీవ్రత ఉన్నప్పుడు, మెదడు మొత్తం రక్తంలోని టాక్సిన్ (Toxin)తో క్షాళితమవుతుంది. అలాంటప్పుడు ఆ జ్ఞాపకాల భాగాలే ఎందుకు ఉద్దీప్తమవుతున్నాయి? ఇతర భాగాలు ఉద్దీప్తమై అందులోని జ్ఞాపకాలు కలలో ప్రత్యక్షం కావచ్చు గదా? దీనికి సమాధానం ఇలా చెప్పవచ్చు; మెదడులోని కొన్ని భాగాలలో పాతసంఘటనలకు సంబంధించిన భయం, కోపంలాంటి ఉద్వేగాలు నిక్షిప్తమై ఉండి, ఈ భాగాలు మాత్రమే ఉద్వేగంతో ఉండి, టాక్సిన్‌తో తడవగానే ఆ ఉద్వేగానుభూతులు స్వప్నాలకు, భ్రాంతికి దారితీస్తాయి. కోడిగ్రుడ్లు అధికంగా తిన్న నలుగురు విషయంలోను ఇదే వర్తిస్తుంది. వారి వారి మెదడు పాతర్లలో నిక్షిప్తమై ఉన్న ఉద్వేగాలే స్వప్నాలలోను ప్రతిబింబించాయి. ఒకనికి మెదడు పాతరలోనుండి గత సంఘటనకు సంబంధించిన ప్రియురాలి జ్ఞాపకం, దానికి సంబంధించిన ఉద్వేగం వెలికి వచ్చాయి. ఇతరుల విషయంలోను అంతే. ఒక బాలుడు జ్వరంలో వేగిపోతూ, నరకంలో, అగ్నికీలలో కాల్చబడుతున్న భ్రాంతికి లోనయ్యాడు. అగ్ని కీలల భ్రాంతిని జ్వరం కలిగించవచ్చు. కాని, మరి, నరక భ్రాంతి ఎలా ప్రవేశించినట్లు? దీనికి సమాధానం నాటి పగటి సంఘటనలలో చూడాలి. ఆ పిల్లవాడు ఆరోజు ఒకరి తోటలో మామిడిపళ్లు దొంగతనం చేశాడు. ఆరోజే, దొంగతనం చేసిన వారిని నరకంలో కాలుస్తారని 'కాశీకావడి' వాడు చెప్పగ విన్నాడు. అలా కాలుస్తున్న బొమ్మలను ఆ 'కాశీకావడి' వాడు చూపించాడు. అతడు చేసిన దొంగపనికి ఈ కాశీకావడి సంఘటన తోడై అటువంటి భ్రాంతికి మూలమైంది. దీనిని నిశితంగా పరిశీలిస్తే, శారీరక కారణంతో పాటు ప్రతిస్వప్నంలోను మానసిక కారణంగూడ మిళితమై ఉన్నట్లు తేలుతుంది. అణచబడిన లేదా పాతరవేయబడిన ఔద్వేగిక (మానసిక) అనుభవాలు శారీరక స్థితిలో కలిసి స్వప్నజనకాలవుతున్నాయి. ఇలా శారీరక, మానసిక కారణాలేకాక బాహ్యఉద్దీపనలు కూడ స్వప్నానికి మూలం కావచ్చు. లేక అతడు కంటున్న కలలో అంతర్భాగాలు ఇమిడిపోవచ్చు. ఉదాహరణకు, మనం నిద్రిస్తున్న గదిలో అలారం గడియారం కొట్టే 'టిక్ టిక్' శబ్దం మనకు నిద్రాభంగం కలిగించాలి. కాని అలా జరగదు. ఆ శబ్దానికి మనం గుడిలో గంటలు మ్రోగుతున్నట్లు కలగంటాము. అలాగే ఒకరోజు నేను తెల్లవారుఝాము మెయిలుకు వెళ్ళాలని అలారం పెట్టుకొని నిద్రపోయాను. సరైన టైమ్‌కే గడియారం అలారం కొట్టింది. కాని అది నన్ను నిద్రలేపలేదు. అది నాకు కలలో గడియారంగ కనిపించి, కలలోనే అలారం

కొట్టినట్లు భ్రమించాను. అంటే బాహ్యాజగత్తులోని గడియారం స్వప్న సంబంధమైన గడియారంగ, అది కొట్టిన శబ్దం స్వప్న శబ్దంగ పరివర్తితమయ్యాయి. శారీరకస్థితికి స్వప్నాలకు సంబంధం ఉన్నదనేది నిర్వివాదాంశము. కొన్నిసార్లు శారీరక రుగ్మతలు స్వప్నం ద్వారా ముందుగా తెలుస్తాయి. అస్వస్థతకు లోనైన శరీరావయవాల నుంచి ఉత్పన్నమైన సంవేదనలను అచేతనం ముందుగా గ్రహించి, వాటిని స్వప్నం ద్వారా వ్యక్తీకరిస్తుంది. రోగ లక్షణాలు పైకి కనిపించడానికి ఎంతో ముందుగ రోగం ఆరంభం అవుతుందని మనకు తెలుసు. రోగ లక్షణాలు పైకి కనిపించనంతకాలం రోగం ఉన్నట్లు మామూలుగ పసికట్టలేము. కాని కలలలో అట్టి రోగారంభం వ్యక్తమవుతుంది. ఒక స్త్రీ తన రొమ్ముకు క్యాన్సర్ (పుట్టకురుపు) వచ్చినట్లు పదే పదే కలలు గన్నది. భయవిహ్వల అయింది. నిజంగానే ఆ తరవాత మూడు నెలలకు పుట్టకురుపు బయటపడింది.

## (బి) వ్యక్తి స్మృతి సిద్ధాంతం

''వ్యక్తి జీవితంలో అంతకుముందు రోజుగాని, లేదా సంవత్సరాలకు ముందుగాని, సంభవించిన సంఘటనలు స్వప్నాలకు మూలం. లేదా గత సంఘటనల పునరావృత్తియే కల'', అని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఇందులో చాలవరకు నిజం ఉంది. ఏ స్వప్నాన్ని విశ్లేషించినా, అంతకుముందు రోజు (కలగన్న రాత్రికి ముందలి పగలు) ఆ వ్యక్తి జీవితంలో జరిగిన సంఘటన ఆధారంగా కల ప్రభవిస్తుందని తేలింది. అయితే ఈ సిద్ధాంతాన్ని కొంచెం సవరించవలసిన అవసరమున్నది. ఎందుకంటే వ్యక్తి జీవితంలోని ఆ పగటి సంఘటన, స్వప్నంలో యథాతథంగా, జరిగింది జరిగినట్లుగా, ప్రతిబింబించ బడడం లేదు. జరిగిన సంఘటన కంటె భిన్నంగా ఇందులో వివరాలు మారతాయి; ఉద్వేగాలు మారతాయి; అంటే ఉద్వేగాలు, వివరాలు ఎక్కువ మోతాదులలో ఉండవచ్చు, లేదా తక్కువగా ఉండవచ్చు. జరిగిన సంఘటన జరిగినట్లుగాక, కలలో విరూపణచెంది ఎందుకు పరివర్తిత మవుతుందో ఈ సిద్ధాంతం వివరించలేదు. ఇదే కాదు, శారీరక సిద్ధాంతంగూడ వివరించలేదు. ఉదాహరణకు, విపరీతంగా సణుగుతున్న భార్యను ఒకడు గొంతు పిసికి చంపినట్లు కల కనవచ్చు. ఆ కల నాటి పగటి సంఘటనకు యథాతథ ప్రతిరూపం కాదు. ఆ సణుగుడు అది చూచి, ఆమె పీడ విరగడైతే బాగుండు ననుకొన్నాడే కాని, గొంతు పిసికి చంపేటంత సాహసం అతనికి లేదు. మరి కలలో గొంతు పిసికి చంపడం జరిగింది. అలాగే వీధులలో జన మధ్యంలో నగ్నంగా తిరగాలంటే అవమానం, సిగ్గులతో కుంగిపోతాము. కాని స్వప్నంలో ఆపని మహదానందంగా చేస్తాము. వ్యక్తి గత జీవితంలో ఎన్నో సంఘటనలను, కోటాను కోట్లుగ, కవి విని ఉంటాడు. ఆరోజు పగలు గూడ అతని జీవితంలో ఎన్నో సంఘటనలు సంభవిస్తాయి. వీటిలో ముఖ్యమైన సంఘటనలను మాత్రమే స్వప్నం ఎన్నుకొంటుందా? కానే కాదు. తరుచు, అప్రధాన వ్యక్తులను, సంఘటనలను, అర్థరహితంగా కనిపించే విషయాలను ఎంచుకొంటుంది. ఈ వ్యక్తులు, సంఘటనలు, సన్నివేశాలు పైకి అర్థరహితంగా, అనాసక్తంగా, గౌణంగా కనిపించినా వాస్తవానికి అతని జీవిత సమస్యలతో ఏదోవిధంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, మనకు తెలిసో తెలియకో, ప్రతీకాత్మకంగానో, సూటిగానో అర్థవంతమైన సాకూతమైన సంబంధం ఉండి తీరుతుంది. ఈ 'అర్థం' ఈ 'ఆకూతి', ఇవియేవీ పైకి కనిపించవు. వీటిని స్వప్నంలో వెతికి బయటికి తీయాలి. విశ్లేషించిన ప్రతి స్వప్నంలోను ఇది ఋజువు అయింది. ఉదాహరణకు, ఒకడు ముప్పై సంవత్సరాల క్రితం

చూచిన రామాపురాన్ని గురించి ఇవ్వాళ కలగన్నాడు. ఆ ఊరిని అతడు చూచింది గూడ ఒక్కమాటు మాత్రమే. ఆరోజు అయినా అన్న భార్యను తీసుకురావడానికి వెళ్ళాడు. ఆ తరవాత ఎన్ని గ్రామాలు చూడలేదు. ఎన్ని నగరాలు మెట్టలేదు. వీటిలో ఏ ఒక్కటి రాకుండ ఆ రామాపురమే కలలో ఎందుకు వచ్చింది? దానితో అతనికి ఉన్న సంబంధం అంత ముఖ్యమైంది గూడా కాదు. ప్రస్తుతం భార్యతో అతని సంబంధం బెడిసేట్టుగా ఉంది. దీనిని గుర్తించడం అతనికి ఇష్టంలేదు; ధైర్యమూ చాలడం లేదు. ఈ సమస్యనే రామాపురం ఎత్తిచూపింది. ''రామాపురానికి చెందిన అమ్మాయిని నీ అన్న ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. అది నీ తల్లిదండ్రులకు ఇష్టంలేదు. వారు వారించినా అతడు వినలేదు. అతని వైవాహిక జీవితం ఏమైంది? నీవూ నీ తల్లిదండ్రుల మాట వినకుండా ఈ అమ్మాయిని చేసుకొన్నావు, అనుభవించు'' అని స్వప్నం గుర్తుచేసినట్లయింది. ఎప్పుడో స్మృతి పథంనుంచి నిష్క్రమించిన రామాపురం, పైకి స్వప్నంతో ఏమాత్రం సంబంధం లేకుండ కనిపించిన రామాపురం, అతడు ప్రస్తుతం ఎదుర్కొంటున్న జీవిత సమస్యను, పగలు గుర్తించడానికి భయపడి తప్పించుకు తిరుగుతున్న సమస్యను, స్వప్నం రామాపురం ద్వారా స్పష్టీకరించింది.

## (సి) జాతి స్మృతి సిద్ధాంతము

ఇంతకు ముందు మనం చర్చించిన వ్యక్తి స్మృతి సిద్ధాంతం, వ్యక్తి జీవితానికి సంబంధించిన సంఘటనలు, అనుభవాలు స్వప్నంలో ప్రాముఖ్యం వహిస్తాయని చెబితే, జాతి స్మృతి సిద్ధాంతం జాతి అనుభవాలు, జాతి చరిత్రలో సంభవించిన సంఘటనలు స్వప్నంలో పునరావృత్తమవుతాయని ప్రతిపాదిస్తుంది. ''జాతి శైశవంలో పొందిన అనుభవాలు గూడ వ్యక్తిస్వప్నంలో దర్శనమిస్తాయి''ని, అనేకుల అభిప్రాయము. ఉదాహరణకు పతన స్వప్నాన్ని తీసికోండి. ఎప్పుడో ఒకసారి అయిన ఆకాశంనుంచి క్రిందపడుతున్నట్లు, కల కనని వారుండరు. ఈ కల అనేక రకాల పతనాన్ని సూచించవచ్చు; పడటం అంటే పతనం, కలలో క్రిందపడడం నైతిక పతనాన్ని ప్రతీకాత్మకంగా సూచించడం కావచ్చు. అందుకనే మన భాషలో శీలం కోల్పోయిన స్త్రీని 'పతిత' అంటాము. ఇది పురుషులకూ వర్తిస్తుంది. అలాగే మనం నిద్ర కుపక్రమించడాన్ని ''నిద్రకుపడ్డాడు'' అంటాము. నిద్రకు పడే సమయంలో 'రక్తపోటు' పడిపోతుంది. కనుక ఇటువంటి పతన స్వప్నం 'రక్తపోటు' తగ్గడాన్ని (పతనాన్ని) సూచించవచ్చు. శైశవంలో ఊయెల ఊపులో పొందే ప్రత్యేకానుభవాల (ఊయెల ఊపు పడబోతున్న అనుభవాన్ని కలిగిస్తుంది)ను, రంగుల రాట్నంపై తిరిగిన గిరికీల విలక్షణానుభవాలను ఈ కల సూచించవచ్చు. తల్లిగర్భం నుంచి భూమిమీద పడడంలోని ఔద్వేగిక భయాన్ని అది సూచించవచ్చు. పైన చెప్పిన వివరణలే కాక, వానరం మానవాకృతిని పొందీపొందని సమయంలో చెట్లపై విహరిస్తూ, ఎక్కడ క్రింద పడిపోతామో నన్న భయాన్ని మానవజాతి తన శైశవంలో అనుభవించింది. ఆ జాతి శైశవానుభవం మళ్లీ ఈ పతన స్వప్నంలో వ్యక్తమైంది.

ఇటువంటి స్వప్నం దాదాపు అందరికీ వస్తుందని చెప్పామే కాని, అందరికీ ఒకే అర్థంలో వస్తుందని చెప్పడంలేదు. అంతేకాక ఈ కల కొంతమందికి ఎక్కువసార్లు, మరికొందరికి తక్కువసార్లు వస్తుంది. మనందరం అదే జాతి బిడ్డలంకదా, ఈ తేడాలు ఎందుకని? పడిపోతామనే భయానికి సంబంధించిన ప్రవృత్తి ప్రతి ఒక్కరిలోను ఉంటుంది. కాని ఈ

ప్రవృత్తికి అతని వ్యక్తిగత భీతికారణాలు గూడ తోడైనప్పుడే అటువంటి స్వప్నం వస్తుందని, ఆ వ్యక్తిగత కారణాలే దానికి ప్రత్యేకమైన రంగును పులుముతాయని వ్యక్తిగత భయకారణాలు లేని వ్యక్తులకు ఈ స్వప్నాలు అరుదు అని చెప్పవచ్చు.

ఈ సిద్ధాంతాన్ని బాగా బలపరచినవాడు కారల్ గూస్టావ్‌యాంగ్. వ్యక్తి తన జీవితంలో ఎన్నడూ దర్శించని విశేషాకృతులను, విచిత్రాకృతులను స్వప్నంలో దర్శిస్తున్నాడు. ఈ కదాకార రూపాలు, జాతి పరిణామంలో, ఎప్పుడో ఒక కాలంలో ఉండి, ఆ తరవాత అంతరించి ఉండాలని అతడు తీర్మానించాడు. కొన్ని లక్షల సంవత్సరాలక్రింద ఉన్న జంతువులు ఇప్పుడు భూమిమీద లేవని జంతుశాస్త్రం చెబుతుందని అతడు ఉటంకించాడు. ఉదాహరణకు ఇప్పుడు డినోసరస్ జంతువు లేదు. ఆ విచిత్రాకృతి జంతువులు జాతి అచేతనం (racial unconscious)లో భాగాలైపోయి, వ్యక్తి అచేతనం (Individual unconscious) ద్వారా బహిర్గతమవు తున్నాయన్నాడు. ఈ సిద్ధాంత వివరణ ముందు ముందు యూంగ్ సిద్ధాంత శీర్షికలో 'మూలరూపాల' (Archy types) క్రింద కాననగును.

## (డి) భవిష్యత్సిద్ధాంతం

కలలు గత స్మృతులను, సంఘటనలను, అనుభవాలను ప్రతిబింబిస్తాయని ఇంతకు ముందు చెప్పి ఉన్నాము. కాని భావిక సిద్ధాంతం, అనాగత సంఘటనలను ముందుగానే స్వప్నాలు సూచిస్తాయని చెబుతుంది. ఈ సిద్ధాంతాన్ని అంగీకరించాలంటే, ముందు మనం, ''ఈ విశ్వంలో ప్రతిది నియతమని, అంటే భవిష్యత్తులో జరగబోయే ప్రతి విషయము పూర్వ సంఘటన వలన నిర్దేశితమని, మార్పుకు తావులేదని,'' అంగీకరించవలసి ఉంటుంది. మరి దీనిని హేతువాదులు, స్వేచ్ఛావాదులు, సంకల్పవాదులు అంగీకరించరు. ఇందులో తాత్త్వికమైన, అనేక జటిల సమస్యలు ఇమిడి ఉన్నాయి. కనుక వాటి చర్చ ఇక్కడ అప్రస్తుతము.

బాహ్య ప్రపంచంలో జరుగుతున్న, జరుగనున్న అనేక సంఘటనలను ముందుగానే స్వప్నాలు తెలియజేస్తాయని జనసామాన్యం నమ్ముతున్నది. దీనిని విజ్ఞానశాస్త్రం ప్రశ్నిస్తున్నది; అంధవిశ్వాసంక్రింద జమకట్టింది. కాని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు వినమ్రుడై ఒకమాట చెబుతాడు : మనం అందరంకూడ, మన భయాలను, ఆశాపాశాలను, ఉద్దేశాలను, అశంసలను బాహ్య ప్రపంచంలోకి ప్రక్షేపిస్తాము. అందుకని మన మిత్రుల గూర్చి, బంధువుల గూర్చి కనే కలలలో వస్తుగత సత్యం (Objective truth) కోసం చూడరాదు. స్వప్నం వస్తుగత సత్యంకాదు. అందువలన దానిని అలా చూడవద్దు. అది ముఖ్యంగా ఆత్మగత సత్యం (Subjective truth), కొన్నిసార్లు స్వప్నాలలో ఆత్మగత తథ్యాలు వస్తుగత సత్యాలు ఏకీభవించవచ్చు. అంత మాత్రంచేత దానిని భావి సూచక మనలేము. సైద్ధాంతికంగా దీనిని కాదనలేకపోయినా, చేతనమనస్సు (conscious mind) విస్మరించిన అనేక విషయాలను అచేతనం (unconscious) హెచ్చరికలద్వారా సూచనలద్వారా స్వప్నాలలో తెలియజేస్తుందని ఒప్పుకోక తప్పదు. ఈ విధంగా అచేతనం హెచ్చరించిన అనేక విషయాలు యథార్థాలయ్యాయి.

భావి సూచక స్వప్నాలు, ''ఎటువంటి సంఘటనలను ముందుగా తెలియజేస్తాయి?'' అనే దానిమీద ఆధారపడి, వీటిని రెండు రకాలుగ వర్గీకరించవలసి ఉంటుంది. వ్యక్తి జీవితానికి, ఆలోచనలకు అనుభవాలకు ఏవిధంగాను సంబంధం లేని సంఘటనలను ముందుగా తెలియజేసే స్వప్నాలు ఒక రకము. ఉదాహరణకు విక్టోరియా ఓడ నాలుగు నెలల తరవాత

మునిగిపోతుందనో, జిమీ కార్టర్ హత్య చేయబడతాడనో నేను కల గన్నానుకోండి. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న నాకు ఆ రెండు సంఘటనలతో మనసా, వాచా, కర్మణా ఎటువంటి సంబంధం లేదు. అయినా అటువంటి సంఘటనలు, నా కలలో కనిపించిన రీతిలో పొల్లుపోకుండ, తరవాత జరిగాయనుకోండి. అప్పుడు నా కలల జోస్యం యథార్థమైనట్లు. ఈ కలల సత్యాన్ని వస్తుగత సత్యం (objective truth) అంటాము. దీనిని శాస్త్రీయంగా ఖండించేటంత వరకు శాస్త్రం ఎదగలేదు. అయితే మనం ఒకటి చెప్పవచ్చు; ఇటువంటి కలలు చాల అరుదుగా గాని యథార్థం గావు. ఎక్కడో నూటికో కోటికో యథార్థమౌతాయి. అటువంటి కలలనుంచి మనం ఒక సిద్ధాంతం చేయలేము. ఇటువంటి కలలను ఏరామ విజ్ఞానశాస్త్రం (Para-Psychology) పరిశీలిస్తున్నది.

ఇక రెండవ రకం కలలు : ఈ కలలు స్వాపి (dreamer) జీవితంలో అత్యంతంగా ముడిపడి ఉన్న సంఘటనలను ముందుగా సూచిస్తాయి. మొదటిరకం కలలు వ్యక్తి జీవితానికి సంబంధించి ఉండవు. ఈ రెండవ రకం కలలలోని సత్యాన్ని 'మనో వైజ్ఞానిక సత్యం' (Psychological truth) అంటారు. ఇలాంటి కలలు కోకొల్లలు. ఈ కలల యాథార్థ్యం అందరికి అనుభవమే. ఈ రెండు రకాల కలలకు తేడా తెలియనివారు, వాటిని వీటిని కలగాపులగంజేసి, వీటి యథార్థాన్ని వాటికి అంటగట్టి, భావిసిద్ధాంతానికి బలం చేకూరుస్తున్నారు. వాస్తవానికి ఈ రెండవరకం కలలు భావిని సూచించవు. సూచించినట్లు కనబడతాయి. విశ్లేషణమీదట అంతకుముందు నర్మగర్భంగా ఉన్న విషయం వెలికి వచ్చేసరికి అవి భావిసూచకాలనే భ్రాంతి తొలగిపోతుంది.

భావిని సూచిస్తాయని చెప్పబడే కలలలో అతి ప్రసిద్ధమైనది అబ్రహాంలింకన్ కన్న కల. అతడు హత్య కావింపబడడానికి కొద్దిరోజులు ముందు, ''ఎవరో రోదిస్తున్నట్లు, వైట్ హౌస్‌లో తూర్పు గదిలో ఒక శవం చుట్టు సైనికులు నిలుచున్నట్లు, శవం ఎవరిదని ప్రశ్నించగా, అది ప్రెసిడెంటుదని, ఒక హంతకుని చేతిలో ప్రెసిడెంటు చనిపోయాడని వారు చెప్పినట్లు'', కలగన్నాడు. ఈ కలను వివరించడం కష్టమే అయినా, అసాధ్యం మాత్రం కాదు. లింకన్‌కు దిన దినం ఎన్నో బెదిరింపు ఉత్తరాలు వచ్చేవి. అతని హత్యకు కుట్ర పన్నుతున్నారని, పన్నారని, వారు సఫలులు కాలేదని అతనికి తెలుసు. తాను చాల అపాయకర స్థితిలో ఉన్నాడని అతడెరుగు. ప్రెసిడెంటు చనిపోతే అతని శవాన్ని ఎక్కడ ఉంచేది, సైనికులు ఎలా దాని చుట్టు ఉండేది, ఏ గదిలో ఉంచేది ఆయనకు తెలుసు. తను ప్రెసిడెంటుగా చనిపోవడం జరిగితే ఫలానా గదిలో తన శవాన్ని ఉంచుతారనే ఊహ అతనిలో మెదలి ఉండవచ్చు. ఆ ఊహ, బెదిరింపు ఉత్తరాలు, కలిసి ఈ స్వప్నానికి దారితీశాయి. ఈ సంఘటనకు మూలాలు గతంలోను, వర్తమానంలోను ఉన్నాయి. జోస్యం చెబుతాయని మనం భావించే అనేక స్వప్నాలను లింకన్ స్వప్నంకంటె తేలికగ వివరించవచ్చు. ఉదాహరణకు క్రింది కలను చూడండి : ఒకడు తన ప్రియురాలిని విపరీతంగా విశ్వసించాడు. ఆమెను శంకించవలసిన కారణంగాని, సంఘటనగాని, ఆమె ప్రవర్తనలో లోపంగాని అతనికి కనిపించ లేదు. అసలు ఆమెపై అనుమానమే లేదు, అటువంటి స్థితిలో ఆమె అతనితో నాటకమాడుతున్నట్లు కలగన్నాడు. ఆ కలను అతడు విశ్వసించలేకపోయాడు. కలలు కల్లలని సరిపెట్టుకొన్నాడు. కాని కొన్నాళ్ళకు ఆకల యథార్థమైంది. అతని చేతనమనస్సు, అతని విమర్శనాత్మకదృష్టి, అతని హేతుదృష్టి ఆమె ప్రవర్తనలోని సూక్ష్మమైన తేడాలను గమనించ లేకపోయాయి.

కాని అతని అచేతనం ఆమెలోని నర్మగర్భ సూక్ష్మాంశాలను పసికట్టింది. అచేతనంలో ఏమి జరిగేది చేతనానికి తెలియదు గదా! అందుకే అచేతనం తనకున్న రాచబాట ద్వారా - స్వప్నం ద్వారా - ఆ విషయాన్ని తెలియజేసింది. ఇంతకు ముందు చెప్పిన 'రొమ్ము క్యాన్సర్' కలను గూడ దీనికి ఉదాహరణగా గ్రహించవచ్చు.

మన చేతనమనస్సు గ్రహించలేని అనేక విషయాలను అచేతనమనస్సు గ్రహిస్తుంది. మనకు తెలియకుండానే అది తర్కిస్తుంది; అనుమానిస్తుంది. ఫలితాలను అంతర్బుద్ధి ద్వారా (Intution) మనకు తెలియజేస్తుంది. కొంతమందికి అనేకరకాల అనుమానాలొస్తాయి. ఆ అనుమానాలు తరవాత నిజంగానే నిజమవుతాయి. ఆ నిర్ణయాలకు వారు ఎలా వచ్చిందీ చెప్పలేరు.

ఇటువంటి స్వప్నాలు, మనకు తెలియకుండానే మనలో ఏమిజరిగేది తెలియజేస్తాయి. ఒకనికి, తను పరీక్షల్లో కృతార్థుడ నవుతానని విపరీతమైన ఆత్మవిశ్వాసం ఉంది. కాని పరీక్ష తప్పినట్టు కల వచ్చింది. ఆ స్వప్నం అతనికి ఒక హెచ్చరిక. ''అతి విశ్వాసం'' అతని బలహీనతలను గుర్తించకుండ చేసింది. దానితో పరీక్ష ప్యాసు కావడానికి ఎంత శ్రమచేయవలసిందీ అతనికి తెలియకుండ పోయింది. అతడు నిజంగానే పరీక్ష తప్పాడు. పరీక్ష తప్పింది కల కన్నందుకు కాదు, అతి విశ్వాసం అతణ్ణి అంధుణ్ణి చేసినందుకు.

మనస్సుకు అతీంద్రియ శక్తులున్నవో లేవో తెలియదుకాని, జాగ్రదావస్థలో గమనించలేని అనేక విషయాలను అచేతనం గ్రహించి, హెచ్చరికలుగ, భావి సూచనలుగ మనకు స్వప్నాల ద్వారా అందిస్తుందని గట్టిగ నమ్మవచ్చు. బాగా చదువుకొన్న ఒక అందమైన యువతి తనతోపాటు పనిచేసే మరొక యువకుని ప్రేమించింది. లైంగిక సంబంధాలేవి ఏర్పడక ముందే, ఉద్యోగ రీత్యా, ఆమెకు స్థాన చలనం కలిగింది. అక్కడకు వెళ్ళిన తరవాత అతనితో నిద్రించినట్లు ఆమె కలగంది. ఇది ''ఇష్టకామ్యార్థ సిద్ధి'' అని సరిపెట్టుకొంది. మరొక రోజు అతనిని గురించి మరో కలగంది. ఆ కలలో అతనిని తన గదికి రావలసిందిగా కోరుతుంది. 'ఆ పని చేయలేనని' (అక్కడకు రాలేనని) సమాధాన మిస్తాడు. మరొక రోజు అతనిని గురించే మరొక కల. ఈ కలలో అతడు ఆమెకు నగ్నంగా కనిపిస్తాడు. కాని ఆమె అతని అంగాన్ని చూడాలని ప్రయత్నించేసరికి అతడు అటువైపుకు తిరుగుతాడు. ఆమె కన్న మరొక కలలో అతడు ఆమె సినిమాకు వెళతారు. కాసేపు సినిమా చూసిన తరవాత అతడు లేచి ముందువరస సీటులో కూర్చొని ''నాకు ఇక్కడ హాయిగా ఉంది'' అంటాడు.

ఆ తరవాత కొంతకాలానికి ఆమె తిరిగి మొదటిచోటుకు బదిలీ అవుతుంది. అతడామెకు స్వాగతం పలుకుతాడు. తన యింటికి తీసుకెళతాడు. కొంతకాలంపాటు ఇద్దరి మధ్య కథ హాయిగానే నడుస్తుంది. తరవాత తరవాత 'ఆ పనిచేయలేనని' (లైంగిక కార్యం చేయలేనని) ప్రక్కకు తిరిగి పడుకొంటాడు. ఈ ప్రక్కకు తిరిగి పడుకోవడాలు ఆమె భరించలేనంతగా ఎక్కువయ్యాయి. తరవాత తరవాత అతడు నపుంసకు డవుతున్నట్లు స్పష్టం కాసాగింది. ఈ సంగతి అతనికి తెలుసు గాని ఆమెకు తెలియదు. ఎలాగైన ఆమెతో నపుంసకత్వాన్ని జయించాలని అతడు ఆరాటపడ్డాడు. ఈలోపం ఆమె దగ్గర దాచాలనుకొన్నాడు. కాని ఆమె అచేతనం ఈ దాపరికాన్ని సాగనీయలేదు. స్వప్నాలద్వారా బహిర్గతం చేసింది. తరవాత కొలది కాలంలోనే ఆ యింటిలో బాగుండ లేదని ఎదురుగా ఉన్న మరొక ఇల్లు తీసుకొని (సినిమాహాలులో ముందువరసకు మారినట్లు), ఆమెను వదలి అందులో ప్రవేశించాడు.

(సశేషం)

'మిసిమి' సంపాదకులకు :

ఆర్యా,

నవంబర్ 1993 సంచికలో శ్రీ చీమకుర్తి శేషగిరి రావు లేఖకు సమాధానం :

1. 'శ్రేయాన్ స్వధర్మో....'' శ్లోకానికి ''విపరీతము, అసంబద్ధము'' అగు అర్థాన్ని యిచ్చినట్లు నాపై ఆరోపణ. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిచ్చిన వ్యాఖ్యానం చూడండి - "In each of us lies a principle of becoming, an idea of divine self-expression. It is our real nature, svabhava, finding partial expression in our various activities. By following its guidance in our thought, aspiration and endeavour, we progressively realize the intention of the Spirit for us." (XVIII అధ్యా. 47 శ్లోకం) ఈ వ్యాఖ్యానమే కాకుండా ఆయన, ఉపోద్ఘాతంగా 'గీత'పై వ్రాసిన వ్యాసంలోకూడా వ్యక్తి 'స్వధర్మం' ద్వారా ఎలా ఆత్మసాక్షాత్కారాన్ని (అస్తిత్వ సత్యాన్ని) పొందుతాడో వివరించారు. "Arjuna... faces the world of nature and society and feels utterly alone. He does not wish to buy inward security by submission to the social standard. So long as he looks upon himself as a kshatriya required to fight, so long as he is chained to his station and its duties, he is unaware of the full possibilities of his individual action... The individual has not yet emerged. He does not conceive of himself except through the social medium. Arjuna could have overcome his feeling of helplessness and anxiety by submitting completely to the social authority. But that would be to arrest his growth. Any sense of satisfaction and security derived by submission to external authority is bought at the price of the integrity of the self.... Submission is not the human way of overcoming loneliness and anxiety. By developing our inner spiritual nature, we gain a new kind of relatedness to the world and grow into the freedom where the integrity of the self is not compromised." (Introductory Essay, **The Bhagavadgita,** by S. Radhakarishnan, Pub; George Allen & Unwin Ltd., 2nd Edn. 1949, Pages 44-45) ఇది అస్తిత్వవాద దృక్పథంతో ఏకీభవించే వ్యాఖ్యానం.

2. ''స్వధర్మ మపిచావేక్ష్య....'' (II అధ్యా. 31 శ్లోకం) లో అర్జునుని వ్యక్తి ధర్మమూ, వ్యవస్థా ధర్మమైన క్షత్రియ ధర్మమూ రెండూ సమన్వయం చెందుతున్నవి, వైరుధ్యం లేదు. కాబట్టే యుద్ధం చెయ్యమని ప్రబోధం ఉన్నది తప్ప, అదే యిదన్న భావన లేదు.

3. ''గీతారచయిత అభిప్రాయమునకే విరుద్ధము.'' గీతారచయిత అభిప్రాయం 'గీత'లో కాకుండా, వేరుగా చీమకుర్తి వారికి ఆయన చెప్పారా? 'గీత'లోని శ్లోకాలే, దాన్ని వ్యక్తి ఎలా అర్థం చేసుకుంటాడో అదే ప్రమాణం. 'గీత' చరిత్రలో ఏ కాలానికీ నిబద్ధమైన గ్రంథం కాదు! ఇక్కడ 'అర్జునుడు' అంటే ప్రతివ్యక్తీ! భాష్యకర్తలు వారు దర్శించినదాన్ని,

వారుద్దేశించిన ప్రయోజనాన్ని బట్టి అభివ్యక్తం చేశారేతప్ప, వారి భాష్యాలు అసలు 'గీత'కు ప్రత్యామ్నాయాలు కావు. ప్రమాణాలు కావు. 'మతా'న్ని బట్టి వారి వ్యాఖ్యానాలను శిరోధార్యాలుగా భావించేవారుంటే, వారు 'external authority' అని డా. రాధాకృష్ణ గారు చెప్పిన వ్యవస్థాధిపత్యాన్ని అంగీకరించిన వార్తై, భద్రతను కోరినట్లే తప్ప, స్వధర్మాన్ని ఆలంబనం చేసుకునే అన్వేషకులూ, సాధకులూ కాలేరు!

4. ''వెల్లువలో పూచికపుల్ల' అనడంలో వెల్లువ అంటే వ్యవస్థ అని అర్థం చెప్పుకున్న చీమకుర్తివారు, నా వ్యాసాన్ని అర్థం చేసుకునేందుకు నిరాకరిస్తున్నారన్న మాట! వెల్లువ, వ్యవస్థ ఎలా అవుతుంది? వెల్లువ అంటే జీవిత ప్రవాహం. అందులో చుక్కాని లేని పడవలాగ, మార్గం - గమ్యం ఎరుకలేని వ్యక్తి, ఒత్తిడులకు లోనయ్యే వక్తి, వ్యక్తిగా స్వాతంత్ర్యంవైపు ఎలా ఎదుగగలడు? ''పూచిక పుల్లకాక తప్పదేమో! అతని అస్తిత్వమే వ్యవస్థ మీద ఆధారపడి యున్నది కదా!'' అన్న నిస్పృహను వ్యక్తం చేసిన చీమకుర్తి వారింకా మార్క్సిజమ్ మాయావాగుర నుంచీ బయపడలేదన్నది స్పష్టం.

5. వ్యక్తి చేతనలో చాలా పొరలున్నాయి. పాశ్చాత్య దేశాలలో జరిగిన పరిణామాల్లో, మనోవైజ్ఞానిక శాస్త్రం రీత్యా, కళలూ సాహిత్య రీత్యా వచ్చిన వాస్తవికతావాదం బహిశ్చేతన (జాగ్రదవస్థ)కూ, అధివాస్తవికతావాదం అవచేతన (స్వప్నావస్థ)కూ సంబంధించినవి. అస్తిత్వవాదం వ్యక్తి వైశిష్ట్యానికీ, అతని సమాధ్యవస్థకూ, స్వేచ్ఛారూపమైన ఆత్మ సాక్షాత్కారానికి సంబంధించినది. పై రెండింటికి ఉన్న పరిమితులు, అసమగ్రతా, మూడో దానికి లేదు. వ్యక్తి వికాసమే అస్తిత్వ వాదం ధ్యేయం.

6. 'గీత'ను సమాజాన్ని వర్ణించే గ్రంథంగా, వ్యవస్థా ధర్మాన్ని నిర్దేశించేదిగా ఉపలక్షించడం వారి వారి దృక్పథాలనుబట్టి సాధ్యం కావచ్చు. కాని ముఖ్యంగా అది వ్యక్తి అంతరంగంలో, అన్వేషణాపథంలో, అనుభూతిపరంగా అన్వయించుకోవలసిన 'భగవద్గీత'. స్వధర్మం ప్రారంభంలో మొదటి అడుగులో 'విగుణం' గానూ, 'సదోషం'గానూ కనిపిస్తుంది. వ్యవస్థా ధర్మం వలె రాచబటాటగా తోచదు. 'ధూమావృతమైన అగ్ని'. ముందుకు వెళ్లే కొద్దీ ధూమం తేలిపోతూ అగ్ని ప్రజ్వలిస్తూ మార్గం సుగమం అవుతుంది. దానికి ధైర్యం, ఆత్మ విశ్వాసం కావాలి. లేకపోతే చరమశ్లోకం 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' ఉంది. శరణాగతి యే స్వధర్మాన్ని స్పష్టం చేస్తుంది.

– ఆర్.ఎస్. సుదర్శనం

---

## *Last Wish*

***E**LDERLY reader on party manifesto: 'Euthanasia' is all they forgot to include.*

***Courtesy:** Statesmen*

---

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717

# కొత్త రుచులు
# ఆప్కో చేనేతలు

విశిష్టమైన రూపకల్పనల్లో నాణ్యమైన
చేతి అద్దకపు అద్భుతాలు

ఈ తరుణంలో

మీ అభిరుచులకు అనుగుణంగా ఎన్నెన్నో రకాలు
అదునాతనమైన నేతల్లో సాంప్రదాయపు సొంపుల్లో
కళ్లు జిగేలుమనిపిస్తాయి.

అన్ని సందర్భాలలో సరిపోయే సరికొత్తరకాల్లో

## ఆప్కో చేనేతలు

అపూర్వ కళా ఖండాలనుబోలు

గుంటూరు, గద్వాల, వెంకటగిరి జరీ చీరలు;
సిద్ధిపేట, ఉప్పాడ, కొత్తపల్లి, బుటా చీరెలు, పుట్టపాక, నారాయణపేట, ధర్మవరం, పోచంపల్లి టై అండ్ చీరెలు, దుప్పట్లు, తువ్వాళ్లు, లుంగీలు, ధోవతులు, మరెన్నో చేనేతలు

సామాన్య కుటుంబీకులకు పనికివచ్చే చీరెలు, ధోవతులు చౌక ధరలలో
కంటికింపైన డిజైన్లలో పాలియెస్టర్ చొక్కాలు

## మీకు దగ్గరలోగల ఆప్కో ఫ్యాబ్రిక్స్
విక్రయశాలను నేడే దర్శించండి

''సులభ వాయిదాలపై అరువు సౌకర్యంగలదు''

APSHWCSL

ది ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూం వీవర్స్
కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్,
హైదరాబాదు-500 029.

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191


# ''అన్ని బ్యాంకులకన్నా వడ్డీ మిన్న ఆప్కాబ్ అందించే పొదుపు పథకాలలో''

## 46 రోజులకు 11.25%

కాలపరిమితి ధరావతులపై ఆప్కాబ్ అందిస్తున్న వడ్డీరేట్లు
(01-3-1993 నుంచి అమలులో)

| కాలపరిమితి | వడ్డీరేటు |
|---|---|
| ★ 46 రోజుల నుండి 270 రోజుల వరకు | 11.25 |
| ★ 271 రోజుల నుండి 1 సం. లోపు | 11.00 |
| ★ ఒక సంవత్సరము ఆపైన | 11.25 |
| సేవింగ్స్ బ్యాంక్ ఖాతా | 6.25% |

ఆప్కాబ్‌లో ఉన్నాయి పెట్టుబడికి, పొదుపుకు అనేక పథకాలు. ★ గృహలక్ష్మి డిపాజిట్ స్కీమ్ ★ స్వర్ణఫల డిపాజిట్ స్కీమ్ ★ మారేజి డిపాజిట్ స్కీమ్ ★ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపాజిట్ స్కీమ్ ★ క్యాష్ సర్టిఫికెట్ స్కీమ్ ★ బాలసహాయ డిపాజిట్ స్కీమ్ ★ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ★ పెన్షన్ డిపాజిట్ స్కీమ్ సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్ ★ ఎన్.ఆర్.ఐ. (రు) మరియు ★ హోమ్‌లోన్ అక్కౌంట్.

APCOB

## ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి॥.

(షెడ్యూల్డ్ బ్యాంకు)
ట్రూప్ బజార్, హైదరాబాదు
ఫోన్: 44481, 44482, 44483

బ్రాంచీలు: విద్యానగర్ 615192 ★ మలక్‌పేట్ 528983 ★ నారాయణగూడ 664909 ★ విద్యుత్ సౌధ 220378 ★ సికింద్రాబాద్ 76172 ★ సైదాబాద్ కాలనీ 877401 ★ బౌద్ధనగర్ 865518 ★ హిమాయత్ నగర్ 232837 ★ తార్నాక 869351 ★ మాసాబ్‌టాంక్ 225451 ★ దిల్‌సుక్‌నగర్ 875539 ★ చార్మినార్ 524161 ★ బాగ్‌లింగంపల్లి 668944 ★ లోతుకుంట 845527 ★ తార్నాక బ్రాంచ్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ (ఎపిడిడిసియస్ ఆవరణలో) 869308 ★ తిరుపతి 22428.

**సదా మీ క్షేమాన్ని కాంక్షించే బ్యాంక్ ఆప్కాబ్**

(భారతీయ రిజర్వు బ్యాంకు వారి ఆదేశాల మేరకు అన్ని రేట్లు రివిజన్‌కు లోబడి ఉంటాయి.)